



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY



ఈ స్థలం [22 సెంట్లు]

అమ్మబడును

భూమి ప్లాట్ నిర్వహణ - అమ్మకం, అద్దె, కొనుగోలు లేదా పెట్టుబడి కోసం నివాస ప్రాంతంలో భవన నిర్మాణం మరియు గృహ ఉపవిభాగానికి అందుబాటులో ఉన్న ఖాళీ పొడి నేల భూమి ప్లాట్‌తో రియల్ ఎస్టేట్ భావన.




సంప్రదించవలసిన నెంబర్లు

కె. అబెడ్నేగో(రాజు బాబు ) : 9985998066

సిహెచ్. సురేష్ : 9959996243

RAYAVARAM MANDAL, RAYAVARAM VILLAGE, EGDT : 533346



SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 134 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | గురువారం 05 ఫిబ్రవరి 2026 | పేజీలు : 12 | వెల : 2/-


## కృష్ణా జిల్లాలో దొంగనోట్లు ముద్రిస్తున్న ముఠాకు చెక్..


### ముగ్గురి అరెస్టు



**మచిలీపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** కృష్ణా జిల్లాలో దొంగనోట్లు ముద్రిస్తున్న ముఠాకు పోలీసులు చెక్ పెట్టారు. నిందితుల నుంచి సుమారు రూ.6 లక్షల నకిలీ నోట్లు, ప్రింటింగ్ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కృత్తివెన్ను మండలం మిగతా .. 2లో..

## హడలెత్తిస్తున్న పెద్దపులి


### శాటిలైట్ సిటీ సమీపంలో గుర్తింపు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అరణ్యం వీడి జన సంచారంలోకి వచ్చిన పెద్దపులి.. ఐదు రోజులుగా రాజమహేంద్రవరం రూరల్, రాజానగరం నియోజకవర్గాల్లో స్వేచ్ఛగా తిరుగుతూ ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. రోజుకో మిగతా .. 2లో..

## తిరుమల కొండపై వైకాపా దోపిడీ అంతా ఇంతా కాదు

### ఎమ్మెల్సీ నాగబాబు



**విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీవారి భక్తులకి భగవంతుడిని వైకాపా దూరం చేసిందని జనసేన ఎమ్మెల్సీ నాగబాబు విమర్శించారు. ఈ మేరకు ఆయన ఒక వీడియో విడుదల చేశారు. "తిరుమల కొండపై వైకాపా దోపిడీ అంతా ఇంతా కాదు. గెస్ట్‌హౌస్‌ల్లో రూ.500కు దొరికే రూమ్ ఛార్జీలు మిగతా .. 2లో..

## ముడి పొగాకు ఉత్పత్తులపై

# 0 సుంకం

### కేంద్ర ఆర్థిక శాఖ జారీ చేసిన గెజిట్‌కు మద్దతు తెలిపిన ఏపీ రాష్ట్రంలోని పొగాకు రైతులు, చిరువ్యాపారులకు ప్రయోజనమన్న ముఖ్యమంత్రి చంద్రబాబు



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎలాంటి బ్రాండ్ లేని ముడి పొగాకు ఉత్పత్తులపై ఎక్సైజ్ సుంకాన్ని సున్నాకు తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు స్వాగతించారు. ఇది రాష్ట్రంలో జరిగే అన్ బ్రాం డెడ్ పొగాకు వాణిజ్యానికి ప్రయోజనం చేకూ రుస్తుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈమేరకు కేంద్ర ఆర్థిక శాఖ జారీ చేసిన గెజిట్ ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంది. శుద్ధి చేయని పొగాకుకు(హెచ్ఎస్ కోడ్ 2401) వర్తించే సుంకం విధానాన్ని స్పష్టం చేస్తూ ఆర్థిక శాఖ ఈ గెజిట్ ను జారీ చేసింది. ఇక నుంచి అన్ బ్రాండెడ్ పొగాకు రీటైల్ విక్రయాలకు ఎక్సైజ్ సుంకం సున్నాగా పేర్కొంటూ ఈ గెజిట్‌ను కేంద్రం విడుదల చేసింది. పొగాకు విక్రయాలపై పన్నుల విషయంలో ఏకరూపత, స్పష్టత, పారదర్శకంగా ఉండేలా ఈ గెజిట్ ను కేంద్ర ఆర్థిక శాఖ జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం కీలకమైన ముందడుగని ముఖ్యమంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు. గతంలో ఎలాంటి బ్రాండ్ లేని బల్క్ పొగాకు క్రయ విక్రయాలు, వాణిజ్యానికి స్పష్టమైన తేడా లేకపోవటంతో చట్టంలోని వేర్వేరు నిబంధనల కారణంగా ఇబ్బందులు తలెత్తేవి. ఈ తరహా అస్పష్ట విధానాల కారణంగా రైతులు, వ్యాపారులు నష్ట పోతున్న నేపథ్యంలో అన్ బ్రాండెడ్ ఉత్పత్తుల సుంకాన్ని సున్నా శాతానికి తగ్గిస్తూ నిర్ణయం తీసుకు న్నారు. ఈ గెజిట్ ద్వారా ఎక్సైజ్ డ్యూటీ విధింపులో వేర్వేరు వర్గీకరణల వల్ల జరిగే మిగతా .. 2లో..

## అంబటిని హత్య చేసేందుకు

# ప్రయత్నించారు

### వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



**గుంటూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం గుంటూరులో పర్యటించారు. టీడీపీ గుండాలు మొత్తం విధ్వంసం చేసిన, గుంటూరులోని అంబటి రాంబాబు ఇల్లు, ఆఫీస్‌ను సందర్శించి, ఆ విధ్వంసాన్ని ప్రత్యక్షంగా చూశారు. అంబటి కారును ఏ విధంగా ధ్వంసం చేసింది చూసిన ఆయన, దాడి ఏ స్థాయిలో చేశారనేది గమనించారు. మొత్తం దాడి ఘటన గురించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం అంబటి రాంబాబు భార్య, కుమార్తెలు, కుటుంబ సభ్యులను కలుసుకుని పరామర్శించిన వైఎస్ జగన్.. అంబటి రాంబాబు కుటుంబానికి ఓదార్చారు. ఏ మాత్రం అధైర్యపడొద్దని, పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.అనంతరం ఆయన అక్కడే మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో జంగిల్‌రాజ్ నడుస్తోందన్నారు. ప్రజాస్వామ్యం ఖూనీ చేశారని మండిపడ్డారు. ఒక భయానక వాతావరణంతో రాష్ట్రాన్ని పాలిస్తున్నారన్నారు. ఈరోజు అంబటి విషయంలో జరిగింది

## తెలంగాణలో

# ఆర్ఆర్ ట్యాక్స్

### భాజపా జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్



**మహబూబ్‌నగర్, విశ్వం వాయిస్ న్యూస్ :** ముస్లిం ఓటు బ్యాంకు కోసం కాంగ్రెస్ నేతలు ఆరాటపడుతున్నారని భాజపా జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ విమర్శించారు. మహబూబ్‌నగర్‌లోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన విజయ సంకల్ప్ సమ్మేళనంలో ఆయన ప్రసంగించారు. "నిజాం నిరంకుశానికి వ్యతిరేకంగా ఈ గడ్డ నుంచి మిగతా .. 2లో..

# సర్‌ను అలా మార్చొద్దు

### రాజ్యసభలో కమల్ హాసన్



**విశ్వం వాయిస్ న్యూస్ :** తమిళనాడులో కొనసాగుతోన్న ఎన్నికల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై మక్కల్ నీది మయ్యంఅధ్యక్షుడు, ప్రముఖ నటుడు కమల్ హాసన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా రాజ్యసభలో మాట్లాడిన ఆయన ఎన్నికల సంఘం రాష్ట్ర ఓటర్ల హక్కులను తనిఖీ చేస్తూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. "రాష్ట్రంలో త్వరలో జరిగే ఎన్నికల గురించే నా ఆందోళన. దాన్ని అక్షరదోషాలు తనిఖీ చేసే ప్రక్రియగా భావిస్తున్నా. ఓటు ప్రాథమిక హక్కు. ఎన్నికల కమిషన్ మాత్రం మా హక్కును తనిఖీ చేస్తోంది. జాబితా పరిశీలనల్లో అనేక తప్పిదాలు జరుగుతున్నాయి. దీనివల్ల రాష్ట్రంలో దాదాపు కోటి మంది అర్హులైన ఓటర్లు చనిపోయినవారి జాబితాలో ఉండవచ్చని ఆందోళన చెందుతున్నాం. బిహార్‌లో బతికున్న వారిని చనిపోయిన వారి మిగతా .. 2లో..

# ఏప్రిల్ తర్వాత పేదలకు లక్షలాది ఇళ్లు

### తెలంగాణా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి




**గూడూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని చూసి మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. మిర్యాలగూడ మండలం గూడూరులో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం ఏర్పాటు చేసిన 'ప్రజా పాలన - ప్రజా విజయోత్సవ' సభలో సీఎం ప్రసంగించారు. "రేషన్ కార్డుల కోసం గతంలో పదేళ్ల పాటు ఎదురుచూడాల్సిన పరిస్థితి. ప్రస్తుతం రాష్ట్రంలో 3.17 కోట్ల మందికి 6 కిలోల చొప్పున సన్న బియ్యం ఇస్తున్నాం. సన్న బియ్యం వచ్చిన వారు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలి. వరి ఉత్పత్తిలో మిర్యాలగూడ ఆసియాలోనే ముందుంది. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలి. ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఎదురే లేదు.. విజయాన్ని అడ్డుకోలేరు. మిర్యాలగూడ మున్సిపాలిటీలో బీఆర్ఎస్ బీఫాం మీద మిగతా .. 2లో..

## మాకంటే వారి వద్దే

# శక్తిమంతమైన ఆయుధాలు

### పాక్ రక్షణమంత్రి ఖవాజా ఆసిఫ్



**విశ్వం వాయిస్ న్యూస్ :** పాకిస్థాన్ ప్రభుత్వానికి కొన్నేళ్ళుగా బలోచ్ రెబెల్స్ పంటికింద రాయిలా మారారు. వారివద్ద అమెరికా ఆయుధాలు ఉన్నాయని పాక్ రక్షణమంత్రి ఖవాజా ఆసిఫ్ వ్యాఖ్యలు చేశారు. వాటిలో నైట్ విజన్ డివైజ్‌లు, రైఫిళ్ల వంటి అధునాతన ఆయుధాలు ఉన్నాయని పేర్కొన్నారు. అలాంటివి తమ సైన్యం వద్ద కూడా లేవన్నారు. ఈ మేరకు మిగతా .. 2లో..

## విమానం ఇంజిన్‌లో

# మంటలు..

### కోల్‌కతా ఎయిర్‌పోర్టులో ఎమర్జెన్సీ ల్యాండింగ్




**విశ్వం వాయిస్ న్యూస్ :** తుర్కియేకు చెందిన ఓ విమానానికి తీవ్ర సమస్య తలెత్తింది. కాఠ్‌మాండు నుంచి తుర్కియే బయలుదేరిన కొద్ది సేపటికే ఇంజిన్‌లో మంటలు వచ్చాయి. దీన్ని గమనించిన పైలట్ కోల్‌కతా ఎయిర్‌పోర్టులో అత్యవసర ల్యాండింగ్ చేశారు. ఘటన సమయంలో మిగతా .. 2లో..

## రాహుల్ వ్యాఖ్యలు..

# భగ్గుమన్న భాజపా



**విశ్వం వాయిస్ న్యూస్ :** కేంద్రమంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టును ఉద్దేశించి 'ద్రోహి' అంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను భాజపా తీవ్రంగా ఖండించింది. ఆయన వ్యాఖ్యలు ఓ వర్గాన్ని బాధించాయని పేర్కొంది. ప్రతిపక్ష నేతపై లోక్‌సభ స్పీకర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. రాహుల్ గాంధీ అన్ని హద్దులు దాటారని కేంద్రమంత్రి హర్‌దీప్ సింగ్ పురీ విమర్శించారు. "ద్రోహి అనే పదాన్ని తేలికగా తీసుకోకూడదు. దేశానికి ద్రోహం చేసిన వ్యక్తిని ఉద్దేశించి ఈ పదాన్ని ఉపయోగిస్తారు. కేంద్ర మంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టు కేవలం ఓ ఎంపీ మాత్రమే కాదు. దేశానికి సేవలందించిన ఓ కుటుంబానికి చెందిన మిగతా .. 2లో..

## బడ్జెట్‌లో లోపాలు

# చెప్పగలరా?

### రాహుల్‌గాంధీకి నిర్మలా సీతారామన్ సవాల్



**విశ్వం వాయిస్ న్యూస్ :** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సవాల్ విసిరారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ సమగ్రంగా లేదని రాహుల్ చేసిన వ్యాఖ్యలపై సీతారామన్ మాట్లాడుతూ.. ఆయన చేసిన వ్యాఖ్యలకు ఎటువంటి ఆధారం లేదని అన్నారు. బడ్జెట్‌లో లోపాలు ఉన్నాయని చేస్తున్న ఆరోపణలను నిరూపించే అంశాలను కాంగ్రెస్ నేత తన ముందు నిలబడి చెప్పగలరా? అని సవాల్ చేశారు. ఆయన చేసిన మిగతా .. 2లో..

## లండన్‌లో పలు క్రీడా పార్కులను

# పరిశీలించిన మంత్రి నారాయణ బృందం



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీ పురపాలక శాఖ మంత్రి నారాయణ బృందం లండన్ పర్యటన కొనసాగుతోంది. రెండో రోజు పర్యటనలో భాగంగా నగరంలోని క్వీన్ ఎలిజబెత్ ఒలింపిక్ పార్క్‌ను సందర్శించారు. 2012లో ఒలింపిక్స్ కోసం నిర్మించిన పలు క్రీడా పార్కులను మంత్రి పరిశీలించారు. ప్రధాన క్రీడలైన ఫుట్‌బాల్, రగ్బీ, బేస్‌బాల్ పోటీలు నిర్వహించిన లండన్ స్టేడియంతో పాటు ఆక్వాటిక్స్ సెంటర్, హైడ్ పార్క్, లీ వ్యాలీ వేలో పార్కులో నిర్మాణాలను మంత్రితో పాటు అధికారులు అధ్యయనం చేశారు. అమరావతిలో మిగతా .. 2లో..

## రికార్డుస్థాయిలో

# భారత్- చైనా వాణిజ్యం..




**విశ్వం వాయిస్ న్యూస్ :** భారత్- చైనాల మధ్య వాణిజ్యం రికార్డు స్థాయికి చేరుకుంది. గతంతో పోలిస్తే.. 12 శాతం పెరుగుదల కన్పించిందని ఇక్కడి ఆ దేశ దౌత్యవేత్త జు ఫియాంగో పేర్కొన్నారు. ఆయన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. బ్రిక్స్ సదస్సుకు భారతదేశం అధ్యక్షత వహించనున్న మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

## ముడి పొగాకు ఉత్పత్తులపై
# సున్నా సుంకం

ఇబ్బందులు తగ్గనున్నాయి. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పొగాకు రైతులందరికీ మేలు చేసే నిర్ణయమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రైతులకు మంచి ధర దక్కటంతో పాటు వ్యాపారులకు, ఎగుమతులకు కూడా ప్రయోజనం చేకూర్చనుందని వివరించారు. స్పష్టమైన మార్గదర్శకాలు, నిబం ధనల కారణంగా ఎక్సైజ్ డ్యూటీ ఎగవేత గణనీయంగా తగ్గుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. తప్పుడు మార్గాల్లో పన్ను ప్రయోజనాలు పొందకుండా అడ్డుకునేలా ఉన్న ఈ విధానాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమర్థిస్తుందని అన్నారు. ఈ నోటిఫికేషన్‌ను దేశవ్యాప్తంగా ఒకేలా కఠినంగా అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని, కేంద్ర పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డుకు ఏపీ ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.

**ఈ ఏడాది ఫిబ్రవరి 1 నుంచే ఈ మార్పులు అమలు**

పొగాకు హెచ్ఎస్ 2401 కోడ్ కిందకు వచ్చే బ్రాండ్ లేని, రీటైల్ విక్రయాలకు కోసం ప్యాక్ చేయని పొగాకు ఉత్పత్తులకు సున్నా శాతం ఎక్సైజ్ సుంకం వర్తించనుంది. రైతులు సంచులలో విక్రయించే పొగాకు ఈ పరిధిలోకి రానుంది. ఇక దుకాణాల కోసం చిన్న చిన్న ప్యాకెట్లలో ప్యాక్ చేసిన పొగాకు ఉత్పత్తులకు, కంపెనీ బ్రాండ్ పేరు ముద్రించిన పొగాకు సంచులు, ప్యాకెట్లకు కూడా 18 శాతం ఎక్సైజ్ సుంకం వర్తిస్తుందని కేంద్ర ఆర్థిక శాఖ తన గెజిట్ లో పేర్కొంది. ఎక్సైజ్ సుంకంలో తాజా మార్పులతో ముడి పొగాకు సరఫరా వ్యవస్థకు ఉపశమనం లభిస్తుందని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. వాణిజ్య ప్రయోజనాల కోసం విక్రయించే ఉత్పత్తుల నుంచి ప్రభుత్వ ఆదాయానికి కూడా ఇబ్బంది ఉండదని వెల్లడించింది. ముడి పొగాకు రీటైల్ విక్రయాలు పన్ను పరిధిలోకి వస్తుందా లేదా ప్యాకింగ్ వల్ల పన్ను రేటు మారుతుందా అన్న అంశాలపై నిబంధనలు అస్పష్టంగా ఉండేవని.. ప్రస్తుత గెజిట్ నోటిఫికేషన్ తో సందేహాలు తొలగిపోయాయని ఆర్థిక శాఖ వెల్లడించింది. బ్రాండ్ లేని ప్యాకింగ్ లేని పొగాకు రీటైల్ విక్రయాలపై 2026 ఫిబ్రవరి 1 తేదీ నుంచి సున్నా ఎక్సైజ్ సుంకం వర్తిస్తుందని నోటిఫికేషన్ లో పేర్కొన్నారు. మిగిలిన పొగాకు ఉత్పత్తులన్నిటి పైనా 18 శాతం మేర ఎక్సైజ్ సుంకం వర్తిస్తుందని తద్వారా ఆడిటింగ్, బిల్లింగ్ సమయంలో తలెత్తే వివాదాలు తగ్గనున్నాయని ప్రభుత్వం తెలియచేసింది. ఈ నిర్ణయం ద్వారా రైతులు, చిరువ్యాపారులకు ప్రయోజనం కలుగనుంది. రైతులు సాగు చేసిన పొగాకును యథాతథంగా ఎలాంటి బ్రాండ్ లేకుండా సంచుల్లో బల్క్ గా విక్రయిస్తున్నందున దీనికి ఎలాంటి సుంకమూ ఇక వర్తించదని నోటిఫికేషన్ పేర్కొంది. తద్వారా వారికి నేరుగా ప్రయోజనం కలుగుతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. గతంలో అస్పష్టమైన నిబంధనల వల్ల అధికారులు రైతులను కూడా ప్రశ్నించే పరిస్థితి ఉండేది. ప్రస్తుత నిర్ణయంతో రైతులకు ఇబ్బందులు తప్పాయి. బల్క్ పొగాకుపై ఎలాంటి పన్నూ లేకపోవటంతో రైతులకు మెరుగైన ధర కూడా లభించే అవకాశం ఉందని రాష్ట్రప్రభుత్వం తెలియచేసింది. దీంతో పాటు బ్రాండెడ్ ఉత్పత్తుల రీటైల్ విక్రయాల్లో ముడి పొగాకు పేరుతో జరిగే దుర్వినియోగానికి కొత్తగా జారీ చేసిన మార్గదర్శకాలు అడ్డుకట్ట వేయనున్నాయి.

## అంబటిని హత్య చేసేందుకు
# ప్రయత్నించారు

అయితే ఏమి, అలాగే జోగి రమేష్ ఇంటిమీద దాడి అయితేనేమి, విడదల రజిని, బొల్ల బ్రహ్మనాయుడి మీద దాడి.. ఇవన్నీ ఇటీవలి కొన్ని ఘటనలు. ఇవన్నీ రాష్ట్రంలో జంగిల్‌రాజ్‌ను సూచిస్తున్నాయన్నారు. అసలు అంబటి రాంబాబు, విడదల రజిని, జోగి రమేష్, భూమన కరుణాకర్‌రెడ్డి, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, బొల్లా బ్రహ్మనాయుడు.. వారంతా చేసిన తప్పేమిటి? అంటూ వైఎస్ జగన్ ప్రశ్నించారు.

**తిరుమల శ్రీవారి ప్రతిష్టకు భంగం కలిగించేలా..:**

దాదాపు ఏడాదిన్నర నుంచి చంద్రబాబు కావాలని ఉద్దేశపూర్వకంగా అబద్ధాలతో కూడిన ప్రకటనలు చేస్తూ, ప్రజలను మభ్య పెట్టే పని చేస్తున్నారు. పవిత్రమైన తిరుపతి నెయ్యిలో భక్తుల మనోభావాలు దెబ్బతీసే విధంగా, కుట్రపూరితంగా, ఆ నెయ్యిలో జంతువుల కొవ్వు ఉందని, పంది కొవ్వు ఉందని, చేప నూనె కలిసింది అంటూ.. రకరకాలుగా దుష్ప్రచారం చేశారు. చంద్రబాబునాయడు, ఆయన కొడుకు లోకేష్, పవన్‌కళ్యాణ్.. ఉద్దేశపూర్వకంగా, శ్రీవెంకటేశ్వరస్వామి ప్రతిష్టను దెబ్బతీసే విధంగా, భయం, భక్తి లేకుండా రాజకీయాల కోసం దేవుణ్ని వాడుకున్నారు. వారు చేసిన ఆరోపణలన్నీ అవాస్తవమని, ఎన్‌డీడీబీ, ఎన్‌డీఆర్ఐ.. రెండు ల్యాబ్‌లు కేంద్ర ప్రభుత్వానికి చెందినవి. ఆ రెండు ల్యాబ్‌లు వీరు పంపించిన నెయ్యిని పరీక్షించారు. ఆ నెయ్యిలో జంతువుల కొవ్వు కానీ, పంది కొవ్వు కానీ, చేపనూనె వంటి ఏ అవశేషాలు లేవని సర్టిఫికెట్ ఇచ్చారు. ఆ నివేదికా ఆధారంగా సీబీఐ, సిట్ ఛార్జ్‌షీట్ వేసింది.

**వారు నిజంగా తప్పు చేసి ఉంటే..!:**

ఒకవేళ నిజంగా తప్పు చేసి ఉంటే, ఆ ఛార్జ్‌షీట్‌లో వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర్‌రెడ్డి పేర్లు ఎందుకు లేవు? వారిని ఎందుకు అరెస్టు చేయలేదు?. ఎందుకంటే వారు తప్పు చేయలేదు కాబట్టి, సీబీఐ క్లీన్‌చిట్ ఇచ్చింది. ల్యాబ్‌లు కూడా వాస్తవం చెప్పాయి. అసలు సీబీఐ ఎందుకు వచ్చింది? వైవీ సుబ్బారెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు.. కేసులో నిజాలు నిగ్గు తేల్చాలని.. సీబీఐ దర్యాప్తు చేసి, వాస్తవాలు వెల్లడించింది.

**క్షమాపణ కోరాల్సింది పోయి..:**

కాబట్టి, చంద్రబాబు ఆయన కుమారుడు లోకేష్, పవన్‌కళ్యాణ్ చేసిన తప్పుకు చెంపలేసుకుని, క్షమాపణ కోరాల్సింది పోయి.. మళ్లీ మళ్లీ అవే అబద్ధాలు ప్రచారం చేస్తూ.. వాస్తవాలు వక్రీకరిస్తూ, ఫ్లెక్సీలు పెట్టారు. తప్పుడు సమాచారంతో, రెచ్చగొట్టే హక్కు ప్రజాస్వామ్యంలో ఉంటుందా?. మేము కూడా ఇలా ఫ్లెక్సీలు పెడితే ఎలా ఉంటుంది చంద్రబాబు?. సూపర్‌సిక్స్, సూపర్‌సెవెన్ అని చెప్పి మోసం చేశారని ఫ్లెక్సీలు పెడితే ఊర్కుంటారా?. అబద్దాలు చెబుతూ, దుష్ప్రచారం చేస్తూ ఫ్లెక్సీలు పెట్టడం తప్పు. వాస్తవాలను కేంద్ర ప్రభుత్వానికి చెందిన ల్యాబ్‌లు స్పష్టంగా చెప్పినా, చంద్రబాబు వెనక్కు తగ్గడం లేదు.ప్రశ్నిస్తే సహించడం లేదు!: ఎవరైనా చంద్రబాబును గట్టిగా నిలదీస్తే, ప్రశ్నిస్తే..ఏం చేస్తున్నారు?. అంబటి రాంబాబు మీద దాడి చేశారు. ఆరోజు ఉదయం గుడికి వెళ్లి పూజ చేసి వస్తుంటే.. ఆ మార్గంలో కట్టెలు పట్టుకుని, పోలీసుల సమక్షంలో రాంబాబును అడ్డగించాలని చూశారు. పోలీసులను పక్కన పెట్టుకుని, కర్రలతో రాంబాబు కారును అడ్డగించి, కారును బాదారు. ఇంకా తనను బూతుల తిట్టి, ఆయన కారుపై దాడి చేస్తే.. రాంబాబుగారు స్పందించారు. తన ఒక్కడి మీద అంత మంది దాడి చేస్తే, తన కారును అడ్డగిస్తే, బూతులు తిడితే.. ఆయన స్పందించారు. ఆ సందర్భంగా ఆయన నోటి నుంచి.. కాస్త కటువైన పదం దొర్లింది. ఒకవైపు ఆయన కారుపై దాడి. మరోవైపు బూతులు తిట్టడంతో ఆయన కాస్త గట్టిగా స్పందించారు. మరి ఇదే చంద్రబాబు, లోకేష్, పవన్‌కళ్యాణ్.. మీరు అంత కంటే దారుణంగా మాట్లాడుతున్నారు. అంటే మీరు మాట్లాడితే ఒకటి. రాంబాబు గారు మాట్లాడితే ఒకటినా? అయినా రాంబాబుగారు, ఇంటికి వచ్చిన తర్వాత, మీడియాతో మాట్లాడి, తాను తిట్టినందుకు క్షమాపణ చెప్పారు. తాను ఏ పరిస్థితిలో తిట్టాడన్నది కూడా చెప్పారు. చాలా సంస్కారంగా వివరణ కూడా ఇచ్చారు. అంతటి సంస్కారం ఉన్న వ్యక్తిని చేతనైతే పొగడాలి. వారు తన కారుపై దాడి చేశారు. తిట్టారు. దాంతో అలా స్పందించాడు. ఆయన క్షమాపణ చెప్పినా.. ఆయన మాటలు వక్రీకరిస్తూ.. ఏకంగా అంబటి రాంబాబును హత్య చేయడానికి సాయంత్రం 5 గం. నుంచి అర్ధరాత్రి వరకు విధ్వంసం సృష్టించారు. స్థానిక ఎమ్మెల్యే గల్లా మాధవి. మనుషులతో వచ్చి విధ్వంసం సృష్టించారు. 5 కార్లు ధ్వంసం చేశారు. ఇంట్లో, ఆఫీసులో అన్నీ పగలగొట్టారు. ఆయన గల్లా మాధవి భర్త. ఆయన సాక్షాత్తూ అంబటి రాంబాబు ఆఫీసు పగలగొట్టారు. చివరకు నిప్పు పెట్టారు. (అంటూ ఆ ఫోటోలన్నీ చూపారు) ఇవన్నీ పోలీసుల సమక్షంలోనే జరిగాయి. 5 కార్లు ధ్వంసం చేశారు. ఇల్లు, ఆఫీసులో అన్నీ పగలగొట్టారు. ఇంట్లో ఆడవాళ్లు ఉన్నా, వెనక్కి తగ్గలేదు.

**వారు కుట్రలో భాగస్వాములే కదా?:**

ఇది హత్యాయత్నం కాక మరేమిటి? పోలీసులు కూడా ఈ కుట్రలో భాగస్వాములు కాదా?. పోలీసులు బాధ్యతగా వ్యవహరించి ఉంటే, ఇంత విధ్వంసం జరిగేదా?. ఇక్కడికి ఎంత దూరంలో ఎస్పీ ఆఫీస్ ఉంది. కూతవేటు దూరంలో డీజీపీ ఆఫీస్ ఉంది. అక్కడ బెటాలియన్ ఉంటుంది. మా పార్టీ నాయకులు ఏ అధికారికి ఫోన్ చేసినా ఎవరూ ఎత్తలేదు. మరి ఇది కుట్ర కాదా? ఇది ధర్మమా? న్యాయమా?. మరోవైపు రాంబాబుగారిని అరెస్టు చేశారు. దానికి కారణం ఏం చెప్పారు? చంద్రబాబును తిట్టినందుకు అని చెప్పారు. మరి రాంబాబు ఇల్లు, ఆఫీసుపై దాడి చేసి, 5 కార్లు ధ్వంసం చేసి, మొత్తం పగలగొడితే.. ఏం చేశారు?. ఎమ్మెల్యే, ఆమె భర్తను ఏం చేయలేదు. స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపించారు.

**అక్కడ జోగి రమేష్ ఇంటిపై దాడి:**

అక్కడ కూడా పోలీసుల సమక్షంలోనే పెట్రోల్ బాంబులతో దాడి చేశారు. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు పోలీసుల సమక్షంలోనే దాడి చేశారు. ఇంటిమీద దాడి చేసి, నిప్పంటించారు. అంతకు ముందు విడదల రజిని. ఆమె గుడిలో పూజ చేసి వస్తుంటే, గుడి బయట అడ్డుకుని, తిడుతూ.. పోలీసుల సమక్షంలోనే ఆమెపై దాడికి ప్రయత్నించారు. ఇంత జరిగినా, ఆమెపైనే తిరిగి కేసు పెట్టారు. చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేష్, పవన్‌కళ్యాణ్‌కు జ్ఞానోదయం కలగాలని గుడిలో పూజ చేసి వస్తుంటే, ఆయనపైనా దాడి చేశారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డి పైనా అదే స్థితి. ప్రభుత్వం దారుణంగా వ్యవహరిస్తోంది.

**స్వార్థ రాజకీయాల కోసం..:**

తప్పులన్నీ చంద్రబాబు చేస్తున్నారు. కేసులు మా పార్టీ వారిపై పెడుతున్నారు. చంద్రబాబు చేసిన ఆరోపణలన్నీ అవాస్తవమని సీబీఐ క్లీన్‌చిట్ ఇచ్చినా.. చంద్రబాబు ప్రజలకు క్షమాపణ చెప్పకుండా చేస్తోంది ఏమిటి?. స్వార్థ రాజకీయాల కోసం దేవుణ్ని కూడా రాజకీయాల్లోకి లాగుతున్నాడు. ఎన్నికల ముందు ఇంటింటికీ బాండ్లు ఇచ్చి, సూపర్‌సిక్స్, సూపర్ సెవెన్ హామీలిచ్చి..ఏవీ చేయకుండా,అన్నీ చేశామని సిగ్గు లేకుండా అబద్ధాలు చెబుతున్నాడు. ఎవరైనా ప్రశ్నిస్తే కేసులు పెట్టి, జైలుకు పంపిస్తున్నాడు. అక్రమ కేసులు, తప్పుడు సాక్ష్యాలు. చివరకు సోషల్ మీడియా కార్యకర్తలను కూడా వదలడం లేదు. ఇంకా దారుణంగా గంజాయి కేసులు కూడా పెడుతున్నారు.

**అంతా అరాచకం. ఎక్కడికక్కడ దోపిడీ:**

నకిలీ మద్యం దందా. తన పార్టీ వారికి మద్యం షాప్‌లు. వేలం పాట పాడి బెల్టుషాపులు అప్పగిస్తున్నారు. మద్యం షాప్‌ల పక్కనే, పర్మిట్‌రూంలు నడుతున్నారు. అలా యథేచ్ఛగా దోచుకుంటున్నారు. వైన్‌షాప్‌ల్లో ఎమ్మార్పీ కంటే ఎక్కువకు అమ్ముతున్నారు. పర్మిట్‌రూమ్‌ల్లో పెగ్గుల వారీగా అమ్ముతున్నారు. ఆ ఆదాయం కూడా ప్రభుత్వానికి రావడం లేదు. అంతా వాళ్ల జేబుల్లోకి పోతోంది. ప్రతి 5 బాటిళ్లకు ఒకటి నకిలీ మద్యం. దాన్ని తయారు చేసింది తంబళ్లపల్లె నుంచి టీడీపీ నుంచి పోటీ చేసిన జయచంద్రారెడ్డి. అయినా మా పార్టీ నాయకుడు జోగి రమేష్‌పై అక్రమ కేసు పెట్టి, జైలుకు పంపారు. నకిలీ మద్యం తయారీ. సరఫరా, అమ్మకం అంతా టీడీపీ నాయకులదే. అంత దారుణంగా దోచుకుంటున్నారు.

**జంగిల్‌రాజ్‌కు పరాకాష్ట:**

అంబటి రాంబాబు, జోగి రమేష్ ఇళ్లపై దాడి, విడదల రజిని, బొల్లా బ్రహ్మనాయుడిపై దాడి. అంబటి రాంబాబు కాపు కులంలో మంచి నాయకుడు. ఆయన ఆ కులంలో ఒక టైగర్. అలాంటి ఆయన్ను దారుణంగా హత్య చేయాలని చూశారు. ఇంకా ఆయనను అక్రమంగా అరెస్టు చేయడమే కాకుండా, నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో అర్ధరాత్రి ముగ్గురు సీఐలు టార్చర్ చేశారు. ఒక మాజీ మంత్రిని అలా వేధిస్తారా?. దాదాపు 200 మంది పోలీసు అధికారులకు పోస్టింగ్ లేదు. మీకు కావాల్సిన వారిని ఎంచుకుని, జంగిల్‌రాజ్ చేస్తున్నారు.

**ఎవ్వరినీ వదిలిపెట్టబోము:**

ఈ ప్రభుత్వం ఎల్లకాలం ఉండదు. ఇప్పటికే రెండేళ్లు గడిచాయి. మిగిలింది మూడేళ్లు. చూస్తుండగానే గడిచిపోతాయి. మా ప్రభుత్వం వస్తుంది. అప్పుడు ఎవ్వరినీ వదిలిపెట్టబోము. ఇప్పుడు తప్పుడు పని చేస్తున్న పోలీసులను యూనిఫామ్‌తో బోనులో నిలబెడతాం. వడ్డీతో సహా బదులిస్తాం. విచారణ జరిపిస్తాం. ఇప్పుడు తప్పుడు పనులు చేస్తున్న పోలీసులు పద్ధతి మార్చుకోవాలి.విషబీజాలు నాటుతున్నారు: ఈ రోజు విషపూరిత విత్తనాలు నాటుతున్నారు. అవి రేపు వృక్షాలవుతాయి. అప్పుడు పరిస్థితి ఏమిటన్నది ఒక్కసారి ఆలోచించండి. ఇకనైనా వైఖరి మార్చుకొండి. ఇలాంటి పనులు ఆపండి. హామీలు నిలబెట్టుకొండి. పిల్లలకు ఫీజులు చెల్లించండి.

## కృష్ణా జిల్లాలో దొంగనోట్లు ముద్రిస్తున్న ముఠాకు చెక్..

సంగముడిలోని ఓ వైన్ షాప్ వద్దకు వచ్చిన పలువురు దొంగనోట్లు ఇచ్చినట్లు నిర్వాహకులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వైన్ షాపు సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. సీసీ టీవీ ఫుటేజీ, సాంకేతిక ఆధారాలను సేకరించిన పోలీసులు దొంగనోట్లు ముద్రిస్తున్న రంజిత్ సింగ్, బ్రహ్మ ఉమా శంకర్, దిలీప్‌ను అదుపులోకి తీసుకున్నారు. పెందుర్తి మండలం కోకవణిపాలెంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని దొంగనోట్లు ముద్రిస్తున్నట్లు గుర్తించారు. రూ.30 వేలు అసలు కరెన్సీ ఇస్తే లక్ష రుపాయలు నకిలీ నోట్లు ఇస్తున్నట్లు విచారణలో తేలింది. సంక్రాంతి సందర్భంగా నకిలీ నోట్లు చెలమణిలోకి తీసుకొచ్చారని.. మిగిలిన వాటిని వైన్ షాప్‌లు, పెట్రోల్ బంకుల్లో మార్చేందుకు యత్నిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి బంటుమిల్లి కోర్టులో హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు.

## హడలెత్తిస్తున్న పెద్దపులి

గ్రామానికి మకాం మారుస్తూ ప్రయాణం సాగిస్తోంది. పులి జాడ కోసం విశ్వప్రయత్నాలు చేస్తున్న అటవీ అధికారులు ఎట్టకేలకు శాటిలైట్ సిటీ వద్ద అక్కమ్మ కొండపై సేద తీరుతున్నట్టు గుర్తించారు. ఎలాగైనా పులిని బంధించి దాని ఆవాసానికి తరలిస్తామని అధికారులు చెబుతున్నారు.

## తిరుమల కొండపై వైకాపా దోపిడీ అంతా ఇంతా కాదు

రూ.1000కి పెంచారు. ఏ మాఫియాని సంతోషపెట్టడానికి ఇలా చేశారో ప్రజలకు తెలుసు. రూ.2.5 కోట్లు ఉన్న తితిదే కామన్ గుడ్ ఫండ్ కాంట్రిబ్యూషన్‌ను ఒక్కసారిగా రూ.50 కోట్లకు పెంచారు. వైకాపా ప్రభుత్వ హయాంలో అంతర్వేదిలో రథం దగ్ధమైతే కేసును సీబీఐ కోర్టుకు అప్పగిస్తామని మసిపూసి మారేడుకాయ చేశారు. దీనిపై ఒక్క వైకాపా నాయకుడూ మాట్లాడలేదు" అని నాగబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## తెలంగాణాలో ఆర్ ఆర్ ట్యాక్స్

పోరాడారు. హైదరాబాద్ విముక్తి కోసం సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో విఫలమైంది. ఎన్నికల హామీలను ప్రభుత్వం తుంగలో తొక్కింది. రైతు భరోసా, రుణమాఫీ, వ్యవసాయ కూలీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు. ఎస్సీలు, ఆదివాసీలు, బీసీలను ప్రభుత్వం మోసం చేసింది. అభివృద్ధి పనులు, బిల్లుల మంజూరుకు ఆర్‌ఆర్ ట్యాక్స్ కట్టాల్సిన దుస్థితి ఏర్పడింది. అవినీతి, కమీషన్ల ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకిలించాలి.అన్ని వర్గాలకు న్యాయం జరగాలంటే భాజపాను గెలిపించాలి. తెలంగాణకు సముచిత స్థాయిలో కేంద్రం నిధులు మంజూరు చేస్తోంది. రాష్ట్రంలో రైల్వేకు రూ.5,400 కోట్లకుపైగా కేటాయించింది. తెలంగాణకు మూడు హైస్పీడ్ రైల్ కారిడార్లు కేటాయించింది. రాష్ట్రంలో రెండు పారిశ్రామిక కారిడార్ల నిర్మాణం జరుగుతోంది. ప్రపంచ వ్యాప్తంగా మోదీ ప్రభుత్వం పట్ల ఆదరణ పెరుగుతోంది. ఈయూతో ఒప్పందం చేసుకుని దేశాభివృద్ధికి కృషి చేస్తోంది. కొన్నివర్గాలను సంతృప్తి పరచడానికి కాంగ్రెస్ నేతలు ప్రయత్నిస్తున్నారు. ముస్లిం ఓటు బ్యాంకు కోసం ఆరాటపడుతున్నారు. కాంగ్రెస్ పాలనలో బలహీనవర్గాలకు ఎలాంటి న్యాయం జరగలేదు. ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాల నిధుల్లో ప్రభుత్వం కోత పెడుతోంది. వక్ఫ్ బోర్డును బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ సర్కారు యత్నిస్తోంది. హిందూ దేవాలయాలపై దాడులు జరుగుతున్నా నోరు మెదపట్లేదు. హిందువుల మనోభావాలు దెబ్బతీస్తూ ఆలయ భూములు ఆక్రమిస్తున్నారు. రాష్ట్రంలో సనాతన ధర్మం మీద జరుగుతున్న దాడులను సహించం" అని నితిన్ నబీబ్ అన్నారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు లక్ష్మణ్, రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, ఎంపీలు డీకే అరుణ, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పలువురు భాజపా నేతలు పాల్గొన్నారు.

## విమానం ఇంజిన్‌లో మంటలు

విమానంలో 236 మంది ప్రయాణికులు ఉన్నారని, వారంతా సురక్షితమేనని అధికారులు వెల్లడించారు. బుధవారం మధ్యాహ్నం కాఠ్‌మాండు నుంచి ఇస్తాంబుల్ బయలుదేరిన తుర్కియే ఎయిర్‌లైన్స్ విమానం.. గాల్లోకి ఎగిరిన నాలుగు నిమిషాలకే కుడి వైపు ఇంజిన్‌లో మంటలు వచ్చాయి. దీన్ని గమనించిన పైలట్.. వెంటనే ఆ ఇంజిన్‌ను నిలిపివేశారు. ఈ విషయాన్ని కాఠ్‌మాండు టవర్‌కు చేరవేసి, పరిస్థితి అంచనా వేస్తూ సింగిల్ ఇంజిన్‌తోనే కొద్దిసేపు గాల్లోనే చక్కర్లు కొట్టించారు. అనంతరం సుదీర్ఘ ప్రయాణం సురక్షితం కాదని భావించి.. కోల్‌కతాలో ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేశారు. పైలట్ నుంచి 'ప్యాన్ ప్యాన్' సిగ్నల్ రాగానే.. నిబంధనల ప్రకారం అన్ని చర్యలు తీసుకున్నట్లు పౌర విమానయానశాఖ వెల్లడించింది. 'ప్యాన్ ప్యాన్' అనేది విమానంలో అత్యవసర పరిస్థితిని సూచించే రేడియో డిస్ట్రెస్ కాల్. అయితే, 'మేడే' కాల్ అంత తీవ్రమైనది కాదు. గగనతలంలో ఇంజిన్ వైఫల్యం తలెత్తినప్పుడు పైలట్ ఈ ఎమర్జెన్సీ మెసేజ్‌ను పంపిస్తారు. పరిస్థితి అత్యంత తీవ్రమైనది కానప్పటికీ.. క్లిష్టమైనది అని చెప్పేందుకు ఈ మెసేజ్ ఇస్తారు. రెండు ఇంజిన్ల విమానాల్లో ఒకటి విఫలమైనప్పుడు, తదితర సందర్భాల్లో ఈ సందేశం పంపిస్తారు.

## సర్‌ను అలా మార్చొద్దు

ఓటర్ల జాబితాలో చేర్చారు. అటువంటి పరిస్థితి దేశమంతటా వ్యాప్తి చేయొద్దని కోరుకుంటున్నాం" అని అన్నారు. భాష గురించి మాట్లాడిన కమల్.. తనకు తమిళ ఉపాధ్యాయులు భాషను పరిచయం చేశారని చెప్పారు. తమ భాష, సంస్కృతిపై జరిగే ఎటువంటి దాడినైనా ఎదుర్కోవాలని సీఎన్ అన్నాదురై..తదితర నేతల నుంచి నేర్చుకున్నానని అన్నారు. హైస్కూల్ మధ్యలో చదువు మానేసిన తాను ఆర్థికశాస్త్రంపై మాట్లాడేందుకు అర్హుడని కాదని ఎవరు అనుకున్నా అభ్యంతరం లేదని, తాను మాత్రం మాట్లాడుతానని స్పష్టంచేశారు. తమిళుడిగా తనకు ఓ స్పష్టమైన అభిప్రాయం ఉందన్నారు. ప్రస్తుత రాజకీయాలను నేటి యువత నిశితంగా గమనిస్తోందన్నారు. ప్రజాస్వామ్య స్ఫూర్తిని నింపుతూ భవిష్యత్తు తమదేనన్న వాతావరణాన్ని కల్పించాల్సిన అవసరం ఉంద

## ఏప్రిల్ తర్వాత పేదలకు లక్షలాది ఇళ్లు

పోటీ చేస్తున్న ఆడబిడ్డలకు కూడా ఆర్టీసీలో ఉచితంగా బస్సు ప్రయాణం కల్పించాం. సంక్షేమ పథకాల అమలులో ఎక్కడా వివక్ష చూపలేదు. రైతు రుణమాఫీ కింద 25.35 లక్షల మందికి రూ.21 వేల కోట్లు ఖర్చు చేశాం. రైతులకు గిట్టుబాటు ధరతో పాటు రూ.500 బోనస్ ఇస్తున్నాం. రైతు భరోసా కింద రూ.6వేల చొప్పున రూ.9వేల కోట్లు ఇచ్చాం. మున్సిపల్ ఎన్నికలు ముగిశాక రైతు భరోసా నిధులు జమ చేస్తాం. దేశంలో అత్యధికంగా రైతుల కోసం రూ.1.10 లక్షల కోట్లు ఖర్చు చేశాం. ఏప్రిల్‌లో కొత్త బడ్జెట్‌లో లక్షలాది ఇళ్లు పేదలకు ఇస్తాం. పేదల ఆత్మగౌరవం పెంచే బాధ్యత తీసుకుంటాం. నల్గొండ జిల్లాపై కోపంతో ఎస్ఎల్‌బీసీని పక్కనపెట్టారు. ఎస్ఎల్‌బీసీ ఆగిపోతే మామ, అల్లుళ్లు దావతు చేసుకున్నారు. నల్గొండ ప్రజలు ఫ్లోరైడ్ నీళ్లు తాగడానికి కారణం బీఆర్ఎస్. రెండేళ్లలో పూర్తి చేసే లక్ష్యంతో ఎస్ఎల్‌బీసీ పనులు చేపట్టాం. కేసీఆర్‌కు పోలీసులు నోటీసు ఇస్తే.. తెలంగాణ జాతికి ఇచ్చినట్టు చెబుతున్నారు" అని సీఎం విమర్శించారు.

## శక్తిమంతమైన ఆయుధాలు

ఆయన నేషనల్ అసెంబ్లీలో మాట్లాడారు. పాక్ ప్రావిన్స్ బలోచిస్థాన్ వైశాల్యం, రెబెల్స్ వద్ద ఉన్న అధునాతన ఆయుధాల కారణంగా వారితో పోరాడేందుకు పాక్ సైన్యం ఇబ్బందిపడుతోందని మంత్రి అంగీకరించారు. "వారివద్ద 20 లక్షల రూపాయల (పాక్ కరెన్సీలో) విలువైన రైఫిల్ ఉంది. అది మనవద్ద లేదు. 4000 డాలర్లు నుంచి 5000 డాలర్ల విలువైన థర్మల్ వెపన్ సైట్స్ ఉన్నాయి. ఇలాంటి ఆయుధాలన్నీ వారికి ఎక్కడినుంచి వస్తున్నాయి..? వీటిల్లో కొన్ని అమెరికా ఆయుధాలు కూడా ఉన్నాయి. ఈ ఉగ్రవాదుల నాయకులు అఫ్గానిస్థాన్‌లో ఉన్నారు. అక్కడి నుంచే వారికి మద్దతు లభిస్తోంది. ప్రభుత్వవ్యతిరేక కార్యకలాపాల్లో నిమగ్నమై ఉన్నవారితో చర్చలు జరపలేం. దాడులు ఆపకపోతే.. పరిణామాలు తీవ్రంగా ఉంటాయి" అని బలోచ్ రెబెల్స్‌ను మంత్రి హెచ్చరించారు. ఇరాన్, అఫ్గానిస్థాన్ సరిహద్దుకు సమీపంలోని బలోచిస్థాన్ కేంద్రంగా వేర్పాటువాద సంస్థ బలోచ్ లిబరేషన్ ఆర్మీ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. దీనిని అమెరికా ఉగ్రసంస్థగా గుర్తించింది. ఈ సంస్థ సైన్యానికి చెందిన మౌలికసదుపాయాలు, పోలీసులు, స్థానిక అధికారులపై కొన్నేళ్లుగా దాడులు చేస్తోంది. ఇటీవల బలోచిస్థాన్ ప్రావిన్సులోని వేర్వేరు ప్రాంతాల్లో రెబెల్స్ దాడులు చేశారు. దాంతో పాకిస్థాన్ కౌంటర్ ఆపరేషన్ నిర్వహించింది. ఈ ఘటనల్లో 200 మంది వరకు రెబెల్స్‌తో పాటు పౌరులు, భద్రతా సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు.

## భగ్గుమన్న భాజాపా

వ్యక్తి కూడా. పంజాబ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన ఆయన తాత సర్దార్ బియాంత్ సింగ్ ఓ అమరవీరుడు. అలాంటి వ్యక్తిని దేశద్రోహి అని పిలిచారు. ఇది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు" అని హర్‌దీప్ సింగ్ పురీ మండిపడ్డారు. మరోవైపు.. రాహుల్ వ్యాఖ్యలను నిరసిస్తూ దిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం సమీపంలో భాజపా శ్రేణులు ఆందోళన నిర్వహించాయి. ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశాయి. దేశానికి గర్వకారణమైన ఓ వర్గాన్ని ఆయన కించపర్చారని భాజపా దిల్లీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ ఆరోపించారు. గాంధీ కుటుంబమే అసలైన ద్రోహి అని దిల్లీ మంత్రి మన్‌జిందర్ సింగ్ సిర్సా ఆరోపించారు.

**అసలేం జరిగిందంటే..**

పార్లమెంటు ద్వారం వద్ద విపక్ష ఎంపీలు నిరసన తెలుపుతున్న సమయంలో కేంద్ర మంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టు అటుగా వచ్చారు. 'ఇదిగో ఇక్కడ ఓ ద్రోహి నడుచుకుంటూ వెళ్తున్నాడు' అంటూ రాహుల్ విమర్శలు చేశారు. తిరిగి (కాంగ్రెస్‌లోకి) వస్తావంటూ ఎద్దేవా చేశారు. దీనికి కేంద్ర మంత్రి గట్టి కౌంటర్ ఇచ్చారు. రాహుల్‌తో కరచాలనం చేసేందుకు నిరాకరిస్తూనే.. 'మీరు దేశానికి ద్రోహం చేశారు' అని వ్యాఖ్యానించారు. గతంలో కాంగ్రెస్ నుంచి మూడుసార్లు ఎంపీగా గెలిచిన బిట్టు.. 2024 ఎన్నికల ముందు భాజపాలో చేరారు.

## బడ్జెట్‌లో లోపాలు చెప్పగలరా?

వ్యాఖ్యలకు తగిన ఆధారాలు చూపించాలన్నారు. తమ ప్రభుత్వం యువత నైపుణ్యం, వ్యవస్థాపకత, కృత్రిమ మేధస్సు వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలపై బడ్జెట్ లో ప్రధానంగా దృష్టి సారించిందని నిర్మలా సీతారామన్ తెలిపారు. దేశంలో అభివృద్ధి చెందుతున్న కార్మిక మార్కెట్ అవసరాలను తీర్చడానికి వ్యవసాయం, గ్రామీణ ఉపాధి, యువతకు ఉపాధి శిక్షణ కేంద్రాలు వంటి వాటి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై రాహుల్ గాంధీ ఇటీవల తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ సమగ్రంగా లేదని.. దేశం ఎదుర్కొంటున్న నిజమైన సంక్షోభాలపై దృష్టి సారించలేకపోయిందని పేర్కొన్నారు. యువతకు ఉద్యోగాలు లేవని, తయారీ రంగం పతనమవుతోందని ఆరోపించారు. పెట్టుబడిదారులు పెట్టుబడులను ఉపసంహరించుకుంటున్నారన్నారు. రైతుల ఇబ్బందులు, ప్రపంచ దేశాల నుంచి తగులుతున్న ఎదురు దెబ్బలు వంటి అంశాలను ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు.

## పరిశీలించిన మంత్రి నారాయణ బృందం

ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ సిటీ నిర్మాణానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తున్న నేపథ్యంలో ఆయా స్టేడియాలను నారాయణ బృందం పరిశీలించింది. అనంతరం ఖతార్ పర్యటనకు వెళ్లింది. మంత్రి వెంట పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్‌కుమార్, అమరావతి గ్రోత్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఎండీ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## భారత్- చైనా వాణిజ్యం..

నేపథ్యంలో దానికి మద్దతిచ్చేందుకు చైనా ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. గ్లోబల్ సౌత్ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడానికి భారత్‌తో కలిసి పని చేసేందుకు కట్టుబడి ఉందన్నారు. గతేడాది భారత ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌ల మధ్య జరిగిన ద్వైపాక్షిక భేటీ గురించి ప్రస్తావించారు. ఆ సమావేశం తర్వాత ఇరుదేశాల మధ్య సంబంధాలు మరింత పెరిగాయన్నారు. ఆర్థిక సహకారం కొత్త శిఖరాలకు చేరుకుందన్నారు. 2025లో భారత్-చైనాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 155.6 బిలియన్ డాలర్లకు చేరిందన్నారు. గతంలో కన్నా 12 శాతం వృద్ధి సాధించామన్నారు. చైనాకు భారత ఎగుమతులు 9.7 శాతం పెరిగాయని తెలిపారు. ఈ సందర్భంగా పరస్పర ప్రయోజనాలు, అభివృద్ధి కోసం ఇరుదేశాలు కలిసి ముందుకుసాగాలని పిలుపునిచ్చారు.

# ఎడిటర్ వాయిస్

## వైసీపీ సీనియర్ల మౌనం - దేనికి సంకేతం?

వైసీపీ రెండేళ్ళ క్రితం దాకా ఏపీని ఏలిన పార్టీ. రెండు దఫాలుగా మంత్రులను మార్చి దాదాపుగా నలభై మందికి పైగా నేతలకు కేబినెట్ లో అవకాశాలను జగన్ ఇచ్చారు. ఇక ఎంపీలుగా ఎమ్మెల్యేలుగా ఇతర కీలక పదవులలో చాలా మంది నేతలు ఉన్నారు. వైసీపీలో ఆది నుంచి సీనియర్ నేతలు అధికంగానే ఉన్నారు. అయితే ఎన్నడూ లేని విధంగా వైసీపీ సంక్షోభం ఎదుర్కొంటూంటే సీనియర్లు మౌన ముద్రలో ఉండడం అయితే చర్చకు దారి తీస్తోంది.

**సహచరుల మీద అలా :**

మాజీ మంత్రులు ఇద్దరి ఇళ్ళ మీద వరుసగా దాడులు జరిగాయి. ఏకంగా పెట్రో బాంబులే వేసి ఇళ్ళ మీద పెద్ద ఎత్తున ఎటాక్ చేశారు. అఫ్ కోర్స్ ఈ మాజీ మంత్రులు ఏమేమి అనుచితమైన వ్యాఖ్యలు చేశారు అన్నది వేరే విషయం. దానిని చట్ట ప్రకారం వారు ఎదుర్కోవాలి. తగిన విధంగా ఆ పని జరుగుతుంది. కానీ నేరుగా ఇంటి మీదకు వచ్చి దాడులు చేయడం అంటే సీరియస్ ఇష్యూగా వైసీపీలో ఎంత మంది భావిస్తున్నారు అన్నదే చర్చగా ఉంది.

**వారు తప్పించి :** ఇక వైసీపీలో చూస్తే స్టేట్ కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి రియాక్ట్ అయ్యారు. అదే విధంగా సీనియర్ నేత మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ కూడా రియాక్ట్ అయ్యారు. మాజీ మంత్రులు పేర్ని నాని అనిల్ కుమార్ యాదవ్ లాంటి వారు సైతం గట్టిగానే సౌండ్ చేశారు అయితే ఇంకా చాలా మంది మాజీ మంత్రులు ఉన్నారు కదా సీనియర్ నేతలు ఉన్నారు కదా అన్న చర్చ వస్తోంది. ఉత్తరాంధ్రాలో చూస్తే మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు క్రిష్ణదాస్ వంటి వారు ఉంటే విశాఖకు చెందిన గుడివాడ అమర్నాథ్ మాత్రమే రియాక్ట్ కావడం మీద కూడా చర్చ సాగుతోంది.

**ఉప ముఖ్యమంత్రులుగా :** వైసీపీ హయాంలో ఉప ముఖ్యమంత్రులుగా చాలా మంది చేశారు. అయితే వీరంతా ఫుల్ సైలెంట్ మోడ్ లో ఉండడం విశేషం. తమ సొంత జిల్లా కావడంతో మాజీ ఉప ముఖ్యమంత్రి మాజీ హోం మంత్రి కూడా అయిన మేకతోటి సుచరిత ఈ ఘటనల మీద ఘాటుగానే రియాక్ట్ అయ్యారు. ఇక పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మీడియా ముఖంగా మాత్రమే రియాక్ట్ అయ్యారు. కానీ కీలక నేతల సంగతేంటి అన్నదే అందరినీ ఆలోచనలో పడవేస్తోంది. **అసంతృప్తినా లేక :** పార్టీ పోకడల పట్ల అసంతృప్తితో ఉన్నారా లేక తనకు ఎందుకు అన్న ధోరణిలో సీనియర్ నేతలు సైలెంట్ అయ్యారా అన్నదే అర్ధం కావడం లేదు అని అంటున్నారు. జోగి రమేష్ ఇంటి మీద పెట్రో బాంబులు వేశారని ఆ సమయంలో ఆయన ఇంట్లో ఉంటే పోయేవాడు అని పేర్ని నాని మీడియా ముందు చెప్పుకొచ్చారు. అంబటి ఇంట్లో కారు కింద మంట పెట్టారని అక్కడ పెట్రోల్ పేలితే ఏమవుతుందో ఎవరికి తెలుసు అని జనసేనకు రాజీనామా చేసిన మహిళా అడ్వకేట్ రజనీ అన్నారు. అంటే చావు అంచుల దాకా ఈ ఇద్దరు మాజీ మంత్రులు వెళ్ళారని దాడి ఘటన మీద అంతా అంటున్న మాట.

**అత్యంత క్లిష్ట దశలో :** కానీ వైసీపీలో చాలా మంది సీనియర్లు మాత్రం దీనిని అంత తీవ్రంగా తీసుకోవడం లేదా అన్నదే చర్చగా ఉంది. నోరా వీపుకు చేటు అని సామెత ఉంది. అలా కొందరు వైసీపీ నేతలు అతి ఉత్సాహంతో ఈ రకమైన పరిస్థితులు కోరి తెచ్చుకుంటున్నారని అన్న భావన చాలా మంది నేతలలో ఉండబట్టే తామెందుకు ఈ గబ్బు రాజకీయాల జోలికి అని మౌనం వహించారు అని అంటున్నారు. ఏది ఏమైనా వైసీపీ అత్యంత క్లిష్ట దశలో ఉంది. అందరినీ కలుపుకుని పోవాల్సిఉంది. మరి అది ఎలాగో అధినాయకత్వం చూసుకోవాలని అంటున్నారు.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




## సోదరుడి చేతిలో మహిళా న్యాయవాది దారుణహత్య



**మొయినాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** రంగారెడ్డి జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. సొంత అన్న చేతిలో మహిళా న్యాయవాది స్వప్న (34) హత్యకు గురయ్యారు. మొయినాబాద్ మండలం కేతిరెడ్డిపల్లిలో ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చేవెళ్ల కోర్టులో స్వప్న న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. ఆమె కుటుంబంలో ఆస్తి గొడవలు ఉన్నాయి. ఈ క్రమంలో బుధవారం ఉదయం పొలం వద్ద పంచాయతీ జరుగుతుండగా.. స్వప్నను సోదరుడు రాజు హతమార్చాడు. హత్య సమాచారం అందుకున్న మొయినాబాద్ పోలీసులు.. ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

**రాజు మూడేళ్లుగా పథకం పన్నాడు: తల్లి వెంకటమ్మ**

స్వప్నను చంపాలని రాజు మూడేళ్లుగా పథకం పన్నాడని తల్లి వెంకటమ్మ అన్నారు. హతమార్చేందుకు ఇప్పటికే రెండుసార్లు యత్నించాడని చెప్పారు. భూమి సర్వే అనంతరం తిరిగి వెళుతుండగా స్వప్నపై ముగ్గురు వ్యక్తులు దాడి చేశారని తెలిపారు. కర్రలు, కత్తులతో దాడి చేశారని.. రాజుతో పాటు నిందితులను కఠినంగా శిక్షించాలని వెంకటమ్మ కోరారు.

**న్యాయవాదుల ఆందోళన**

స్వప్న హత్యపై చేవెళ్ల కోర్టు న్యాయవాదులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం విధులను బహిష్కరించి మొయినాబాద్ పీఎస్ వద్ద ఆందోళనకు దిగారు. పీఎస్ ఎదుట ఉన్న హైదరాబాద్-బీజాపూర్ హైవేపై బైఠాయించి నిరసన తెలిపారు.

### ఫోన్ నంబర్ బ్లాక్ చేశాడని

## ప్రియుణ్ని చంపిన ప్రియురాలు

**విశ్వం వాయిస్ న్యూస్ :** ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పుర్ సివిల్ లైన్స్ పోలీస్‌స్టేషను పరిధిలో ఫోన్ నంబరు బ్లాక్ చేశాడన్న కోపంతో ఓ యువతి తన ప్రియుడిని కత్తితో పొడిచి చంపింది. ప్రసాద్ సూర్యవంశీ (25) అనే యువకుడు స్థానిక శుభమ్ విహార్ టీచర్స్ కాలనీలో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. హోటలులో పనిచేసే ఇతనికి ఓ యువతితో గత కొంతకాలంగా ప్రేమ వ్యవహారం నడుస్తోంది. వీరిద్దరికీ సోషల్ మీడియా ద్వారా పరిచయం ఏర్పడింది. దీంతో ఒకరింటికి మరొకరు వచ్చి వెళ్తుండేవారు. ఇటీవలి కాలంలో ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చాయి. ప్రసాద్ ఆమె ఫోన్ నంబరును బ్లాక్ చేశాడు. ప్రియుడి ఇంటికి వెళ్లిన ఆమె ఫోన్ నంబరు ఎందుకు బ్లాక్ చేశావని వాదనకు దిగింది. మొబైల్‌లోని ఛాటింగ్స్ చూపించాలని పట్టుబట్టింది. ప్రసాద్ ససేమిరా అనడంతో ఆమె తన వెంట తెచ్చుకొన్న కత్తితో అతనిపై విచక్షణరహితంగా దాడి చేసింది. తీవ్రగాయాలతో ప్రసాద్ అక్కడికక్కడే మరణించాడు. నిందితురాలిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు బిలాస్‌పుర్ ఎస్పీ రజనీశ్ సింగ్ తెలిపారు.

### జన్మభూమి ఎక్స్‌ప్రెస్ కింద పడి

## చీఫ్ ఇంజినీర్ ఆత్మహత్య



**గాజువాక, విశ్వం వాయిస్ న్యూస్ :** విశాఖ జిల్లా దువ్వాడ రైల్వేస్టేషన్‌లో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నారు. ఓ ప్రైవేటు కంపెనీలో చీఫ్ ఇంజినీర్‌గా పని చేస్తున్న హర్షవర్ధన్ (36).. విజయవాడ వైపు వెళ్తున్న జన్మభూమి ఎక్స్‌ప్రెస్ కింద పడి బలవన్మరణానికి పాల్పడ్డారు. కుటుంబ కలహాలే ఈ ఘటనకు కారణంగా తెలుస్తోంది. హర్షవర్ధన్ సూసైడ్ నోట్ రాసి బుధవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయారు. ఆత్మహత్య చేసుకుంటున్నట్లు అందులో పేర్కొన్నారు. దీంతో ఆయన అదృశ్యమైనట్లు న్యూపోర్టు పోలీసులకు కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు.. అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో దువ్వాడ రైల్వేస్టేషన్‌లో హర్షవర్ధన్ ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు.

## పశువుల కొవ్వుతో నూనె తయారీ

### విజిలెన్స్ దాడులతో ఏలూరులో బహిర్గతం

### స్వాధీనం చేసుకున్న నూనె డబ్బాలు



**ఏలూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** పశువుల కొవ్వుతో నూనె తయారు చేస్తున్న స్థావరాలపై ఏలూరు విజిలెన్స్ అధికారులు మంగళవారం దాడులు చేశారు. ఇద్దరిని అదుపు లోకి తీసుకున్నారు. తంగెళ్ల మూడి, ఆదివారపుపేట, లంకపేటలో గేదెలు, ఆవులు, ఇతర జంతువుల కొవ్వు నుంచి నూనె తయారుచేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు ఎస్పీ నాగేశ్వరరావు ఆదేశాలతో సీఐలు గంగాభవాని, ప్రసాద్‌కుమార్‌లు సిబ్బందితో తంగెళ్లమూడి పరిసరాల్లో దాడులు చేశారు. రెండు ఇళ్లల్లో విక్రయానికి సిద్ధంగా ఉన్న 390 లీటర్ల నూనెను గుర్తించారు. తయారీదారులు బయ్యారపు జయన్న, షేక్ షౌకత్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ నూనెను కాకినాడ జిల్లా సామర్లకోటకు చెందిన నజరత్‌కు విక్రయిస్తుంటామని షౌకత్ తెలిపారని విజిలెన్స్ అధికారులు వివరించారు. నూనె నమూనాలను ప్రయోగశాలకు పంపారు.

## తిరుపతిలో విద్యార్థి నేతల కిడ్నాప్ కలకలం

### కలెక్టరేట్ వద్ద నిరసనకు వెళ్తుండగా ఘటన

### సినీఫక్కీలో నిందితులను వెంటాడి పట్టుకున్న పోలీసులు

**తిరుపతి, విశ్వం వాయిస్ న్యూస్ :** తిరుపతిలో విద్యార్థి నేతల కిడ్నాప్ ఉదంతం తీవ్ర కలకలం రేపింది. చంద్రగిరి పరిధిలోని మోహన్‌బాబు యూనివర్సిటీ (ఎంబీయూ)లో ఫీజుల దోపిడీ, అక్రమాలకు పాల్పడుతున్నారంటూ మంగళవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపేందుకు వెళ్తున్న ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి అక్బర్, ఏస్వీయూ విద్యార్థి నాయకుడు వినోద్‌లను తిరుచానూరు సమీపంలో కిడ్నాప్ చేశారు. దాదాపు 30 మంది వారిని ఓ వాహనంలో ఎక్కించుకుని తీసుకెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న సీపీఎం నేత కందారపు మురళి.. ఎస్పీ సుబ్బరాయుడు, ఏఎస్పీ రవిమనోహర్‌లకు సమాచారం ఇవ్వడంతో తిరుచానూరు సీఐ సునీల్‌కుమార్ నేతృత్వంలోని మూడు బృందాలు కిడ్నాపర్ల వాహనాలను వెంబడించాయి. గంట వ్యవధిలోనే నారావారిపల్లె సమీపంలో బాధితులను గుర్తించి విడిపించారు. నిందితులను అదుపులోకి తీసుకుని వాహనాలను సీజ్ చేశారు.

**మోహన్‌బాబు, విష్ణులపై కేసులు**

బాధితుల ఫిర్యాదు మేరకు తిరుచానూరు పోలీసులు మోహన్‌బాబును ఏ-2గా, మంచు విష్ణును ఏ-3గా చేరుస్తూ పలువురిపై కేసు నమోదు చేశారు. వర్సిటీ పీఆర్‌వో సతీష్‌ను ఏ-1గా పేర్కొన్నారు. మరోవైపు తమ విద్యాసంస్థల ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు కొందరు కుట్రపన్నారని ఎంబీయూ యాజమాన్యం ఆరోపించింది. ఇన్‌స్టాగ్రాంలో తప్పుడు వీడియోలు పోస్ట్ చేసి, అవి తొలగించాలంటే రూ.15 లక్షలు ఇవ్వాలని ఇద్దరు ఎస్ఎఫ్ఐ నేతలు తమను డిమాండ్ చేశారని సంస్థ ప్రతినిధులు చంద్రగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. డబ్బులు ఇవ్వకపోతే ధర్నాలు చేస్తామని బెదిరించారని, సంబంధిత వాట్సప్ చాట్లను పోలీసులకు అందజేసినట్లు పీఆర్‌వో సతీష్ తెలిపారు.

## పైసలు తీసుకోకముందే.. ప్రాణాలు పోయాయి

### ట్రాక్టరు బోల్తాపడి నలుగురు వ్యవసాయ కూలీల దుర్మరణం

**మల్లాపూర్, విశ్వం వాయిస్ న్యూస్ :** అందరివీ కూలి పనులు చేస్తేనే కడుపు నిండే కుటుంబాలు. ఒక బాలిక అయితే తల్లికి సాయం చేద్దామని వెళ్లింది. పనులు ముగించుకున్నారు.. కూలి ఇంకా తీసుకోనేలేదు. ట్రాక్టరులో ఇళ్లకు తిరిగి వస్తుండగా.. అది బోల్తా పడటంతో ముగ్గురు మహిళలు, బాలిక సహా నలుగురు దుర్మరణం పాలయ్యారు. ఈ ఘటన జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం మొగిలిపేటలో మంగళవారం చోటు చేసుకుంది. ప్రమాదంలో మరో 8 మంది గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం ఎర్రంశెట్టి గంగాధర్ పొలంలో పసుపు దుంపల నుంచి కొమ్ములు తెంపే పని కోసం గ్రామానికి చెందిన 12 మంది మహిళా కూలీలు వెళ్లారు. సాయంత్రం పని ముగించుకొని వస్తుండగా.. మార్గం మధ్యలో ట్రాక్టరు అదుపు తప్పి రహదారి పక్కన ఉన్న నీటి గుంతలో బోల్తా పడింది. ఈ ఘటనలో సంపంగి సాయమ్మ(35), మంగళారపు లలిత(42), రొడ్డ వైష్ణవి(13), పెద్దిరెడ్డి గంగు(45) ట్రాలీ కింద పడి మృతి చెందారు. గాయపడిన వారిని మెట్‌పల్లి ఆసుపత్రికి.. ఇద్దరి పరిస్థితి విషమించడంతో జగిత్యాల ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందిస్తున్నారు.

# అసలు ఈ స్కూల్‌ని ఎవరయ్యా కనిపెట్టింది?




### ఈ డౌట్ మీకు ఉందా? అయితే ఎవరో తెలుసుకోండి!




చిన్నప్పుడు స్కూల్ బెంచ్ మీద కూర్చుని, క్లాస్ వినలేక బోర్ కొడుతున్నప్పుడు ప్రతి ఒక్కరికీ ఒక డౌట్ కచ్చితంగా వచ్చే ఉంటుంది.. “అసలు ఈ స్కూల్ అనే దాన్ని ఎవరు కనిపెట్టారురా బాబూ?” అని. అయితే, దీనికి ఒక సింగిల్ ఆన్సర్ గానీ, ఒక డేట్ గానీ లేదు. ఇది మనిషిలో ఉన్న క్యూరియాసిటీ వల్ల కొన్ని వేల ఏళ్ల నుంచి జరుగుతున్న ఓ పెద్ద ప్రయాణం. అడవుల్లో క్యాంప్ ఫైర్ దగ్గర మొదలై.. మోడ్రన్ క్లాస్ రూమ్స్ వరకు సాగిన ఈ ఇంట్రెస్టింగ్ హిస్టరీ ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం.అసలు ‘ఫార్మల్ స్కూల్’ అనేది మోడ్రన్ ఐడియా. హిస్టరీలో చాలా కాలం పాటు చదువుకోవడానికి స్కూల్ బిల్డింగ్స్ అంటూ ఏమీ ఉండేవి కావు. పిల్లలు చదువును తమ డైలీ లైఫ్‌లో భాగంగా నేర్చుకునేవారు. వ్యవసాయం చేసే వాళ్ల పిల్లలు.. రుతువులను బట్టి పంటలు ఎలా పండించాలో పొలంలోనే నేర్చుకునేవారు. కుండలు, వడ్రంగి పని చేసే వాళ్ల పిల్లలు.. పెద్దవాళ్లకు సాయం చేస్తూ ఆ స్కిల్స్ నేర్చుకునేవాళ్లు. అప్పట్లో నాలెడ్జ్ అనేది కథలు, పాటల రూపంలో ఒకరి నుంచి ఒకరికి పాస్ అయ్యేది. అప్పట్లో టెక్స్ట్ బుక్స్, హోంవర్క్ అనే టార్చర్స్ లేవు.. అంతా ప్రాక్టికల్ ఎక్స్‌పీరియన్సే. మొట్టమొదటి ఫార్మల్ స్కూల్స్సమాజం డెవలప్ అయ్యేకొద్దీ, చదువుకి ఒక పద్ధతి అవసరమై ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రాచీన నాగరికతల్లో తొలి తరం స్కూల్స్ పుట్టుకొచ్చాయి. మన ఇండియాలో గురుకుల వ్యవస్థ ఉండేది.. స్టూడెంట్స్ గురువుగారి ఆశ్రమంలో ఉంటూ యుద్ధ విద్యల నుంచి ఫిలాసఫీ వరకు అన్నీ ప్రకృతి ఒడిలోనే నేర్చుకునేవారు. అలాగే మెసొపొటేమియాలో రికార్డ్స్ మెయింటైన్ చేయడం కోసం ‘ఎడుబ్బాస్’ (లేదా ‘టాబ్లెట్ హౌసెస్’ ఉండేవి, అక్కడ మట్టి పలకల మీద క్యూనిఫామ్ అనే కష్టమైన రాతను నేర్పించేవారు. ఈజిప్ట్‌లో కూడా గుడి, గవర్నమెంట్ పనుల కోసం హైరోగ్లిఫిక్స్ (చిత్ర లిపి) నేర్పించే స్కూల్స్ నడిచేవి. ఐతే ఇక్కడో విషయం గుర్తుపెట్టుకోవాలి.. ఈ స్కూల్స్ అందరి కోసం కాదు, కేవలం కొంతమంది ఉన్నత వర్గాల పిల్లలకు, స్పెషల్ జాబ్స్ చేసేవారికే ఈ ట్రైనింగ్ పరిమితం అయ్యేది. గ్రీకులతో వచ్చిన అసలైన మార్పుఏన్షియంట్ గ్రీస్ సమయంలో ఎడ్యుకేషన్ మొత్తం మారిపోయింది. సోక్రటీస్, ప్లాటో, అరిస్టాటిల్ లాంటి మేధావులు ఎడ్యుకేషన్ అంటే కేవలం బట్టీ పట్టడం కాదు, ‘ఆలోచించడం’ అని చెప్పారు. క్రీస్తు పూర్వం 387లో ప్లాటో ‘ది అకాడమీ’ని స్టార్ట్ చేశాడు. ఇది జాబ్స్ కోసం పెట్టే ట్రైనింగ్ సెంటర్ కాదు.. డిబేట్లు పెట్టడం, లాజిక్‌తో ఆలోచించడం, ప్రకృతి గురించి ప్రశ్నలు అడగడం ఇక్కడ నేర్పించేవారు. చదువు అంటే మైండ్ డెవలప్ చేసుకోవడం అనే కాన్సెప్ట్ ఇక్కడి నుంచే వచ్చింది. మనం చూస్తున్న స్కూల్ సిస్టమ్ ఎవరి ఐడియా?మరి ఇప్పుడు మనం చూస్తున్న.. బెంచీలు, టైమ్ టేబుల్స్ ఉండే స్కూల్ సిస్టమ్‌ని డిజైన్ చేసింది ఎవరు? దీనికి మేజర్ క్రెడిట్ ఇవ్వాల్సింది హొరేస్ మన్ అనే వ్యక్తికి. అతన్ని ఎడ్యుకేషన్ హిస్టరీలో ఓ గేమ్‌చేంజర్ అనొచ్చు. 1830ల సమయంలో అమెరికాలో హొరేస్ ‘కామన్ స్కూల్స్’ అనే కాన్సెప్ట్ తెచ్చాడు. పేద, ధనిక తేడా లేకుండా పిల్లలందరికీ పబ్లిక్ ఫండ్స్‌తో ఒకే రకమైన బేసిక్ ఎడ్యుకేషన్ దొరకాలని వాదించాడు. వయసును బట్టి క్లాసులు డివైడ్ చేయడం, కోర్ సబ్జెక్ట్స్ సిలబస్, ప్రొఫెషనల్ టీచర్స్, ఒక పద్ధతి ప్రకారం నడిచే టైమ్ టేబుల్స్.. ఇవన్నీ హొరేస్ మన్ పాపులర్ చేసినవే. ఈ మోడల్ హిట్ అయ్యి ప్రపంచమంతా పాకింది. మారుతున్న క్లాస్ రూమ్స్కాలం మారుతున్న కొద్దీ స్కూల్స్ కూడా అప్‌డేట్ అవుతూనే ఉన్నాయి. ఒకప్పుడు పలకల నుంచి ప్రింటెడ్ టెక్స్ట్ బుక్స్‌కి మారాం. తర్వాత బ్లాక్ బోర్డులు, ఇప్పుడు స్మార్ట్ బోర్డులు.. చేతిలో డిజిటల్ స్క్రీన్స్ వచ్చేశాయి. ఇప్పుడు లెర్నింగ్ అనేది క్లాస్ రూమ్ గోడలు దాటి ఆన్‌లైన్ క్లాసుల వరకు వచ్చేసింది. టెక్నాలజీ ఎంత మారుతున్నా స్కూల్ అసలు ఉద్దేశం మాత్రం ఒక్కటే.. పిల్లలకి నాలెడ్జ్ ఇవ్వడం, సొంతంగా ఆలోచించేలా చేయడం, మంచి పౌరులుగా తీర్చిదిద్దడం. గురుకులాల నుంచి గూగుల్ క్లాస్ రూమ్స్ వరకు.. ఆ గైడింగ్ ప్రిన్సిపల్ మాత్రం ఎప్పటికీ మారదు.

# రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో పులి సంచారం

**జనావాసాల ప్రాంతాలలో తగు జాగ్రత్తలు అవసరం**

**ముఖ్యంగా పిల్లలను బయటకు రాకుండా పెద్దలు తగు జాగ్రత్తలు తీసుకోవాలి**

**అక్కమ్మ తల్లి గుడి సమీపంలో మాజీ ఎంపీ మార్గాని భరత్ పర్యటన**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇప్పటికే పులి సుమారు వారం రోజులుగా తూర్పు గోదావరి జిల్లాలో సంచరిస్తూ రాజమండ్రి సిటీకి అతి సమీపంలో సంచరిస్తున్నదని, నిన్న రాత్రి దివాన్ చెరువు వద్ద, ప్రస్తుతం అక్కమ్మ తల్లి కొండ వద్ద చేరుకున్నదని, కొండ దాటితే శాటిలైట్ సిటీ ఎక్కువ జనాలు నివసించే ప్రదేశమని తెలిపిన వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి రాజమండ్రి మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్... అక్కమ్మ తల్లి కొండ ప్రాంతానికి విచ్చేసిన భరత్ రామ్, అక్కడ విధులు నిర్వర్తిస్తున్న అటవీ శాఖ, పోలీస్ శాఖ వారిని పులి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పులిని త్వరగా బంధించే విధంగా ఏర్పాటు చేసుకోవాలని అత్యాధునిక పరికరాలు లేవని తెలుపగా సాక్షాత్తు పవన్ కళ్యాణ్ అటవీ శాఖ కూడా మంత్రి అని, అవి సిబ్బందికి అందుబాటులో లేకపోవడం విచారకరమని భరత్ తెలిపారు. దురదృష్టవశాత్తు జనాలు నివసించే ప్రాంతంలోకి పులి ప్రవేశిస్తే ఆ ఊహే భయంకరంగా ఉందని, కనుక యుద్ధప్రాతిపదికన పులి ని బంధించేలా చర్యలు తీసుకోవాలని భరత్ కోరారు. పాత్రికేయుల అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగ నడుస్తున్నది అని లోకేష్ చెప్తున్నారని, డాక్టర్ అంబేద్కర్ రాజ్యాంగం మీద కనీస గౌరవం కూటమి ప్రభుత్వానికి లేదని,, ఇటీవల మాజీ మంత్రుల పైన కుట్రపూరిత దాడులు, అక్రమ అరెస్టులు నిలువెత్తు సాక్ష్యం అని భరత్ అన్నారు. ఇక్కడ రాష్ట్రంలో జరుగుతున్న ఆటవిక పాలన మీద కేంద్రానికి నివేదిక ఇస్తామని అలాగే రాష్ట్రానికి శాంతి భద్రతలు కాపాడటానికి కేంద్ర బలగాల సహాయం కోరతామని భరత్ తెలిపారు.

**724 మంది విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాలు**

# పంపిణీ చేసిన బత్తుల వెంకటలక్ష్మి



**రాజానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇరాజా నగరం మండలం రాజానగరం ప్రైమరీ హెల్త్ సెంటర్ నందు జాతీయ అంధత్వ నివారణ సంస్థ మరియు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్య ఆరోగ్య మరియు కుటుంబసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాఠశాల విద్యార్థులకు ఉచిత కంటి అద్దాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు కంటి అద్దాలను జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కమిటీ కో-ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి అందించారు. అనంతరం జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం టి.బి.ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా పలు రకాల డ్రై ఫ్రూట్స్‌తో పోషకాహార బుట్టలను బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా బత్తుల వెంకటలక్ష్మి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్య ఆరోగ్య మరియు కుటుంబసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రాజానగరం నియోజకవర్గం వ్యాప్తంగా మొత్తం 8122 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా అందులో 724 మంది విద్యార్థులకు కంటి అద్దాలను అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన, తెలుగుదేశం, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలి

**క్యాన్సర్‌పై అవగాహన చాలా ముఖ్యం**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** క్యాన్సర్ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కల్గి ఉండాలని డాక్టర్ హారిక ప్రియంవధ అన్నారు.కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ (ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పియంపి అసోసి యేషన్) రాజమహేంద్రవరం శాఖ ఆద్వర్యంలో బుధవారం ప్రపంచ క్యాన్సర్ అవగాహన దినోత్సవం పురస్కరించుకుని తిలక్ రోడ్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ఆఫీసు నుండి వీఎల్ పురం మీదుగా మోరంపూడి వరకు మండల అధ్యక్షులు రహమాన్ ఖాన్ సారధ్యంలో ఆదిత్య కాలేజీ యూత్ రెడ్ క్రాస్ విద్యార్థినులు,పీఎంపీ సభ్యులు కలిసి 'అందరం ఏకమవుదాం క్యాన్సర్‌ను అరికడదాం' అని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని స్థానిక మేక్సీ విజన్ కంటి హాస్పిటల్ వైద్యురాలు డాక్టర్ హారిక ప్రియంవధ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ హారిక మాట్లాడుతూ క్యాన్సర్‌పై అవగాహన కల్పించడంలో పీఎంపీలు చేస్తున్న సేవలను అభినందనీయమని అన్నారు,నేటి ఆహార నియమాలలో మార్పులు, ప్లాస్టిక్ వాడకం వలన, ధూమపానం, మద్యపానం వలన ఎక్కువగా క్యాన్సర్ బారిన పడుతున్నారని అన్నారు. క్యాన్సర్‌ను ముందుగా గుర్తిం చాలంటే అవగాహన ముఖ్యమని అన్నారు. కంటికి సంబం ధించిన రుగ్మతలను వివరించారు. అనంతరం ఎఫ్ కేఫ్ వేడుక ఫంక్షన్ హాల్లో అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో క్యాన్సర్ పై, క22ంటి వ్యాధులు పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు,రాష్ట్ర మీడియా కన్వీనర్ బళ్ళా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం అందించే క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు అందరూ చేయించుకునేలా ప్రజలలో మమేకమై ఉండే పీఎంపీ లు అవగాహన కల్పించాలని, క్యాన్సర్ ను ప్రారంభంలోనే గుర్తించి నాణ్యమైన చికిత్స అందిస్తే రోగి తప్పకుండా కోలుకుంటాడని చికిత్స తో పాటు మంచి పోషకవిలువలు ఉన్న ఆహారాన్ని అందించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పీ దేవానందం, మండల కార్యదర్శి మట్టా రమేష్,రెడ్ క్రాస్ జిల్లా కోశాధికారి డాక్టర్ జి మహాలక్ష్మి, ఆదిత్య కళాశాల ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ జి నాగేశ్వరరావు, కేఎస్ఎన్ రెడ్డి, బేబీ సరోజిని, వి శైలజ, ఎస్ లక్ష్మణరావు, కోల లక్ష్మీనారాయణ, హీరా, రాజ్యలక్ష్మి, కె మాసరరాజు, పి వాసు, ఎన్ సత్యనారాయణ, ఎమ్ఎస్ ప్రకాష్, ఎమ్ జానకీరామయ్య లతో పాటు సభ్యులు పాల్గొన్నారు.

# ఉరివేసుకుని వివాహిత ఆత్మహత్య

**విచారణ చేపట్టిన సీఐ దొరరాజు**



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట పట్టణంలో వివాహిత మహిళ ఉరి వేసుకోని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు అనుమానస్పద మృతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మండపేట రూరల్ సిఐ దొర రాజు కేసు విచారణ చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు మండపేట టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పాటిమీద ప్రాంతంలో నివసిస్తున్న వాసంశెట్టి దుర్గాలక్ష్మి అలియాస్ దేవి (40)కు 2007 సంవత్సరంలో వివాహం జరిగింది. ఆమెకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆమె భర్త ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. గత కొంతకాలంగా భర్తపై అనుమానంతో వారి మధ్య మనస్తాపాలు చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది.ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి సుమారు 8.30 గంటలకు ఆమె అద్దె ఇంటిలో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది.ఈ సంఘటనపై అనుమానాస్పద మృతి మండపేట టౌన్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ రాజబాబు కేసు నమోదు చేశారు. దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు టౌన్ పీఎస్ ఇన్ ఛార్జ్ సిఐ దొర రాజు తెలిపారు.

**పెన్షన్ భవనం పై అంతస్తుకు**

# నిధులు మంజూరు చేయండి

**ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరికి పెన్షనర్ల వినతి**



**ధవలేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ధవళేశ్వరం పెన్షనర్స్ అసోసియేషన్ (ఎ.పి.ఎస్.జి.ఆర్.ఈ.ఏ) అధ్యక్షులు యర్ర మోతు ధర్మరాజు ఆద్వర్యంలో రాజమహేంద్ర వరం గ్రామీణ శాసనఎసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి నివాసంలో ధవళేశ్వరం పెన్షనర్స్ సంఘ సభ్యులు కలసి ప్రస్తుత సంఘ భవనంపై అంతస్తుకు నిధులు కేటా యించవలసిందిగా వినతిపత్రం అందించారు. ప్రస్తుతం సుమారు రెండువందల మంది సభ్యులతో తూర్పుగోదావరి జిల్లాలో ధవళేశ్వరం యూనిట్ అతిపెద్ద సంఘంగా విశ్రాంత ఉద్యోగులకు విశిష్ట సేవలు అందిస్తుందని జిల్లా అధ్యక్షులు పల్లా సత్యనారాయణ మూర్తి, బుచ్చయ్య చౌదరి కి వివరించారు,జలవనరుల, ఉపాధ్యాయ, పంచాయతీ, పోలీస్, రెవెన్యూ, టెలికాం తదితర విభాగాల విశ్రాంత ఉద్యోగులతో సంఘం విరాజిల్లుతుందని, గుత్తేదారు మాధవవర్మ ప్రహరీ, గాలి సుబ్బరాజు సహాయార్థం టాయిలెట్ నిర్మించారు. అందరూ కనీసం కూర్చోవడానికీ సరిపడు జాగా లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కావున పైన అంతస్తుకు నిదులు మంజూరు చేయ వలసిందిగా ధర్మరాజు కోరారు, మేమంతా సుమారు ఐదు లక్షలతో ఫ్లోరింగ్, మెట్లు, శ్లాబ్ చుట్టూ రక్షణ గోడ నిర్మించినట్టు, సబ్యులకు ప్రతీ నెలా వైద్య శిభిరం ఏర్పాటు చేస్తున్నట్టు, కోశాధికారి ఉగ్రింకల సత్యనారాయణ వివరించారు, ఈ కార్యక్రమం లో ప్రొఫెసర్ ఐ. వి. సుబ్బారావు, ఆలిండియా నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘ ఉపాధ్యక్షులు వెంపరాల వెంకటేశ్వర్లు, సమర్తకుర్తి రాంబాబు, బుగ్గా సుబ్రహ్మణ్యం, అంజూరి సూర్యారావు, రంగారావు, సమర్తకుర్తి సుబ్బారావు, శ్రీరంగం వెంకటేశ్వర్లు, చెల్లుబోయిన శ్రీరాములు, పినిశెట్టి సత్యనారాయణ, కొంజెర్ల వెంకటరత్నం, బొమ్మా రాము తదితరులు పాల్గొన్నారు, ముందుగా బుచ్చయ్య ను జిల్లా అధ్యక్షులు పల్లా సత్యనారాయణ మూర్తి దుశ్శాలువాతో సత్కరించారు, పై అంతస్తు కు ఎస్టిమేషన్ వేయించి తీసుకురండి, గతంలో మాదిరిగా శాసనసభ్యులకు ప్రత్యేక నిధులు లేవు, అయినా మీ సమస్య సరైనదే కావున ప్రత్యామ్నాయం చూద్దామని హామీ ఇచ్చినట్లు ధర్మరాజు తెలియజేశారు.

# కొత్తరకం కేటుగాళ్లు.. అమ్మాయిలతో చాటింగ్ చేసే వాళ్లే టార్గెట్..



త్రెడ్స్ యాప్‌లో మహిళలతో చాటింగ్ చేసే వారికి ఫోన్లు చేసి.. పోలీసులమంటూ బెదిరించి లక్షలు కొల్లగొడుతూ సైబర్ నేరాలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను కోవెలకుంట్ల పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం స్థానిక సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో ఆళ్లగడ్డ డి.ఎస్.పి ప్రమోద్ ఈ కేసు వివరాలను మీడియాకు వివరించారు. త్రెడ్స్ యాప్‌లో మహిళలతో చాటింగ్ చేసే వారికి ఫోన్లు చేసి.. పోలీసులమంటూ బెదిరించి లక్షలు కొల్లగొడుతూ సైబర్ నేరాలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను కోవెలకుంట్ల పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం స్థానిక సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో ఆళ్లగడ్డ డి.ఎస్.పి ప్రమోద్ ఈ కేసు వివరాలను మీడియాకు వివరించారు. తెలంగాణ రాష్ట్రం మహబూబ్ నగర్ జిల్లా హన్వాడకు చెందిన అక్కపల్లి చంద్రశేఖర్ (32 ) దాసరి సందీప్ కుమార్(27) అనే ఇద్దరు నిందితులు గత కొంతకాలంగా సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు. త్రెడ్స్ యాప్ లో అమ్మాయిల ఫోటోలు కింద అసభ్యకరంగా మెసేజ్ లు పెడుతూ చాటింగ్ చేసే వ్యక్తులను టార్గెట్ చేయడం వీరి పని. కోవెలకుంట్ల కు చెందిన కర్నాటి ప్రతాపరెడ్డి త్రెడ్స్ యాప్ లో మహిళలతో చాటింగ్ చేయడంతో సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కాడు. వీరు ప్రతాపరెడ్డి ని టార్గెట్ చేశారు. గద్వాల ఎస్ఐని మాట్లాడుతున్నానంటూ బాధితుడు ప్రతాపరెడ్డికి నిందితుడు చంద్రశేఖర్ ఫోన్ చేశాడు.. త్రెడ్స్ యాప్ లో చాటింగ్ చేసిన గద్వాలకు చెందిన మహిళ ఆత్మహత్యకు పాల్పడింది.. అంటూ బాధితుడు ప్రతాపరెడ్డిని బెదిరిస్తూ బ్లాక్ మెయిల్ చేశారు. ఆత్మహత్యకు పాల్పడిన మహిళా భర్త కండక్టర్ అని అతనితో మాట్లాడి సెటిల్మెంట్ చేసుకోవాలని లేకపోతే కేసు నమోదు చేసి అరెస్ట్ చేస్తామని ప్రతాపరెడ్డిని బెదిరించారు. చాటింగ్ చేసిన మహిళా ఆస్పత్రిలో కొన ఊపిరితో ఉందని రూ.4 లక్షలు ఇవ్వాలని వారు ప్రతాప్ రెడ్డిని డిమాండ్ చేశారు. దీంతో భయపడి పోయిన బాధితుడు బ్లాక్ మెయిల్ చేసిన సైబర్ నేరగాళ్ళకు బాధితుడు ప్రతాపరెడ్డి 30 వేలు ఫోన్‌పే చేశాడు. అంతటితో ఆగని సైబర్ నేరగాళ్లు ఇంకా డబ్బు పంపాలని టార్చర్ చేయసాగారు. దీంతో సైబర్ నేరగాళ్ల టార్చర్ భరించలేక ప్రతాపరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. ఫోన్ పే ట్రాన్జాక్షన్ ఆధారంగా సైబర్ నేరగాళ్లను గుర్తించారు. కేవలం కేసు నమోదైన ఐదు రోజుల్లోనే నిందితులను గుర్తించి అరెస్టు చేశామని డీఎస్పీ ప్రమోద్ తెలిపారు. సోషల్ మీడియా ఆధారంగా ఈ ఇద్దరు సైబర్ నేరగాళ్లు ఎస్సైలు కాకపోయినా ఎస్సైలమని బెదిరించి గతంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో కూడా పలువురిని బెదిరించారన్నారు. ఇలా వారి ఫోన్ పే, బ్యాంకు ఖాతాలకు రూ.15 లక్షలు వరకు నగదు బదిలీ చేయించుకున్నట్లు పోలీసుల విచారణలో తెలిసిందని డిఎస్పి ప్రమోద్ తెలిపారు. ఎవరైనా వీరి వలన ఆంధ్రప్రదేశ్ తో పాటు ఇతర రాష్ట్రాలలో మోసపోయి ఉంటే ఇప్పటికైనా సంబంధిత పోలీస్ స్టేషన్ లలో ఫిర్యాదు చేయవచ్చని ఆళ్లగడ్డ డిఎస్పి ప్రమోద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కోవెలకుంట్ల సర్కిల్ ఇన్స్పెక్టర్ హనుమంతు నాయక్, ఎస్ఐ మల్లికార్జున రెడ్డి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఏపీలోని రైతులకు ప్రభుత్వం శుభవార్త.. రాష్ట్రవ్యాప్తంగా త్వరలో కొత్త కార్యక్రమం.. రైతులందరికీ బెనిఫిట్

రైతులకు ఉపయోగపడేలా ఏపీ ప్రభుత్వం త్వరలో మరో కొత్త కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించనుంది. ఆర్గానిక్ వ్యవసాయం ఇటీవల ట్రెండ్ అవుతున్న క్రమంలో దాని ద్వారా రైతులు ఎక్కువ ఆదాయం సంపాదించేలా ప్రభుత్వం సహాయపడనుంది. దీనికి సంబంధించి సీఎం చంద్రబాబు కీలక ప్రకటన చేశారు. ఏపీలోని రైతులకు లబ్ధి చేకూర్చేలా కూటమి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఆర్గానిక్ వ్యవసాయం చేసేలా రైతులను ప్రోత్సహించేందుకు త్వరలో కొత్త కార్యక్రమం చేపట్టనుంది. ఈ మేరకు అధికారులకు సీఎం చంద్రబాబు కీలక సూచనలు జారీ చేశారు. తాజాగా సచివాలయంలో వ్యవసాయ శాఖ అధికారులతో చంద్రబాబు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్గానిక్ ఫార్మింగ్‌పై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఆర్గానిక్ వ్యవసాయంలో ఏపీని టాప్‌లో నిలపడంలో భాగంగా కొత్త కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని రైతులు ప్రకృతి వ్యవసాయం చేసేలా పలు సదుపాయాలు ప్రభుత్వం కల్పించనుంది. రైతులకు ట్రైనింగ్ ఇవ్వడంతో పాటు పండించినవాటిని సులువుగా విక్రయించుకునేలా ప్రభుత్వం సహాయపడనుంది.

**ఆర్గానిక్ ఫార్మింగ్‌కు సర్టిఫికేషన్**

ఏపీ ప్రభుత్వం త్వరలో ఆర్గానిక్ వ్యవసాయం కోసం ప్రత్యేక కార్యక్రమం చేపట్టనుంది. తొలుత రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయం చేసేందుకు ముందుకొచ్చిన 18 లక్షల మంది రైతులకు సహకారం అందించనున్నారు. రైతులు పండించే ఆర్గానిక్ ఉత్పత్తుల నాణ్యత అందరికీ తెలిసేలా సర్టిఫికేషన్, ట్రేసబిలిటీ సాదుపాయం ప్రభుత్వమే అందించనుంది. వచ్చే ఏప్రిల్ నాటికి ఈ ప్రాసెస్ అంతా పూర్తి చేయాలని అధికారులను చంద్రబాబు ఆదేశించారు. ఇక రైతులకు ఆర్గానిక్ వ్యవసాయం ఎలా చేయాలి..? ఎలా రాబడి పొందాలి? అనే దానిపై ఉచితంగా ట్రైనింగ్ ఇవ్వనున్నారు. అలాగే వాటిని మార్కెట్‌లో విక్రయించుకోవడానికి ప్రభుత్వం తోడ్పాటు అందించనుంది. రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా 40 లక్షల మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేసేలా ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందించనుంది. అంతర్జాతీయ స్థాయిలో ఏపీ వ్యవసాయ ఉత్పత్తుల వాటా పెరిగేలా చర్యలు చేపట్టాలని చంద్రబాబు పేర్కొన్నారు.

**వాటి నమోదు తప్పనిసరి**

ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఏపీలో ఆక్వా సాగు చేసేవారు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. అటు పౌల్ట్రీ రంగంలో ఉన్న రైతులకు ప్రభుత్వం సహాయం అందించనుంది. అందులో భాగంగా అంగన్వాడీలకు అవసరమైన గుడ్లను పౌల్ట్రీ రైతులు సరఫరా చేసేలా కాంట్రాక్ట్‌లు ఇవ్వనున్నారు. ఇక ఏలూరు జిల్లాలో 500 ఎకరాల్లో కోకో సిటీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇక లంబసింగిలో కుంకుమ పువ్వు సాగు ప్రణాళికలు రూపొందించాలని అధికారులను చంద్రబాబు ఆదేశించారు. స్థానిక గిరిజనుల భాగస్వామ్యంతో కుంకుమ పువ్వు సాగుపై నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. పీపీపీ పద్ధతిలో సాగు చేస్తే లాభం ఉంటుందన్నారు. అటు ఎల్‌నీవో ప్రభావం నుంచి రైతులను బయటపడేసేందుకు వర్షాలు తక్కువగా ఉండే ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.



# రామచంద్రపురం నియోజకవర్గంలో విద్యుత్ విప్లవం

**రూ.5 కోట్లతో ద్రాక్షారామంలో 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్, అభివృద్ధి పనులు ప్రారంభించిన మంత్రి సుభాష్**

**15 గ్రామాలకు తీరనున్న విద్యుత్ లో-వోల్టేజ్ సమస్యలు**



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** ద్రాక్షారామం వేసవిలో విద్యుత్ లో ఓల్టేజ్ సమస్యలతో సతమతమయ్యే గ్రామాలకు శాశ్వత పరిష్కారం చూపించారు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్. ద్రాక్షారామ గ్రామపంచాయతీ పరిధిలోని లేఔట్-4లో ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) ఆధ్వర్యంలో రూ. 3.05 కోట్లతో నిర్మించిన 33/11 ఖ౦ విద్యుత్ సబ్ స్టేషన్, రూ.2 కోట్లతో చేపట్టిన విద్యుత్ ఆధునీకరణ పనులను మంత్రి వాసంశెట్టి సుభాష్ బుధవారం ఘనంగా ప్రారంభించారు. దీంతో ఏళ్ల తరబడి 15 గ్రామాల్లో ఉన్న లో వోల్టేజ్ సమస్య కష్టాలు తీరాయి. ఈ సందర్భంగా రామచంద్రపురం రూరల్ మండలం అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనుబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ ఈ నూతన సబ్ స్టేషన్ ప్రారంభంతో ద్రాక్షారామతో పాటు వెలంపాలెం, జగన్నాయకులపాలెం, ఆదివారపు పేట, వెల్ల, వెల్లసావరం, ఏరుపల్లి, గొల్లలచెరువు, వాటర్ వర్క్స్, కందులపాలెం, హసన్‌బాద్ ఉండూరు, భీమక్రోసుపాలెం, తోటపేట, అన్నాయిపేట, వేగాయమ్మపేట, వెంకటాయపాలెం తదితర గ్రామాలకు శాశ్వత లో వోల్టేజ్ సమస్యలకు పూర్తిస్థాయి పరిష్కారం, అగ్రికల్చరల్ సర్వీసులకు 9 గంటల విద్యుత్ లభిస్తుందని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి విద్యుత్ మౌలిక వసతులు కీలకమన్నారు. ఈ సబ్ స్టేషన్ ద్వారా గృహాలు, వ్యవసాయం, వాణిజ్యం, పరిశ్రమలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుబాటులోకి వచ్చి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు. అలాగే ద్రాక్షారామ సెక్షన్ పరిధిలో విద్యుత్ పోల్స్ ఎత్తు పెంచడం, కొత్తగా 19 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు, పాడైన పోల్స్ స్థానంలో కొత్తవి ఏర్పాటు, షార్ట్ డి టి ఆర్ ఎస్, పాడైన కండక్టర్ మార్పు, ఎల్ టి ఏ బి కేబుల్ తదితర పనుల కోసం రూ. 2.01 కోట్లుతో పనులు పూర్తి చేశారు. మొత్తంగా రూ. 5 కోట్లు వెచ్చించడం ద్వారా విద్యుత్ సంస్కరణలు జరిగాయి. మంత్రి సుభాష్ మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు మొత్తం 8 సబ్ స్టేషన్ లో మంజూరు కాగా మొదటగా ఇక్కడే ప్రారంభించమన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని, విద్యుత్ ధరలను తగ్గించి ప్రజలకు ఊరటనిచ్చే దిశగా నిర్ణయాలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. అదే సమయంలో గత వైసిపి ప్రభుత్వం ట్రూ అప్ పేరుతో 9 సార్లు విద్యుత్ ధరలు పెంచి సామాన్య ప్రజలపై భారాన్ని మోపిందని తీవ్రంగా విమర్శించారు. రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ద్వారా గడచిన 19 నెలల్లో 30 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి రానున్నాయని, వీటి ద్వారా 20 లక్షల ఉద్యోగాల కల్పన సాధ్యమవుతుంది అన్నారు. విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ బి రాజేశ్వరి మాట్లాడుతూ మంత్రి సుభాష్ కృషితో పనులు వేగవంతం చేసి వేసవి ముందే సబ్ స్టేషన్ ప్రారంభించడం ఆనందకరమన్నారు. పీఎం సూర్య ఘర్ పథకాన్ని ప్రజల సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత రాయ్, ద్రాక్షారామం సర్పంచ్ కొత్తపల్లి అరుణ లు మాట్లాడుతూ ప్రజా సమస్యల పట్ల చిత్తశుద్ధితో మంత్రి సుభాష్, కూటమి ప్రభుత్వం చొరవతో రామచంద్రపురం నియోజవర్గంలో పలు అభివృద్ధి పనులు జరిగాయని సభలో వివరించారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ సీనియర్ నాయకులు చింతపల్లి వీరభద్రరావు, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ పెంకె అన్నపూర్ణ, బీసీ సెల్ రాష్ట్ర నాయకులు పెంకే సాంబశివరావు, కే గంగవరం మండల అధ్యక్షులు మేడిశెట్టి రవికుమార్, కాజులూరు మండల అధ్యక్షులు చవ్వాకుల నారాయణమూర్తి, పిఎసిఎస్ చైర్మన్ ముప్పనపల్లి గణేష్, ఆకే టి కృష్ణ, బొండా వెంకన్న, బుచ్చిరాజు, ద్రాక్షారామం సర్పంచ్ కొత్తపల్లి అరుణ, రామచంద్రపురం రూరల్ మండల టిడిపి అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనుబాబు, విద్యుత్ శాఖ ఈ ఈ కే రత్నాలు రావు, ఈ ఈ టెక్నికల్ విజయానంద్,ఏ ఈ వెంకటరమణ, పలువురు అధికారులు, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**అయినవిల్లి, అమలాపురం రూరల్ పోలీస్ కార్యాలయాల్లో**

# ఐజీ వార్షిక తనిఖీలు




**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏలూరు రేంజ్ ఐజీ జివిజి అశోక్ కుమార్ ఐపీఎస్ అయినవిల్లి పోలీస్ స్టేషన్, అమలాపురం రూరల్ సర్కిల్ కార్యాలయంలో వార్షిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయాల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, పలు అంశాలపై సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా ఆయా స్టేషన్ల పరిధిలో నమోదైన కేసుల దర్యాప్తు పురోగతిని ఐజీ పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను వేగవంతంగా పూర్తిచేసి, నిందితులకు శిక్షలు పడేలా సమర్థవంతమైన దర్యాప్తు చేపట్టాలని అధికారులకు సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని, డ్రంకెన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్‌పై కఠిన తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠినంగా కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. అలాగే దొంగతనాలకు సంబంధించిన కేసుల్లో ప్రాపర్టీ రికవరీ శాతాన్ని పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు భద్రతపై భరోసా కల్పించేందుకు విజిబుల్ పోలీసింగ్ (గస్తీ)ను మరింత బలోపేతం చేయాలని పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించే బాధితుల సమస్యలకు తక్షణమే స్పందించి పరిష్కారం చూపాలని, ప్రజలతో మర్యాదగా మెలగాలని సిబ్బందికి సూచించారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించిన ఐజీ, ప్రత్యేక సెల్ ద్వారా నిరంతర నిఘా కొనసాగుతుందని తెలిపారు. ప్రజలు సోషల్ మీడియాలో పోస్టులు షేర్ చేసే ముందు నిజానిజాలు నిర్ధారించుకోవాలని సూచించారు. అలాగే సైబర్ నేరాలు, మహిళల రక్షణకు సంబంధించిన చట్టాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌లు, కార్యాలయ పరిసరాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ తనిఖీలో డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఐపీఎస్, అడిషనల్ ఎస్పీ ఏ.వి.ఆర్.పి.బి. ప్రసాద్, కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీకృష్ణ, అమలాపురం డీఎస్పీ టి.ఎస్.ఆర్.కె. ప్రసాద్, అమలాపురం సర్కిల్ సీఐ ప్రశాంత్ కుమార్, పి.గన్నవరం సీఐ భీమరాజు, ఎస్బీసీఐ వి. పుల్లారావు, అయినవిల్లి పోలీస్ స్టేషన్ ఎస్ఐ జ్యోతి, అమలాపురం తాలూకా ఎస్ఐ శేఖరబాబు, అల్లవరం ఎస్ఐ సంపత్ కుమార్, ఉప్పలగుప్తం ఎస్ఐ రాజేష్ తదితర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

**స్థానిక సంస్థలఎన్నికల్లో కూటమి విజయానికి**

# సమన్వయంతో ముందుకు సాగాలి : ముత్యాల బాబ్జి



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** వాడపాలెం -పలివెలలో తెలుగుదేశం పార్టీ గ్రామస్థాయి సమావేశం కొత్తపేట నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆదేశాల మేరకు మండల పార్టీ అధ్యక్షులు గనిశెట్టి వీరేష్ ఆధ్వర్యంలో బుధవారం వాడపాలెం తెలుగుదేశం పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పప్పులు బుజ్జి, పలివెల గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడువై . వి.కృష్ణ అధ్యక్షతన గ్రామస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా, మండల స్థాయి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు ముత్యాల బాబ్జి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వ ఏర్పాటుకు అనంతరం గడిచిన పద్దెనిమిది నెలల్లో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, కూటమిలో భాగంగా ఉన్న ఇతర పార్టీల నాయకులను కూడా సమన్వయంతో కలుపుకుని ముందుకు సాగాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి జెండాలు ఎగరవేయాలంటే ప్రతి కార్యకర్త క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. మండల పార్టీ అధ్యక్షులు గనిశెట్టి వీరేష్ మాట్లాడుతూ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ రోజు వాడపాలెం, పలివెల గ్రామాల్లో సమావేశం నిర్వహించగలిగినందుకు సంతోషంగా ఉందన్నారు. ఇకపై ప్రతి నెల ఒకటో తేదీన గ్రామస్థాయి సమావేశాలు నిర్వహించి గ్రామాల్లోని సమస్యలపై చర్చించుకుంటామని, ఏవైనా సమస్యలు ఉంటే మండల, దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని సమస్యలు తమ స్థాయిలో పరిష్కారం కాకపోతే ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకుల రెడ్డి శ్రీను ,కంఠంశెట్టి శ్రీను, పల్లి కుమార్ రాజ్ ప్రధాన కార్యదర్శి కడలి భీమ మరియు పలివెల, వాడపాలెం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**విద్యార్థుల సౌకర్యాలు, నాణ్యమైన**

# బోధనకు ప్రాధాన్యత ఇవ్వాలి : కలెక్టర్ మహేష్



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** విద్యార్థుల సౌకర్యాలు, చదువు నాణ్యత, వసతి వసతులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి వారి ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం పి.గన్నవరం మండల పరిధిలోని నరేంద్రపురం అంబేద్కర్ గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న డార్మిటరీలు, వంటగది, టాయిలెట్లు, స్టోర్ రూమ్, దోమల నివారణకు వినియోగిస్తున్న నెట్లను పరిశీలించారు. పాఠశాల పరిసరాల పరిశుభ్రత, పిచ్చి మొక్కల తొలగింపు, వంట సరుకులు, కూరగాయలు, నూనె, పప్పులు, బియ్యం నాణ్యతలను స్వయంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి బోధనా విధానాలు, ఉపాధ్యాయుల పనితీరుపై వివరాలు తెలుసుకున్నారు. తరగతి గదిలో బోధించిన పాఠ్యాంశాలపై విద్యార్థులకు ఎంత అవగాహన ఉందో ప్రశ్నల ద్వారా తెలుసుకున్నారు. భోజన నాణ్యత, పరిశుభ్రత, వసతులపై విద్యార్థుల అభిప్రాయాలను అడిగి సమస్యలను గుర్తించారు. ప్రిన్సిపాల్‌కు తాజా సరుకులతో భోజనం వండి, శుభ్రంగా వడ్డించాలని ఆదేశించారు. పాఠశాల ఆవరణను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని, పిచ్చి మొక్కలను తొలగించాలని సూచించారు. గుణాత్మకమైన బోధన ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని, పాఠశాల సిద్ధతలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలు, సూచనలు తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. గురుకుల పాఠశాలలో విద్యార్థుల భోజనం, బోధనా ప్రక్రియ, పరిశుభ్రత, సౌకర్యాలలో లోపాలు ఉంటే వెంటనే సరిచేయాలని మండల అధికారులకు సూచనలు జారీ చేశారు. విద్యార్థుల అనారోగ్య పరిస్థితుల్లో వెంటనే వైద్యులను సంప్రదించి నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు, అత్యవసర సందర్భాల్లో ఐసీఐసీఐ లాంబార్డ్ ఇన్సూరెన్స్ సేవలను సమర్థవంతంగా వినియోగించాలని ఆదేశించారు. గురుకుల పాఠశాలలో నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు అందేలా ఉపాధ్యాయులు, సిబ్బంది సమన్వయంతో కట్టుబడి పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

**నియోజకవర్గంలో నాలుగు మండలాలకు, 54 పనులకు గాను**

# రూ.13.85 కోట్ల నిధులు మంజూరు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎమ్మెల్యే బండారు కృషితో కొత్తపేట నియోజకవర్గానికి ఎమ్జీఎన్ఆర్జీఈఎస్ నిధులు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కూటమి ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి 54 పనులకుగాను, రూ.13.85 కోట్లను ఎమ్జీఎన్ఆర్జీఈఎస్ నిధులు మంజూరు అయ్యాయని బుధవారం ఆయన తెలిపారు. నిధులు మంజూరు పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా ఆత్రేయపురం మండలానికి రూ.3.15 కోట్ల నిధులు, రావులపాలెం మండలానికి రూ.3.60కోట్లు, కొత్తపేట మండలానికి రూ. 3.22కోట్లు, ఆలమూరు మండలానికి రూ. 3.88 కోట్లు నిధులు మంజూరు అయ్యాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నిధులు మంజూరు చేసిన పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# మంత్రి వాసంశెట్టి సుభాష్ ఔదార్యం

**ముగ్గురికి రూ.20 వేలు ఆర్థిక సహాయం**



**కాజులూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** అనారోగ్యం, ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్న ముగ్గురికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ బుధవారం రూ.20 వేలు ఆర్థిక సహాయం అందించారు. వివరాల్లోకి వెళితే రామచంద్రపురం నియోజవర్గం కాజులూరు మండలం పల్లిపాలెం గ్రామంకు చెందిన అనిశెట్టి శ్రీనివాసరెడ్డి గత కొంతకాలంగా ఊపిరితిత్తులు వ్యాధులతో బాధపడుతున్నారు. ఆయన కుటుంబానికి మంత్రి సుభాష్ రూ. 10 వేలు ఆర్థిక సాయం అందించారు. అదే గ్రామానికి చెందిన మడికి జ్యోతి భర్తను కోల్పోయి ఆర్థిక భారంతో ఇబ్బందులు పడుతుంది. ఈ సమస్యను స్థానిక నాయకుల ద్వారా తెలుసుకొని రూ.5 వేలు సహాయం అందించారు. అంతేకాకుండా వితంతు పింఛను మంజూరు అయ్యే వరకు ప్రతినెల రూ.5 వేలు చొప్పున సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. అలాగే కె గంగవరం మండలం అముజూరు గ్రామానికి చెందిన గుడిమెట్ల దేవి భర్త ఉన్నా..చెడు వ్యసనాలకు అలవాటు పడి నిర్లక్ష్యం చేయడంతో, ముగ్గురు చిన్న పిల్లలతో పేదరికంతో సతమతమవుతున్నారు. దేవికి కూడా రూ.5 వేలు ఆర్థిక సహాయం, పిల్లలకు అవసరమైన మందులు అందించడంతో పాటు, ప్రతినెల రూ.5 వేలు సహాయం చేస్తానని భరోసా ఇచ్చారు. మంత్రి సుభాష్ మానవత్వానికి, దయాగుణానికి బాధిత కుటుంబ సభ్యులు, కూటమి పార్టీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

# హిందుస్థాన్ లివర్ కంపెనీ వేర్‌హౌస్‌లో అగ్ని ప్రమాదం..

**ఎగసిపడుతున్న మంటలు**

**విశ్వం వాయిస్ న్యూస్ :** రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం అంతిరెడ్డిగూడ శివారులోని హిందుస్థాన్ లివర్ కంపెనీ వేర్‌హౌస్‌లో బుధవారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. కట్టెలు, థర్మకోల్ తదితర వ్యర్థాలకు ప్రమాదవశాత్తు నిప్పు అంటుకోవడంతో మంటలు చెలరేగాయి. ఘటనాస్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజిన్లతో మంటలను అదుపు చేస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు.. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని తెలిపారు.

**గోనెగుంట్ల వెంకటేశ్వరరావు**

# నోరు అదుపులో పెట్టుకో..

**నాగవరపు పరశురాముడు**



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** మాజీ సీఎం వైఎస్ఆర్సిపి పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి, మాజీ మంత్రి అంబటి రాంబాబు పై దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు చేసిన వ్యాఖ్యలు సభ్య సమాజం తలదించుకునేలా పరుష పదజాలాలతో అసభ్యకరంగా మాట్లాడిన మాటలను కోటేశ్వరరావు వెంటనే వెనకకు తీసుకుని వైయస్ జగన్మోహన్ రెడ్డికి అంబటి రాంబాబుకి బహిరంగ క్షమాపణ చెప్పాలని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగవరపు పరశురాముడు డిమాండ్ చేశారు. గోనెగుంట్ల కోటేశ్వరరావు నిజంగా దివ్యాంగుల పట్ల నీకు ప్రేమ ఉంటే ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు కావస్తున్న నేటికీ దివ్యాంగులు బ్యాక్లాగ్ పోస్టులు భర్తీ ప్రక్రియ కాలేదని దివ్యాంగులకు సబ్సిడీ రుణాలు మంజూరు కాలేదని దివ్యాంగులకు త్రీ వీలర్ స్కూటీలు మంజూరు కాలేదని దివ్యాంగుల ఉపకరణాలు వెంటనే అందించే విధంగా చర్యలు చేపట్టాలని దివ్యాంగులు నిందిస్తే సెక్షన్ 92ఏ ఎక్కడ ఏ పోలీస్ స్టేషన్లోనూ కేసులు నమోదు అవ్వట్లేదు అని ఇలాంటి ఎన్నో సమస్యలు దివ్యాంగులకు ఉన్నాయని వాటిని పరిష్కరించే విధంగా ప్రభుత్వంతో పోరాడాలని అంతేగాని దివ్యాంగుల ఫ్యాషన్ పెంపు కోట విరపత్రం ఘనత కాదని అది కేవలం మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ పోరాటఫలమేనని అన్నారు. కోటేశ్వరరావు వెంటనే క్షమాపణ చెప్పి వికాంగుల సమాజానికి ఉపయోగపడేలా హితవు పలకాలని కోరారు.

**ఆత్రేయపురంలో కోడిపందాల స్థావరంపై**

# పోలీసుల మెరుపు దాడి -12 మంది అరెస్ట్




**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఈ క్రమంలో కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీకృష్ణ పర్యవేక్షణలో ఆత్రేయపురం పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి మెరుపు దాడి నిర్వహించారు. ముందస్తు సమాచారం మేరకు ఆత్రేయపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని ర్యాలీ గ్రామ శివారులో ఉన్న మైనర్ సత్తిబాబు మకం వద్ద అనధికారికంగా కోడిపందాలు నిర్వహిస్తున్న స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో కోడిపందాలు నిర్వహిస్తున్న 12 మందిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుల వద్ద నుంచి రూ.15,000 నగదు మరియు నాలుగు కోడిపుంజులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఆత్రేయపురం ఎస్సై తెలిపారు. జిల్లాలో కోడిపందాలు, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే జైలు శిక్ష తప్పదని, ప్రజలు ఇటువంటి వ్యసనాలకు దూరంగా ఉండి పోలీసులకు సహకరించాలని పోలీస్ యంత్రాంగం విజ్ఞప్తి చేసింది.



# రెండు రోడ్డు ప్రమాదాల్లో ఒకని మరణం

## 12 మంది ప్రయాణికులకు గాయాలు



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం కత్తిపూడిలో బుధవారం తెల్లవారు జామున రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఒక ప్రమాదంలో ఒకతను అక్కడికక్కడే మృతి చెందాడు. 12 మందికి గాయాలు అయ్యాయి. వేరొక ప్రమాదంలో డ్రైవరు, క్లీనర్ ఇద్దరూ సురక్షితంగా బయట పడ్డారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. పిఠాపురం నియోజకవర్గం ఉప్పాడ కొత్తపల్లి మండలం శ్రీరాంపురం నుంచి ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామంలో చెట్లను నరికేందుకు కత్తిపూడి మీదుగా 15 మంది కూలీలను రవాణా చేస్తున్న ఆటో మార్గం మధ్యలో కత్తిపూడి ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న జాతీయ రహదారి అండర్ పాస్ బ్రిడ్జి దగ్గరకు వేగంగా వస్తున్నది. అదే సమయంలో ఈ ఆటోకు కాస్త ముందుగా పిఠాపురం నుంచి ఇసుక టిప్పర్ లారీ రౌతులపూడికి వెళు తూండగా దాని వెనుక నుంచి వస్తున్న ఆటో వేగం నియంత్రణ కాక ప్రమాద వశాత్తూ అదుపు తప్పి బలంగా లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీరాంపురం గ్రామానికి చెందిన పితాని కామరాజు (65) మృతి అక్కడికక్కడే మరణించాడు. ఇతనితో ప్రయాణిస్తున్న మరో 12 మంది నేమాల చిన్నప్పారావు, నేమాల సత్తిబాబు, నేమాల సత్యనారాయణ, దుళ్ళ సత్యనారాయణ, అమజాల కొండబాబు, అమజాల ముసలయ్య, పిల్లా అప్పారావు, టి.అప్పారావు, సుబ్బారావు, బాబురావు, మారియ్యలకు గాయాలు అయ్యాయి. ఈ ప్రమాదం నుంచి ఇద్దరు సురక్షితంగా బయట పడ్డారు. అన్నవరం పోలీసులు, జాతీయ రహదారి ప్రయాణీకుల రక్షణ సహాయక బృందం, అన్నవరం పోలీసు స్టేషన్ సిబ్బంది సహాయక చర్యలను చేపట్టారు. క్షతగాత్రులను వైద్య సహాయం కోసం, అలాగే మృత దేహానికి శవ పరీక్షల నిమిత్తం ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రెండో ప్రమాదం విషయానికి వస్తే ... రాజమండ్రి నుండి విశాఖపట్నం వైపు వివిధ వస్తువులను రవాణా లోడు లారీ కత్తిపూడి జాతీయ రహదారిపై సుబ్రహ్మణ్యం స్వామి గుడి ఎదురుగా ప్రమాద వసాత్తూ తనంత తానుగా బోల్తాపడింది. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరుగలేదు.లారీ డ్రైవరు, క్లీనర్ ఇద్దరూ సురక్షితంగా బయట పడ్డారు. రవాణాకు మాత్రం అంతరాయం కలిగింది. అన్నవరం ఎస్.ఐ, హైవే పెట్రోలింగ్ సిబ్బంది సమన్వయంతో నిలిచిపోయిన రవాణాను పునరుద్ధరించారు.

# కాకినాడలో క్రీడల అభివృద్ధికి కేంద్ర సహకారం

## ఎంపీ సానా సతీష్ బాబుకు షాప్ చైర్మన్ రవి నాయుడు కృతజ్ఞతలు



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** క్రీడల అభివృద్ధికి రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు పూర్తిస్థాయిలో సహకారం అందిస్తున్నారని షాప్ చైర్మన్ రవి నాయుడు అన్నారు. బుధవారం కాకినాడకు విచ్చేసిన ఆయన రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కాకినాడ పార్లమెంట్ పరిధిలోని కాకినాడ డీఎస్సీ మైదానం, జేఎన్టీయూ యూనివర్సిటీలో నిర్వహిస్తున్న స్పోర్ట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా కాకినాడకు రావడం జరిగిందని షాప్ చైర్మన్ అనిముని రవి నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా గౌరవ రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు కార్యాలయాన్ని కూడా సందర్శించడం జరిగిందన్నారు. క్రీడల అభివృద్ధికి ఎంపీ సానా సతీష్ బాబు పూర్తిస్థాయిలో సహకారం అందిస్తున్నారని ఆయన ప్రశంసించారు. ఒక్క క్రికెట్‌కే పరిమితం కాకుండా, అనేక ఇతర క్రీడా కార్యక్రమాలు, స్పోర్ట్స్ యాక్టివిటీల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి అవసరమైన నిధులు రాబట్టడంలో ఎంపీ గారు కీలక పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. కాకినాడపై ప్రత్యేక దృష్టి సారించి, క్రీడల మౌలిక వసతులు మరింత మెరుగుపడేలా స్పోర్ట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ బిల్డింగ్‌కు సంబంధించి రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు, స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో అనేక అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నారని రవి నాయుడు పేర్కొన్నారు. అలాగే ఎంపీ కార్యాలయాన్ని సందర్శించిన సందర్భంగా అక్కడ ఏర్పాటుచేసిన వ్యవస్థ తనను ఎంతో ఆకట్టుకుందని తెలిపారు. గ్రీవెన్స్ పరిష్కారం, కార్యకర్తలతో అనుసంధానం, పేద ప్రజల సమస్యలకు గౌరవంగా స్పందించే విధానం, వచ్చిన ప్రతి సమస్యను ట్రాక్ చేస్తూ పరిష్కార దిశగా ముందుకు తీసుకెళ్లే విధానం చాలా అద్భుతంగా ఉందన్నారు. ఎన్నో కార్యాలయాలు చూసినప్పటికీ, ఎంపీ సానా సతీష్ బాబు కార్యాలయం ప్రజా సమస్యల పరిష్కారానికి నిజమైన మోడల్‌గా ఉందని అభిప్రాయపడ్డారు. ఇలాంటి నాయకత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారని పేర్కొన్న రవి నాయుడు, కాకినాడ అభివృద్ధికి, ముఖ్యంగా క్రీడల రంగంలో విశేషంగా కృషి చేస్తున్న రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కార్యాలయం ఇన్చార్జ్ మేకా లక్ష్మణ్ మూర్తి ఘనంగా సత్కరించి జ్ఞాపకం అందజేశారు. కార్యాలయం సిబ్బందిని శాప్ చైర్మన్ రవి నాయుడుకు పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ యు సి సి సభ్యులు ముత్యాల అనిల్ కుమార్ ,న్యూటన్ ఆనంద్, సిరియాల కొండబాబు, అంకం రెడ్డి రామునాయుడు, ఉదయ్ పనసపాడు సర్పంచ్ చీకట్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# త్వరలో జాతీయ క్రీడలకు వేదికగా కాకినాడ




**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** జాతీయ, అంతర్జాతీయ క్రీడా వేదికగా కాకినాడను తీర్చిదిద్దుతామని ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ ఎమ్.రవినాయుడు పేర్కొన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం కాకినాడ జిల్లా క్రీడాప్రాధికార సంస్థ, జేఎన్టీయూకే స్టేడియాలను శాప్ చైర్మన్ రవినాయుడు సందర్శించారు. క్రీడాభివృద్ధి పనులతోపాటు డీఎస్ఏ ఇండోర్ స్టేడియాలు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ అంతర్జాతీయ క్రీడా సదుపాయాల కల్పనకు కాకినాడ అత్యంత అనుకూలమన్నారు. వచ్చే ఏడాదికి రాష్ట్రంలో 7 సింథటిక్ ట్రాక్ లను నిర్మించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని తెలిపారు. త్వరితగతిన జేఎన్టీయూకేలో క్రీడాభివృద్ధి పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించామన్నారు. జేఎన్టీయూకే వేదికగా అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో క్రీడాసదుపాయాలు కల్పిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యతనిస్తుందన్నారు. కాకినాడ జగన్నాధపురంలో రూ.9.84 కోట్లతో క్రీడావికాస కేంద్రం ఏర్పాటుకు ఆమోదం లభించిందన్నారు. జిల్లాలో 1.81 కోట్లతో లింగంపర్తి, 1.07 కోట్లతో పెద్దాపురం, రూ.76,80 లక్షలతో పిఠాపురం, రూ.71.50 లక్షలతో జగ్గంపేట ప్రాంతాల్లో కేవీకేల నిర్మాణాలకు ఉత్తర్వులు జారీ చేశామని తెలిపారు. కాకినాడ వేదికగా 16ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో క్రీడాసదుపాయాల కల్పనకు కృషి జరుగుతోందని తెలిపారు. కేంద్రం సహకారంతో కాకినాడలో స్పోర్ట్స్ ఎక్సలెన్స్ సెంటర్ ఏర్పాటు చేయనున్నామని అన్నారు. జేఎన్టీయూకేలో సింథటిక్ ట్రాక్ ను త్వరలోనే వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. దేశంలోనే అత్యుత్తమంగా ఏపీ స్పోర్ట్స్ పాలసీని రూపొందించి అమలు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి ఖేలో ఇండియా ద్వారా రూ.74కోట్లు కేంద్రం మంజూరు చేసిందన్నారు.వైసీపీ హయాంలో క్రీడలకు గ్రహణం పట్టిందని,కేవీకేలు, అకాడమీలను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని విమర్శించారు. పతకాలు సాధించిన క్రీడా కారుల ప్రోత్సాహకాలను సైతం నిలిపేసిన ఘనత వైసీపీది అన్నారు. కాకినాడ, విశాఖ, తిరుపతిలో అకాడమీల స్థాపనకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. క్రీడాకోటా కింద ప్రభుత్వ ఉద్యోగాల్లో 3శాతం రిజర్వేషన్లను అమలు చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదన్నారు. క్రీడాకారులకు ఉద్యోగ భద్రత, క్రీడాప్రోత్సాహకాలు, క్రీడా సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. నకిలీ సర్టిఫికెట్ల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు.జగన్ పెట్టిన రూ.16 కోట్ల క్రీడాప్రోత్సాహకాల బకాయిలను కూటమి ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు. ఏపీ క్రీడాకారులను అంతర్జాతీయ క్రీడాకారులుగా తయారు చేయడమే సీఎం చంద్రబాబునాయుడు లక్ష్యమన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షులు జ్యోతుల నవీన్, డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, శాప్ డైరెక్టర్లు కొవ్వాసు జగదీశ్వరి, పేరం రవీంద్రనాథ్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి వి.సతీష్ కుమార్, పలువురు కోచ్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# సోలార్ విద్యుత్తును ప్రోత్సహించేందుకు కేంద్రం చర్యలు

## దేశంలో 55 సోలార్ పార్కులకు అనుమతులు
## ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** దేశంలో రోజురోజుకీ పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు ప్రత్యామ్నాయంగా సోలార్ విద్యుత్తును ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి శ్రీపాద్ యశో నాయక్ వెల్లడించారు. సోలార్ విద్యుత్ ప్రోత్సహించేందుకు కేంద్రం తీసుకుంటున్న చర్యలపై బుధవారం కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ అడిగిన ప్రశ్నకు బదులుగా కేంద్రమంత్రి వివరాలు వెల్లడించారు. సోలార్ పార్కులు మరియు అల్ట్రా మెగా పవర్ ప్రాజెక్టుల అభివృద్ధి పథకం కింద దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు ఇప్పటివరకు 55 సోలార్ పార్కులు మంజూరు ద్వారా 39, 973 మెగా వాట్ల విద్యుత్ మంజూరు చేయగా, ఇందులో 16,121 మెగావాట్ల విద్యుత్తు కమిషన్ చేయబడి, 8,176 మెగావాట్ల సోలార్ విద్యుత్తు ఉత్పత్తి జరిగిందని తెలిపారు. సోలార్ విద్యుత్తును ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు ఆర్థిక సహాయం అందజేస్తుందని, ఇందులో భాగంగా గత ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్ కు 105.5 కోట్లు మంజూరు చేయడంతో పాటు 4,200 మెగావాట్ల సోలార్ సామర్థ్యాన్ని మంజూరు చేసినట్లు కేంద్ర మంత్రి తెలిపారు.

# ఏపీలో రోడ్డు భద్రత కోసం రూ.21,640 కోట్లు మంజూరు

## రాజ్యసభలో ఎంపీ సానా సతీష్ బాబు ప్రశ్నకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సమాధానం






**కాకినాడసిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రోడ్డు భద్రత, జాతీయ రహదారుల అభివృద్ధి మరియు ప్రమాదకర ప్రాంతాల నివారణ కోసం రూ.21,640 కోట్ల నిధులు మంజూరు చేసి ఖర్చు చేసినట్లు కేంద్ర రహదారి రవాణా మరియు రహదారుల శాఖ మంత్రి నితిన్ జైరామ్ గడ్కరీ వెల్లడించారు.ఈ విషయాన్ని రాజ్యసభలో ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ రహదారుల భద్రతపై ఎంపీ సానా సతీష్ బాబు అడిగిన ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానంగా కేంద్ర మంత్రి తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం, విజనరీ నాయకుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధికి కేంద్రంతో సమన్వయం పెంచుతూ గరిష్ట నిధులు సాధించగలిగామని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు.ప్రత్యేకంగా 2024-25, 2025-26 ఆర్థిక సంవత్సరాల్లో ఆంధ్రప్రదేశ్‌లో రహదారి భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తూ,ప్రమాదకర బ్లాక్ స్పాట్ల నివారణ జంక్షన్‌ల అభివృద్ధి, అండర్‌పాస్‌లు, ఓవర్‌పాస్‌ల నిర్మాణం,క్రాష్ బ్యారియర్లు ఏర్పాటు,సూచిక బోర్డులు, రహదారి సంకేతాల మెరుగుదల వంటి పనులు వేగంగా చేపట్టినట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రజల ప్రాణాలను కాపాడడమే ప్రధాన లక్ష్యంగా ఈ చర్యలు అమలవుతున్నాయని, ఇవి రాష్ట్రాన్ని భద్రతతో కూడిన అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లే కీలక అడుగులుగా నిలుస్తాయని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

# మెడికవర్ హాస్పిటల్స్ కాకినాడ వారి ఆధ్వర్యంలో క్యాన్సర్ అవగాహన ర్యాలీ




**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మెడికవర్ హాస్పిటల్స్, కాకినాడ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా క్యాన్సర్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ భానుగుడి జంక్షన్ నుండి బోటు క్లబ్ వరకు ఉత్సాహంగా కొనసాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్సీ కర్రి పద్మ శ్రీ మాట్లాడుతూ క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం అత్యంత అవసరమని అన్నారు. ప్రారంభ దశలో గుర్తిస్తే క్యాన్సర్‌ను పూర్తిగా నయం చేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ఆమె పేర్కొన్నారు. కాకినాడ మున్సిపల్ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవనశైలి, సమతుల్య ఆహారం, క్రమం తప్పని ఆరోగ్య పరీక్షలతో క్యాన్సర్‌ను నివారించవచ్చని తెలిపారు. ఇటువంటి అవగాహన కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగకరమని అన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ మెడికల్ ఆంకాలజిస్ట్ డా. మురళీధర్ గారు మాట్లాడుతూ, క్యాన్సర్‌కు సంబంధించిన లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ప్రముఖ సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ ప్రషోబ్ కుమార్ మాట్లాడుతూ ఆధునిక వైద్య సాంకేతికతతో క్యాన్సర్ శస్త్రచికిత్సలు సురక్షితంగా నిర్వహించవచ్చని తెలిపారు. ప్రముఖ రేడియేషన్ ఆంకాలజిస్టులు డాక్టర్ పృథ్వీ రాజ్, డాక్టర్ ప్రదీప్ భాస్కర్ మాట్లాడుతూ రేడియేషన్ థెరపీ ద్వారా అనేక రకాల క్యాన్సర్‌లకు సమర్థవంతమైన చికిత్స అందుబాటులో ఉందని వివరించారు. ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ శ్రావణి సాక్షి మాట్లాడుతూ మహిళల్లో సర్వైకల్, బ్రెస్ట్ క్యాన్సర్‌లపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని, క్రమం తప్పని స్క్రీనింగ్ పరీక్షలతో ప్రాణాలను కాపాడుకోవచ్చని తెలిపారు.విద్యార్థులు అందరూ హెచ్‌పివి వాక్సిన్ గురించి అవగాహన కలిగి ఉండాలని, ఇది గర్భాశయ క్యాన్సర్ వచ్చే ప్రమాదాన్ని 70-90% వరకు తగ్గిస్తుందని అలాగే ఇతర క్యాన్సర్ల నుంచి కూడా రక్షణ ఇస్తుందని తెలిపారు. ఈ ర్యాలీలో ఆదిత్య నర్సింగ్ కాలేజీ, ఆదిత్య ఉమెన్స్ కాలేజీ, పైడా ఫార్మసీ కాలేజీ, ప్రియా హోటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు, అలాగే మెడికవర్ హాస్పిటల్స్ కాకినాడ వైద్యులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని క్యాన్సర్ అవగాహన నినాదాలతో ప్రజలను చైతన్యవంతం చేశారు. ఈ సందర్భంగా మెడికవర్ హాస్పిటల్స్ రీజినల్ ఆపరేషన్స్ హెడ్ డాక్టర్ డి.వి.ఎ. ఆచార్య మాట్లాడుతూ మెడికవర్ హాస్పిటల్స్ కాకినాడలో అందుబాటులో ఉన్న సమగ్ర క్యాన్సర్ వైద్య సేవలు, ఆధునిక నిర్ధారణ పరికరాలు, అనుభవజ్ఞులైన వైద్య నిపుణుల ద్వారా రోగులకు ఉత్తమ చికిత్స అందిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా మెడికవర్ హాస్పిటల్స్, కాకినాడలో మొదటి 1000 మందికి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు పూర్తిగా ఉచితం అని ప్రకటించారు. ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# లారీ, బైకు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం కత్తిపూడి శివారు కత్తిపూడి - ప్రత్తిపాడు జాతీయ రహదారిలో లారీ పార్కింగ్ సమీపంలో బుధవారం రాత్రి మరో ప్రమాదం జరిగింది. ఈ రోడ్డు ప్రమాదంలో కత్తిపూడికి చెందిన ముగ్గురు యువకులకూ తీవ్ర గాయాలు అయ్యాయి. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. కత్తిపూడికి చెందిన కోన రామకృష్ణ, ఇసరపు దుర్గాప్రసాద్, ఇసరపు సూర్యవీరబాబు ఈ ముగ్గురూ కలిసి ఒకే ద్విచక్ర వాహనంపై ఓ శుభకార్యంలో పాల్గొనేందుకు ఉదయం కిర్లంపూడికి వెళ్ళి తిరిగి కత్తిపూడిలోని తమ ఇళ్ళకు తిగి వస్తూన్నారు. ఐదు నిమిషాల సమయంలో ఇంటికి చేరుకునేవారే. ఇంతలోనే ఊహించని రీతిలో ఈ రోడ్డు ప్రమాదం సంభవించింది. సరిగ్గా కత్తిపూడి శివారు లారీ పార్కింగ్ సమీపం లోనికి రాగానే అదే మార్గంలో వారికి ముందుగా ఓ లారీ తుని వైపు వెళుతున్నది. ఈ ముగ్గురి ద్విచక్ర వాహనం లారీని సమీపించగానే అనుకోని ప్రమాదం సంభవించింది. దీని ఫలితంగా బైక్ తో ముగ్గురు యువకులూ గాల్లో పల్టీలు కొట్టి పడ్డారు. వీరికి తీవ్ర గాయాలు అయ్యాయి. వీరి పూర్తి పరిస్థితి తెలియాల్సి ఉంది. ఈ క్షతగాత్రులు ముగ్గురిని ముందుగా ప్రత్తిపాడు ప్రభుత్వ ఆస్పత్రికి అన్నవరం పోలీసులు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ఆసుపత్రికి తరలించారు. అన్నవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### వేళంగి గ్రామదేవత సత్తెమ్మ తల్లిని

# దర్శించుకున్న యువ నాయకులు సందీప్



**కాకినాడ రూరల్ (కరప), విశ్వం వాయిస్ న్యూస్ :** కరప మండలం వేళంగి గ్రామంలో రెండేళ్లకు ఒకసారి గణేశుల, కుంచే వారి ఇలవేల్పు అయినా గ్రామదేవత సత్తెమ్మతల్లి జాతర మహోత్సవాలను ఆలయ కమిటీ వారు,వారి కుటుంబ సభ్యులు, భక్తులు అంగరంగ వైభవంగా గారడీలు, డప్పులు, తీన్మార్, బాణసంచా కాల్పులతో జరుపుతారు. గారెడి పోటీలను ఏర్పాటు చేసి విన్నర్ కు బహుమతులను ఇస్తారు.ఈ జాతర మహోత్సవము గ్రామంలో ఇప్పటికీ సుమారుగా 16వ జాతర మహోత్సవం. మంగళవారం కాకినాడ గ్రామీణ శాసనసభ్యులు పంతం నానాజీ గారి తనయుడు రూరల్ జనసేన యువ నాయకుడు పంతం సందీప్ ఆలయ కమిటీ మరియు గ్రామంలో ఉన్న జనసేన యువ నాయకులు గరగ జెమి, పార్టీ గ్రామ అధ్యక్షుడు పైడి కొండల ప్రసాద్, కూటమి నాయకుల ఆహ్వానం మేరకు వేళంగి గ్రామం విచ్చేసి కాపుల వీధిలో ఉన్న శ్రీ సత్తెమ్మ తల్లిని దర్శించుకున్నారు.. కమిటీ వారిని ఆలయ ప్రత్యేకతలు అడిగి తెలుసుకున్నారు. గణేశుల బాబురావు స్వామి మొదలుపెట్టిన శ్రీ సత్తెమ్మ తల్లి జాతర మహోత్సవమును ఆయన మరణాంతరం కుమారులు, కాపుల వీధిలో ఉన్న అమ్మవారి భక్తులు కలిసి చేస్తారని చెప్పారు,సందీప్ రాకపట్ల ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. ఆయన వెంట కరప మండల జనసేన పార్టీ అధ్యక్షులు బండారు మురళి, ఏఎంసీ చైర్మన్ జనసేన నాయకులు ముద్రగడ రమేష్, ఏఎంసి డైరెక్టర్ తెలుగుదేశం సీనియర్ నాయకులు మేడిశెట్టి పట్టాభి, పండు, యండమూరి సర్పంచ్ మారెళ్ళ శివ, భోగి రెడ్డి గంగాధర్ ,మోకన అశోక్ కుమార్, కంచి తేజ గణేష్ , వాసంశెట్టి సుబ్బారావు, యువత తదితరులు పాల్గొన్నారు.

### అంగరంగ వైభవంగా

# వేళంగి సత్తెమ్మ తల్లి జాతర



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కరప మండలం వేలంగి గ్రామంలో గ్రామ దేవత సత్తెమ్మ తల్లి జాతర ఘనంగా జరిగింది. గ్రామంలో ఉన్న భక్తులందరూ మరియు వివిధ ఊర్ల నుంచి జాతర చూడడం కొంతమంది గ్రామ ఆడపడుచులు పిల్లలతో భర్తలతో పాల్గొన్నారు. గారెడి విన్యాసాలు ఆకట్టుకున్నాయి. సత్తమ్మ తల్లిని కాపుల వీధి ఆడపడుచులు అంగరంగ వైభవంగా బాణసంచి కాల్చుకుంటూ డబ్బులు, విన్యాసాలతో గారడీలతో ఊరేగించారు. యువత కేరింతలతో మాస్ స్టెప్పులతో అలరించారు. మరల ఈ సందడిని చూడడం కోసం గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరు రెండేళ్లు ఎదురు చూడటం తప్పదు. ఆలయ కమిటీ వారు ఈ సంబరాన్ని దగ్గరుండి ఎటువంటి గొడవలు జరగకుండా బాధ్యతగా వ్యవహరించారు.

# జి.వేమవరం బీటీ రోడ్డు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు



**తాళ్ళరేవు, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండల పరిధిలోని జీ వేమవరం జాతీయ రహదారి నుంచి గొర్రెపూడి వరకు సుమారు 1.15 కోట్ల రూపాయల నిధులతో బీటీ రహదారి పనులు బుధవారం స్థానిక ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు శంకుస్థాపన చేసి ప్రారంభించారు. తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు ధూళిపూడి వెంకటరమణ అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కూటమి నాయకులు పాల్గొన్నారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY

తూర్పు గోదావరి జిల్లా ఎడిషన్

గురువారం, 05 ఫిబ్రవరి 2026
www.viswamvoice.com





# నగరాన్ని క్రీడా హబ్‌గా తీర్చిదిద్దాలనే ఆకాంక్ష..

**త్వరలో మల్టీపర్పస్ స్టేడియానికి శంకుస్థాపన - క్రీడాకారులకు ఎమ్మెల్యే వాసు తీపికబురు**
**రంజాన్ కప్ 2026 టోర్నమెంట్‌ను సందర్శించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్** : రాజమహేంద్రవరం నగరాన్ని క్రీడా హబ్ గా తీర్చిదిద్దాలనే ఆకాంక్ష.. నగరంలోని క్రీడాకారులకు, క్రీడాభిమానులకు రాజమహేంద్రవరం శాసన సభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్(వాసు) తీపి కబురు చెప్పారు. నగరంలోని క్రీడాకారులు ఎప్పటి నుండో ఎదురుచూస్తున్న మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు నెలరోజుల్లో ప్రారంభించబోతున్నామని ఎమ్మెల్యే వాసు వెల్లడించారు. రంజాన్ పండుగ సందర్భంగా దానవాయిపేట యూత్ ఆధ్వర్యంలో స్థానిక జాంపేట ఎంఆర్ గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్న రంజాన్ కప్-2026 సీజన4ను ఎమ్మెల్యే ఆదిరెడ్డి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎబిడి, దావా నియపేట యూత్ టీమ్‌లను పరిచయం చేసుకుని, టాస్ వేసి మ్యాచ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ ఖేలో ఇండియా పథకంలో భాగంగా స్థానిక వి.ఎల్ పురం లారీ స్టాండ్ ఆవరణలో సుమారు 14 కోట్ల రూపాయలో మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి త్వరలోనే శంకుస్థాపన చేస్తామని వివరించారు. పుష్కరాల నాటికి ఈ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను అందుబాటులోకి తీసుకుని రావాలనే కృతనిశ్చయంతో ఉన్నామన్నారు. క్రీడాకారులు అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నిర్వాహకులు సయ్యద్ అల్తాఫ్, ఇమ్రాన్ మాట్లాడుతూ ఈ రంజాన్ కప్‌కు అఫీషియల్ స్పాన్సర్‌గా ఆల్ సమీ గ్రూప్ ఎండి అబ్దుల్లా వ్యవహరిస్తున్నారని తెలిపారు. రోజుకి నాలుగు మ్యాచ్‌ల చొప్పున నిర్వహించి ఈనెల 10వ తేదీన ఫైనల్ ముగించి విజేతలకు బహుమతీ ప్రదానం చేస్తామన్నారు. మొదటి విన్నర్‌కు 25 వేలు, రెండో విన్నర్‌కు 15 వేలు, మూడో విన్నర్‌కు 5 వేలు నగదు బహుమతితో పాటు ట్రోఫీలు కూడా అందచేస్తామన్నారు. ఈ టోర్నీ నిర్వహణకు సహకరిస్తున్న అబ్దుల్లాకు కృతజ్ఞతలు తెలిపారు. ముస్లిం పెద్దలు ఖాన్ బాషా, మహబూబ్ జానీ, మహబూబ్ ఖాన్, రఫిక్ రాజా, సయ్యద్ అప్సరీ, నిర్వాహకులు పండు, ఎండి ఇమ్రాన్, గౌస్, చిష్టి తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ కమిటీల్లో ప్రాతినిధ్యం వహించాలి

**మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు**
**రూరల్ మండల అధ్యక్షుడు ఉప్పులూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో సమావేశం**




**రాజమహేంద్రవరం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్** : వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ సంస్థాగత కమిటీల నిర్మాణం కోసం వెంకటనగరం, తొర్రేడు, కాతేరు గ్రామాల నాయకులతో బుధవారం ఉదయం రాజమండ్రి రూరల్ మండల పార్టీ అధ్యక్షులు ఉప్పులూరి సత్యనారాయణ ఆధ్వర్యం లో సమావేశ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా మాజీ మంత్రి వైఎస్సార్సీపీ అధ్యక్షులు చెల్లుబోయిన వేణు, పార్లమెంట్ ఇంచార్జ్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్,రాష్ట్ర అధికార ప్రతినిధి యనమల నాగార్జున యాదవ్ పాల్గొన్నారు. చెల్లుబోయిన వేణు మాట్లాడుతూ పార్టీని క్రింది స్థాయి నుంచి బలోపేతం చేయడానికి వై.యస్ జగన్మోహన్ రెడ్డి క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసి పునాదుల నుంచి నిర్మాణాన్ని చేపట్టే విధంగా కార్యచరణ రూపకల్పన చెప్పట్టారని చర్యలు తీసుకున్నారని దానికి అనుగుణంగా మనందరం పార్టీని ప్రజలకు మరింత చెరువుగా తీసుకువెళ్లాలని ప్రతి గ్రామంలో మండలంలో ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరిని కమిటీల్లో ప్రాతినిధ్యం వహించే విధంగా భాగస్వామ్యం చేయాలని,అన్ని వర్గాల నుంచి ప్రతి ఒక్కరిని పార్టీ పదవుల్లో అవకాశం కల్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు నక్క రాజబాబు,గోందేశీ శ్రీనివాసరెడ్డి, గిరిజాలబాబు, నక్క నగేష్,చెల్లుబోయిన నరేన్,అంగాడ సత్యప్రియ, యెజ్జు శ్రీనివాస్ కిరణ్, పెయ్యాల రాజేష్,తొర్రేడు గ్రామ అధ్యక్షులు చిట్టూరి శ్రీనివాస్, ఉప్పులూరి రాము, పెనుమాక సునీల్, చోల్లంగి సత్యగిరి, ఆచంట మారుతి దేవి, చిట్టూరి వెంకట్రావు, దండమూడి అర్జునరావు, ఎరుబండి వెంకట్రావు, సోదదాసి రాహుల్ కుమార్, మెప్పెల్లి రాజు,మోత రమేష్, ఎరుబండి సాయి, కోల్లి వెంకటరత్నం,నక్కా దానరాజ్,రొంగల వెంకటేష్, మద్దా దుర్గారావు, లాయర్ శ్రీను, కొత్తపల్లి నాగేశ్వరావు, పాస్టర్ విజయ సారధి, పట్టా ఉత్తెజ్, ఉండ్రజవరపు సూర్య, దేవమాత, దిలీప్, చీకట్ల రంజిత్, వీణం దేవి,ఎండీ మున్నిసా తదితరులు పాల్గోన్నారు.

# కూటమి ప్రభుత్వంలో అరాచక పాలన కొనసాగుతోంది

**- ప్రవీణ్ పగడాల పోస్టు మార్టం రిపోర్ట్ బయట పెట్టాలి - ఆయన మృతదేహంపై చాలా గాయాలు**
**- హత్య జరిగి 11నెలలు అయినా నిర్ధారణ చేయని పోలీసులు - చంద్రబాబుకు సిగ్గుండాలి - కార్పొరేట్ కంపెనీలకు భూములు దారాదత్తం చేస్తున్న ప్రభుత్వాలు**
**- కూటమి ప్రభుత్వంలో అరాచక పాలన కొనసాగుతోంది - మాజీ ఎంపీ జీవి హర్ష కుమార్ విమర్శ**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్** : పాస్టర్ ప్రవీణ్ పగడాల హత్య జరిగింది 11నెలలు అయినా మృతి పై పోలీసులు ఇంకా నిర్ధారణ చేయలేదని,కూటమి ప్రభుత్వంలో అరాచక పాలన కొనసాగుతోంది అని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ పేర్కొన్నారు. బుధవారం రాజమహేంద్రవరం రాజీవ్ గాంధీ డిగ్రీ కాలేజీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ పగడాల హత్య జరిగితే దానిని పోలీసులు రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు ఎందుకు ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పలు సభలలో తాగుబోతు పాస్టర్ హైదరాబాదు నుంచి తాగుతూ వచ్చి రాజమండ్రిలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు వ్యాఖ్యలు చేశారని తప్పుపట్టారు. కొంతమంది మతోన్మాదులు రెచ్చగొట్టడానికి ప్రయత్నం చేస్తున్నట్లు ఆరోపణ చేశారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సిగ్గు ఉందా అని ప్రశ్నించారు. 2025 మార్చి 24వ తేదీన ప్రవీణ్ పగడాల మృతి చెందితే ఏప్రిల్ లో తాను ప్రజల సహకారంతో రూ5 లక్షల ఖర్చు పెట్టి పబ్లిక్ హియరింగ్ పిటిషన్ వేశానని అన్నారు. ఈ కేసు పై కౌంటర్ ఫైల్ దాఖలు చేయమని కోర్టు అక్టోబర్ లో తీర్పు ఇచ్చిందని అయితే సంతకాలు కాని కారణంగా పిటీషన్ వేయలేదని పోలీసులు చెప్పారని అన్నారు. ప్రస్తుతం ఫిబ్రవరి నెల వచ్చినప్పటికీ కౌంటర్ ఎందుకు దాఖలు చేయలేదని ప్రశ్నించారు. క్లోజ్డ్ రిపోర్టు కోర్టుకు ఎందుకు సమర్పించలేదని ప్రశ్నించారు.పోస్టుమార్టం రిపోర్ట్ లో ప్రవీణ్ పగడాల మృతదేహంపై చాలా గాయాలు ఉన్నాయని, ఆయనను హింసించి చంపారని పేర్కొన్నారు. పోస్టుమార్టం రిపోర్ట్ బయట పెడితే హత్య అని తెలుస్తుందని అన్నారు. ఈ హత్య వెనుక ఉన్న హంతకులను ఎందుకు దాస్తున్నారని ప్రశ్నించారు. పోలీస్ అసోసియేషన్ ఒకటి ఉందని ప్రతిపక్ష నాయకులు పోలీసులను విమర్శిస్తే ఆ అసోసియేషన్ బయటికి వచ్చి రాద్ధాంతం చేస్తారని అయితే పరకామణి కేసులో సిఐ ట్రైన్ నుంచి తోసివేసి చంపారని ఆరోపించారు.ఈ సంఘటనపై పోలీస్ అసోసియేషన్ ఖండించలేదని అన్నారు. పరకామణి కేసులో అప్పుటి ఎస్పీ, ప్రస్తుత తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్ ఉన్నారని తెలిపారు. పాస్టర్ ప్రవీణ్ పగడాల హత్య ఎలాగైతే జరిగిందో సిఐ హత్య కూడా అలాగే జరిగిందని వివరించారు. రాష్ట్రంలో హత్యలు జరుగుతున్నప్పటికీ ప్రతిపక్ష నాయకులు ఖండించరని అన్నారు.ప్రభుత్వం ఇప్పుడు కల్తీ లడ్డు వ్యవహారం పదే పదే ప్రస్తావించడం తోపాటు, భూములను కార్పొరేట్ సంస్థలకు తక్కువ రేట్లకు దారా దత్తతం చేస్తున్నారని అన్నారు. గీతం యూనివర్సిటీ కి 55 ఎకరాల భూమిని ధారాతత్వం చేశారని అన్నారు. కాకినాడ సీ పోర్ట్ లో ఇసుకను అక్రమంగా డ్రెజ్జింగ్ చేస్తున్నారని ఆరోపించారు. సముద్రంలో ఇసుకను డ్రెజ్జింగ్ చేయడం వల్ల పర్యావరణానికి పెను ముప్పు పొంచి ఉందని అన్నారు. సముద్రంలో డ్రెజ్జింగ్ చేయడం వల్ల లైట్ హౌస్ నేలలో పడిపోయిందని తెలిపారు. ప్రస్తుతం సిపోర్టు కె.వి.రామారావు వద్ద ఉందా..? లోకేష్ వద్ద ఉందా అని ప్రశ్నించారు..?. రాష్ట్రానికి పరిశ్రమలు రావు, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ చెల్లించారు. హాస్పిటల్స్ ఆరోగ్యశ్రీ బిల్లులు చెల్లించడం లేదని అన్నారు. 2014 నుంచి 2026 వరకు ఈ ప్రభుత్వంలో అరాచక పాలన సాగిస్తున్నారని అన్నారు. రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఒకరినొకరు కొట్టుకోవడం, కులాల మధ్య చిచ్చు పెట్టడం, ప్రభుత్వ భూములను దోచుకోవడం ఆనవాయితీగా మారిందని విమర్శించారు. ప్రజలు ప్రభుత్వం విధానాన్ని గమనిస్తున్నారని వారే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

# ఎస్సీ ఋణాలపై వడ్డీ మాఫీకి అవగాహన సదస్సు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్** : రాజమండ్రి రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం ఎస్.సి. ఋణాల లబ్ధిదారులతో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఎస్.సి. కార్పొరేషన్, తూర్పు గోదావరి జిల్లా జె. సత్యవతి వారి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఏఈఓ కె. నందీష్,ఎంపీడీవో ఆర్మ్ స్ట్రాంగ్,మాల కార్పొరేషన్ డైరెక్టర్ మద్ద మణి, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ వేమగిరి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ద్వారా ఎస్.సి. కార్పొరేషన్ నుంచి 2017-18 సంవత్సరం నుండి డిసెంబర్ 2025 వరకు ఋణాలు పొందిన లబ్ధిదారులకు సంబంధించి మొత్తం వడ్డీ మాఫీపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వివరించారు. ప్రభుత్వ విధి విధానాలు, అర్హత ప్రమాణాలు, గడువు తేదీల గురించి లబ్ధిదారులకు స్పష్టంగా అవగాహన కల్పించడమైనది. ఈ వడ్డీ మాఫీ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సామాజిక సంక్షేమ శాఖ (ఎస్ సి పి) ద్వారా జారీ చేసిన జీవో ఆర్టీ నెంబర్ 319, తేది: 31-12-2025 ప్రకారం, 2015-16 నుండి 2018-19 సంవత్సరాల మధ్య ఎన్ ఎస్ కె ఎఫ్ డి సి స్వయం ఉపాధి పథకాల కింద ఎస్.సి. కార్పొరేషన్ ద్వారా ఋణాలు పొందిన నిరుపేద ఎస్.సి. లబ్ధిదారులకు రూ.2,17,71,569/- మేర వడ్డీ మొత్తాన్ని మాఫీ చేయుటకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. లబ్ధిదారులు తమ అసలు మొత్తాన్ని 30-04-2026 లోపు చెల్లించిన పక్షంలో ఈ వడ్డీ మాఫీ వర్తిస్తుందని ఆమె వివరించారు. ఈ సదుపాయం ద్వారా జిల్లాలోని 137 మంది చీూఖీణజ లబ్ధిదారులు అసలు మొత్తాన్ని గడువులోపు చెల్లిస్తే రూ. 1,49,08,659/- వడ్డీ మాఫీ పొందవచ్చునని, అలాగే ఎన్ ఎస్ కె ఎఫ్ డి సి పథకానికి చెందిన 68 మంది లబ్ధిదారులు రూ. 68,62,910/- వడ్డీ మాఫీ పొందే అవకాశం ఉందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని ఎస్.సి. లబ్ధిదారులందరూ పూర్తిగా వినియోగించుకోవాలని కార్యనిర్వాహక సంచాలకులు జె. సత్యవతి కోరారు.

# జాతీయ అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో కళ్లజోళ్లు పంపిణీ




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్** : ప్రభుత్వ వైద్య ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఇటీవల స్థానిక ఎస్కెవిటీ ఇంగ్లీషు మీడియం పాఠశాలలోని విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించగా వారిలో అవసరమైన వారికి జాతీయ అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఈ రోజు కళ్ల జోళ్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ముఖ్య అతిధిగా హాజరై విద్యార్థులకు కళ్ల జోళ్లు పంపిణీ చేసి కళ్ల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు,పాఠశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో డా.ముస్తఫా, ఆర్యాపురం బ్యాంకు డైరెక్టర్ బుడ్డగ రవి,బీజేపీ నాయకులు ఎనుమల రంగబాబు, ఎస్కెవిటీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్రహ్మణ్యం,ప్రభుత్వ వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ,డాక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అందరి మంచి కోరుకునే మంచి మనిషి మజ్జి రాంబాబు

**ఘనంగా మజ్జి రాంబాబు పుట్టిన రోజు వేడుకలు - శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి, ఎమ్మెల్సీ సోము, రుడా ఛైర్మన్ బొడ్డు, ప్రముఖులు హాజరు**
**300 మంది మహిళలకు చీరలు పంపిణీ... - పలు సేవా కార్యక్రమాలు నిర్వహణ**





**రాజమహేంద్రవరం, నేటి వార్త** : నిస్వార్ధంతో సేవ చేసి అందరి మంచి కోరుకునే మంచి మనిషి మజ్జి రాంబాబు అని పలువురు కొనియాడారు. ఇటువంటి వారిని ఆదర్శంగా తీసుకుని సమాజ సేవ చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. తెలుగదేశం పార్టీ నగర అధ్యక్షులు మజ్జి రాంబాబు పుట్టినరోజు వేడుకలు స్థానిక కొత్తపేటలోని రౌతు తాతాలు కల్యాణ మండపంలో పండుగ వాతావరణంలో జరిగాయి. ఈ కార్యక్రమానికి రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ముఖ్య అతిధిగా హాజరై మజ్జి రాంబాబుకు పుట్టిన రోజు శుకాంక్షాలు తెలిసి ఆయనతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం 300 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అలాగే అమ్మ సేవా సమితి వారికి ఒక వీల్ స్ట్రెచ్చర్, ఒక చిరు వ్యాపారికి తోపుడు బండిని ఎమ్మెల్సీ సోము వీర్రాజు, జిల్లా టీడీపీ అధ్యక్షులు, రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి, ప్రధాన కార్యదర్శి కాశీ నవీన్ కుమార్ తదితరులతో కలిసి అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజ సేవ చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పుట్టిన రోజు సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించిన మజ్జి రాంబాబును అభినందించారు. కాగా తన పుట్టిన రోజు సందర్భంగా తనకు శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చిన అందరికీ మజ్జి రాంబాబు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి ఏటా తన పుట్టిన రోజు సందర్భంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీ అని. భవిష్యత్తులో కూడా ఇలానే ఎక్కువ స్థాయిలో నిర్వహిస్తామన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, ఆర్యాపురం బ్యాంకు చైర్మన్ చల్లా శంకరరావు, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి యర్రా వేణు గోపాల రాయుడు తదితర ప్రముఖులు మజ్జి రాంబాబుకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే నగరంలోని 42 డివిజన్ల నుంచి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు, కూటమి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

**ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా**

# మండలంలో క్యాన్సర్ అవగాహన కార్యక్రమాలు



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్** : సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి ఇ.యేసురాణి ఆధ్వర్యంలో సీతానగరం మండలంలోని అన్ని గ్రామాలలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బదితో క్యాన్సర్ వ్యాధి గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. వెదుళ్లపల్లి గ్రామంలో గల జిల్లా పరిషత్ హై స్కూల్ నందు డాక్టర్ ఇ. యేసు రాణి ఈ కార్యక్రమం ప్రారంభించినారు. ఈ సందర్భంగా యేసు రాణి గారు మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవన శైలి, పౌష్టికాహారం తీసుకోవడం మరియు వ్యాధి లక్షణాలను ముందుగా గుర్తించడం వలన ఈ వ్యాధిని అరికట్టవచ్చని 18 సంవత్సరములు దాటిన ప్రతివారు తప్పనిసరిగా క్యాన్సర్ స్క్రీనింగ్ వైద్య ఆరోగ్య సిబ్బందితో ఉచితంగా చేయించుకోవచ్చని చెప్పినారు. ప్రిన్సిపాల్ ఎన్.వి. వి.సత్యనారాయణ మాట్లాడుతూ ధూమపానం, మద్యపానం క్యాన్సర్ కారకారకాలని అందరూ వాటికి దూరంగా ఉండాలని చెప్పినారు. తదనంతరం విద్యార్థులతో ముందస్తు పరీక్ష- క్యాన్సర్ నుంచి రక్ష, క్యాన్సర్ పై విజయం- స్క్రీనింగు తో సాధ్యం అనే నినాదాలు చేస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎన్. వి.వి.సత్యనారాయణ,ఎంపీ హెచ్ ఈ ఓ వై.యస్.రాయుడు, పి హెచ్ ఎన్ జి.దైవకృప, ఎం ఎల్. కె.కావేరి, హెల్త్ అసిస్టెంట్ ఎస్.నగేష్ బాబు, ఎ ఎన్ ఎం సి.హెచ్.శాంతి, ఆశా కార్యకర్తలు ఎం. వరలక్ష్మి ,సి.హెచ్. వెంకటలక్ష్మి హైస్కూలు టీచర్స్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# రోజు రోజుకి పెరిగిపోతున్న చోటామోటా సెల్ ఫోన్ రిపేర్ టెక్నీషియన్స్....

**ఆదమరిస్తే జేబులకి చిల్లులే...**



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్** : మండపేట పట్టణ పరిధిలో అరకొరగా మిడిమిడి జ్ఞానంతో సెల్ ఫోన్లు రిపేరు చేసే టెక్నీషియన్స్ తుట్టేడు పొట్టలో తట్టెడు పాలు అన్నట్టు పెరిగిపోయారు. నేటి యుగంలో మనం ఏ సేవ పొందాలన్నా అది ఒక సెల్ ఫోన్ తో ముడిపడి ఉండడంతో ప్రతి ఒక్కరి అరచేతిలో సెల్ ఫోన్ సర్వసాధారణమై జీవితంలో ఒక భాగం అయిపోయింది. పేద మధ్యతరగతి వారైతే వారి ఆర్థిక స్తోమత మేరకు, స్తోమతకు మించి కొనుగోలు చేస్తున్నారు అయితే ఇక్కడ సెల్ ఫోన్ రిపేర్ వస్తే ఈ అరకురా నేర్చుకున్న వారి దగ్గర ఇస్తే అరకొరగా రిపేరులు చేస్తూ పేద మధ్యతరగతి వారి జేబులకు చిల్లులు వేస్తున్నారు, ఇదేమిటి అని ప్రశ్నిస్తే మేమింతే నచ్చితే చేయించుకో అని దబాయిస్తున్నారు. ఈ అరాకొరా టెక్నీషియన్స్ వల్ల పూర్తిస్థాయి టెక్నీషియన్ గా ధ్రువపత్రం పొందిన వారికి తీరని మచ్చగా మిగులుతుంది. మండపేట పరిసర ప్రాంతాల నిరుద్యోగ యువతకు స్వచ్ఛందంగా న్యూ లైఫ్ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సోసైటీ ఆధ్వర్యంలో ఉచితంగా నైపుణ్యం కలిగినటువంటి మొబైల్ టెక్నీషియన్స్ తో నైపుణ్య తరగతులు ఏర్పాటుచేసిన దాఖలాలు గతంలో ఉండేవి ఇప్పుడు అలాంటివి ఏమీ లేకపోవడంతో చోటా మోట పరిజ్ఞానంతో సెల్ ఫోన్ సర్వీస్ టెక్నీషియన్స్‌గా చాలామని అవుతూ సెల్ ఫోన్స్ వినియోగదారులు ఒక సమస్యతో వెళితే కొత్త సమస్యను సృష్టిస్తున్నారు. వారు అందరూ కూడా రాజమండ్రి వెళ్లిపోవడానికి సగం కారణం ఈ అర్థ టెక్నీషియన్స్ వల్లే అని పలువురు ముక్తకంఠంతో చెబుతున్నారు. మండపేట పరిధిలో మొబైల్ టెక్నీషియన్ యూనియన్ వారు టెక్నీషియన్ ముసుగులో చలామణి అవుతున్న వారిపై తగు చర్యలు తీసుకుని మండపేటలో ప్రజల విశ్వాసాన్ని పెంపొందించేలా పనితీరును మెరుగుపరుచుకోవాలని సెల్ ఫోన్ వినియోగదారుల ఆకాంక్ష.

# మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన ఎత్తివేత..

## కొత్త ముఖ్యమంత్రిగా మాజీ తైక్వాండో ఆటగాడు..!



దాదాపు ఏడాది తర్వాత మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన ఎత్తివేశారు. ఫిబ్రవరి 13, 2025 నుండి మణిపూర్ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన అమలులో ఉంది. రాష్ట్రపతి పాలన విధించిన తర్వాత, 60 మంది సభ్యుల శాసనసభను తాత్కాలికంగా నిలిపివేశారు. అసెంబ్లీ పదవీకాలం 2027లో ముగుస్తుంది. ఈ నేపథ్యంలోనే కొత్తగా నియమితులైన బీజేపీ శాసనసభా పక్ష నాయకుడు యుమ్నామ్ ఖేమ్‌చంద్ సింగ్ ఎన్డీయే బృందంతో కలిసి రాష్ట్ర గవర్నర్ అజయ్ కుమార్ భల్లాతో సమావేశమయ్యారు. ఎన్డీయే ఆధ్వర్యంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేకుందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. గవర్నర్ అజయ్ కుమార్ భల్లాకు ఎన్డీయే తీర్మాన కాపీని అందజేశారు. మంగళవారం (ఫిబ్రవరి 3, 2026) బిజెపికి చెందిన 37 మంది ఎమ్మెల్యేలలో 35 మంది శాసనసభ్యులు, పార్టీ కేంద్ర పరిశీలకుడు తరుణ్ చుగ్, ఈశాన్య ఇన్‌ఛార్జ్ సంబిత్ పాత్రా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు ఎ.శారదా దేవి సమక్షంలో వై.ఖేమ్‌చంద్ సింగ్ శాసనసభా పార్టీ నాయకుడిగా ఎన్నికయ్యారు. ఖేమ్‌చంద్ సింగ్ బుధవారం ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉంది. ఇద్దరు ఉప ముఖ్యమంత్రులు కూడా ఉండనున్నట్లు తెలుస్తోంది. మణిపూర్‌లో ప్రస్తుతం బీజేపీకి 37 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో 32 మంది బీజేపీ అభ్యర్థులు గెలిచారు. జేడీయూ ఆరు సీట్లు గెలుచుకుంది. వారిలో ఐదుగురు సభ్యులు తరువాత బీజేపీలో చేరారు. మిగిలిన ఎమ్మెల్యేలు నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పీపీ) నుండి ఆరుగురు, నాగా పీపుల్స్ ఫ్రంట్ (ఎన్‌పీఎఫ్) నుండి ఐదుగురు, కాంగ్రెస్ నుండి ఐదుగురు, కుకి పీపుల్స్ అలయన్స్ నుండి ఇద్దరు, జేడీయూ నుండి ఒకరు, ముగ్గురు స్వతంత్ర శాసనసభ్యులు ఉన్నారు. గత కొన్ని నెలలుగా, బీజేపీ కేంద్ర నాయకత్వం దాని మెయిటీ, కుకి ఎమ్మెల్యేలు, మిత్రపక్షాలు NPF , NPP సహా కొంతమంది స్వతంత్ర ఎమ్మెల్యేలతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చారు. దీంతో రాజకీయ పరిస్థితి అనుకూలంగా ఉందో లేదో అంచనా వేయడానికి అనేక రౌండ్ల సమావేశాలు నిర్వహించారు. ఫిబ్రవరి 9, 2025న ముఖ్యమంత్రి పదవికి ఎన్. బిరెన్ సింగ్ రాజీనామా చేసిన తర్వాత రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించారు. మెయిటీ - కుకి వర్గాల మధ్య నెలల తరబడి జాతి హింస మధ్య ఆయన రాజీనామా చేయాల్సి వచ్చింది. మాజీ తైక్వాండో అథ్లెట్ అయిన ఖేమ్‌చంద్ సింగ్ 2017 - 2022లో సింగ్జమేయ్ అసెంబ్లీ నియోజకవర్గం నుండి బీజేపీ అభ్యర్థిగా మణిపూర్ శాసనసభకు ఎన్నికయ్యారు. గతంలో ఆయన 2017 నుండి 2022 వరకు మణిపూర్ శాసనసభ స్పీకర్‌గా కూడా పనిచేశారు. 2022లో బిరేన్ సింగ్ రెండవ ప్రభుత్వంలో ఆయన కేబినెట్ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు.

## లోక్‌సభలో నిలిచిపోయిన

# ప్రధాని మోదీ ప్రసంగం..

### సభా కార్యక్రమాలు రేపటికి వాయిదా..!



పార్లమెంటు బడ్జెట్ సమావేశంలో అధికార పక్షం, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. చైనా చొరబాట్లు, ఎం.ఎం. నరవాణే పుస్తకంపై రాహుల్ గాంధీ ప్రభుత్వంపై దాడి చేస్తుండగా, బీజేపీ ప్రతీదాడికి దిగింది. ఈ గందరగోళం కారణంగా, సాయంత్రం 5 గంటలకు జరగాల్సిన ప్రధాని మోదీ ప్రసంగం వాయిదా వేస్తూ స్పీకర్ నిర్ణయం తీసుకున్నారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశంలో అధికార పక్షం, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఇరువర్గాలు ఒకరిపై ఒకరు దాడి చేసుకుంటున్నాయి. మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవాణే రాసిన పుస్తకంపై వివాదం చెలరేగింది. చైనా చొరబాట్లను ఆరోపిస్తూ రాహుల్ గాంధీ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టడానికి దీనిని ఉపయోగిస్తున్నారు. దీనికి ప్రతిస్పందనగా, బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే కూడా సభలోకి ఒక పుస్తకాన్ని తీసుకువచ్చారు. వివాదానికి మరింత అజ్యం పోసినట్లు అయ్యింది. వీటన్నిటి మధ్య, సాయంత్రం 5 గంటలకు జరగాల్సిన ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగం వాయిదా చేశారు. రోజంతా జరిగిన గందరగోళం నేపథ్యంలో, సభ రేపటికి వాయిదా వేస్తున్నట్లు లోక్‌సభ స్పీకర్ ప్రకటించారు. అంతకుముందు, కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంట్ హౌస్‌లో ప్రధాని మోదీని కలిశారు. లోక్‌సభలో ప్రధాని ప్రసంగానికి ముందు ఈ సమావేశం జరిగింది. అమిత్ షా కూడా స్పీకర్ ఓం బిర్లాతో సమావేశం నిర్వహించారు. నిషికాంత్ దూబే సైతం స్పీకర్ తో జరిగిన సమావేశానికి హాజరయ్యారు. అయినా కూడా సభలో రోజంతా గందరగోళం నెలకొంది. దీంతో సభ రేపటికి వాయిదా పడింది. అంతకుముందు బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే లోక్‌సభలో ప్రకటన గందరగోళానికి కారణమైంది. గాంధీ కుటుంబం గురించి రాసిన పుస్తకాలను ఆయన ప్రస్తావించారు. వాటిలో అభ్యంతరకరమైన అంశాలు ఉన్నాయి. దూబే ప్రకటన లోక్ సభలో గందరగోళానికి దారితీసింది. సభా కార్యకలాపాలు వాయిదాకు అంతరాయం ఏర్పడింది. దీని తరువాత, ప్రతిపక్ష పార్టీల ఎంపీలు స్పీకర్ ఛాంబర్‌లోకి దూసుకెళ్లారు. రాహుల్ గాంధీ ఒక పుస్తకంపై మాట్లాడటానికి అనుమతించినప్పుడు బీజేపీ ఎంపీని ఎందుకు మాట్లాడటానికి అనుమతించారని ప్రశ్నించారు. స్పీకర్ ఓం బిర్లా కార్యాలయంలో కాంగ్రెస్, ప్రతిపక్ష ఎంపీలు గందరగోళం సృష్టించారు. ఇంతలో, రాహుల్ గాంధీ కూడా ప్రభుత్వంపై దాడి చేశారు. పుస్తకాలపై జరుగుతున్న ఈ చర్చలో, రాహుల్ గాంధీ, "ప్రధాని ఈ రోజు సభలో ఉంటారని అనిపించడం లేదు. ఆయన పార్లమెంటుకు వస్తే, నేను ఆయనకు ఆ పుస్తకాన్ని ఇస్తాను" అని అన్నారు. కాగా, రాహుల్ గాంధీ నరవణే పుస్తకంతో పార్లమెంటుకు వచ్చారు.

# మరీ ఇలా తయార్రేంట్రా..

## ఆన్‌లైన్ డెలివరీ యాప్‌ను దేనికి ఉపయోగించారో తెలుసా..?



ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర రాజధాని లక్నోను నవాబుల నగరం అని పిలవడంలో ఏమాత్రం సందేహం లేదు. ఎందుకంటే ఇక్కడి సంస్కృతి, జీవన శైలి ఇప్పటికీ ఒక ప్రత్యేకమైన చక్కదనాన్ని ప్రతిబింబిస్తాయి. అయితే, ఇటీవలి వీడియో ఈ నవాబీ సంస్కృతికి సంబంధించిన వింత, దిగ్భ్రాంతికరమైన ఘటన ఒకటి వెలుగులోకి వచ్చింది. ఈ సంఘటన సోషల్ మీడియాలో చర్చకు దారితీయడమే కాకుండా, సౌలభ్యం పేరుతో మనం ఎంతవరకు బాధ్యతారహితంగా ఉండగలమో ఆలోచింపజేస్తుంది. ఈ ఘటన పోర్టర్ అనే ఆన్‌లైన్ డెలివరీ యాప్ ద్వారా జరిగింది. ఇది సాధారణంగా ఒక ప్రదేశం నుండి మరొక ప్రదేశానికి వస్తువులు లేదా పార్శిల్‌లను పంపడానికి ఉపయోగిస్తారు. ఒక మహిళా కస్టమర్ పోర్టర్ అనే ఆన్‌లైన్ డెలివరీ యాప్ ద్వారా పార్శిల్ బుక్ చేసుకుంది. అంతా సాధారణంగానే అనిపించింది. రైడర్ సమయానికి వచ్చాడు, ఆ మహిళ పార్శిల్‌ను అతనికి ఇచ్చి, ఆన్‌లైన్‌లో చెల్లింపు జరిగిందని నిర్ధారించుకున్నారు. ప్రతిరోజూ వేలాది డెలివరీల మాదిరిగానే ప్రతిదీ సజావుగా జరుగుతుందనిపిస్తుంది. కానీ రైడర్ పార్శిల్ తీసుకున్నప్పుడు కథ మలుపు తిరుగుతుంది. నిర్జన ప్రాంతానికి చేరుకున్న తర్వాత, పార్శిల్ తీసుకునేందుకు అతనికి ఎవరు కనిపించలేదు. అతను కస్టమర్‌కు ఫోన్ చేసి, సాధారణ విధానం ప్రకారం, పార్శిల్‌ను ఎవరికి, ఎక్కడ డెలివరీ చేయాలో అడిగాడు. కస్టమర్ చిరునామా లేదా పేరు ఇవ్వాలని అతను అడిగాడు. కానీ అతనికి లభించే స్పందన దిగ్భ్రాంతికరంగా ఉంది. ఆ మహిళ చాలా సాధారణ స్వరంలో, "సోదరా, నువ్వు దాన్ని ఎవరికీ ఇవ్వాల్సిన అవసరం లేదు, దాన్ని పారవేయి" అని చెప్పింది. దీంతో డెలివరీ బాయ్ షాక్ అయ్యాడు. ఒక మహిళా కస్టమర్ పోర్టర్ అనే ఆన్‌లైన్ డెలివరీ యాప్ ద్వారా పార్శిల్ బుక్ చేసుకుంది. అంతా సాధారణంగానే అనిపించింది. రైడర్ సమయానికి వచ్చాడు, ఆ మహిళ పార్శిల్‌ను అతనికి ఇచ్చి, ఆన్‌లైన్‌లో చెల్లింపు జరిగిందని నిర్ధారించుకున్నారు. ప్రతిరోజూ వేలాది డెలివరీల మాదిరిగానే ప్రతిదీ సజావుగా జరుగుతుందనిపిస్తుంది. కానీ రైడర్ పార్శిల్ తీసుకున్నప్పుడు కథ మలుపు తిరుగుతుంది. నిర్జన ప్రాంతానికి చేరుకున్న తర్వాత, పార్శిల్ తీసుకునేందుకు అతనికి ఎవరు కనిపించలేదు. అతను కస్టమర్‌కు ఫోన్ చేసి, సాధారణ విధానం ప్రకారం, పార్శిల్‌ను ఎవరికి, ఎక్కడ డెలివరీ చేయాలో అడిగాడు. కస్టమర్ చిరునామా లేదా పేరు ఇవ్వాలని అతను అడిగాడు. కానీ అతనికి లభించే స్పందన దిగ్భ్రాంతికరంగా ఉంది. ఆ మహిళ చాలా సాధారణ స్వరంలో, "సోదరా, నువ్వు దాన్ని ఎవరికీ ఇవ్వాల్సిన అవసరం లేదు, దాన్ని పారవేయి" అని చెప్పింది. దీంతో డెలివరీ బాయ్ షాక్ అయ్యాడు. ఒక మహిళా కస్టమర్ పోర్టర్ అనే ఆన్‌లైన్ డెలివరీ యాప్ ద్వారా పార్శిల్ బుక్ చేసుకుంది. అంతా సాధారణంగానే అనిపించింది. రైడర్ సమయానికి వచ్చాడు, ఆ మహిళ పార్శిల్‌ను అతనికి ఇచ్చి, ఆన్‌లైన్‌లో చెల్లింపు జరిగిందని నిర్ధారించుకున్నారు. ప్రతిరోజూ వేలాది డెలివరీల మాదిరిగానే ప్రతిదీ సజావుగా జరుగుతుందనిపిస్తుంది. కానీ రైడర్ పార్శిల్ తీసుకున్నప్పుడు కథ మలుపు తిరుగుతుంది. నిర్జన ప్రాంతానికి చేరుకున్న తర్వాత, పార్శిల్ తీసుకునేందుకు అతనికి ఎవరు కనిపించలేదు. అతను కస్టమర్‌కు ఫోన్ చేసి, సాధారణ విధానం ప్రకారం, పార్శిల్‌ను ఎవరికి, ఎక్కడ డెలివరీ చేయాలో అడిగాడు. కస్టమర్ చిరునామా లేదా పేరు ఇవ్వాలని అతను అడిగాడు. కానీ అతనికి లభించే స్పందన దిగ్భ్రాంతికరంగా ఉంది. ఆ మహిళ చాలా సాధారణ స్వరంలో, "సోదరా, నువ్వు దాన్ని ఎవరికీ ఇవ్వాల్సిన అవసరం లేదు, దాన్ని పారవేయి" అని చెప్పింది. దీంతో డెలివరీ బాయ్ షాక్ అయ్యాడు. ఈ సమాధానం రైడర్‌ని ఆశ్చర్యపరిచింది. ఇది జోకా..? లేదా నిజమా.. అతనికి ఖచ్చితంగా తెలియక షాక్ అయ్యాడు. తరువాత, అనుమానం వచ్చి పార్శిల్‌ను తెరిచి చూశాడు డెలివరీ బాయ్. అందులో చెత్త తప్ప మరేమీ లేదని తేలింది. అంటే ఆ మహిళ ఉద్దేశపూర్వకంగా తన చెత్తను పారవేయడానికి ఒక యాప్ ని ఉపయోగించిందని అర్థమైంది. పోర్టర్ రైడర్ ఈ మొత్తం సంఘటనను వీడియోలో రికార్డ్ చేశాడు. దానిని అతను సోషల్ మీడియాలో రెండు భాగాలుగా షేర్ చేశాడు. వీడియోలోని మొదటి భాగంలో, అతను కస్టమర్‌ను అలా చేయడం సముచితమా అని ప్రశ్నించాడు. అతను తన కోపాన్ని, ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశాడు. కానీ చివరికి అతను చెప్పినట్లుగానే చేశాడు. అతను చెత్తను పారవేశాడు. బహుశా అతను పోర్టర్‌ను నడిపిస్తున్న ఏకైక కారణం ఇతరుల చెత్తను పారవేయడమేనని వ్యంగ్యంగా వ్యాఖ్యానించాడు. ప్రజలు ఇప్పటికే చెత్తను ఎక్కడ వేస్తున్నారో అదే స్థలంలో అతను చెత్తను వేస్తున్నట్లు కూడా వీడియో చూపిస్తుంది. ఈ వీడియో బయటకు రాగానే సోషల్ మీడియాలో స్పందనలు వెల్లువెత్తాయి. ఈ సంఘటన పెద్ద చర్చకు దారితీసింది. ఒకవైపు, కొంతమంది తమ సొంత సౌలభ్యం కోసం ఎంత దూరం అయినా వెళ్తారని ఇది చూపిస్తుంది. మరోవైపు, డెలివరీ సిబ్బంది ఏ పరిస్థితులలో పని చేస్తారో, వారి ఎంపికలు ఎంత తరచుగా పరిమితంగా ఉన్నాయో కూడా ఇది వెల్లడిస్తుంది. ఈ వీడియోలో లక్నో నవాబీతనం.. మర్యాద లేకాకుండా, అజాగ్రత్తను, బద్ధకాన్ని తెలియజేస్తుంది.

# ఓరి దేవుడా! లిఫ్ట్ గాలిలో ఉండగా.. ఒక్కసారిగా పేలిన బెలూన్లు..




ఆర్థిక రాజధాని ముంబైలో ఒక భయానక సంఘటన జరిగింది. కదులుతున్న లిఫ్ట్ లోపల శక్తివంతమైన పేలుడు సంభవించింది. తీవ్ర భయాందోళనలకు గురి చేస్తున్న ఈ సంఘటన భద్రతా ప్రమాణాల గురించి తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఒక యువకుడు గ్యాస్ బెలూన్‌లతో లిఫ్ట్‌లోకి ప్రవేశించాడు. అది అకస్మాత్తుగా పేలిపోయింది.ఆర్థిక రాజధాని ముంబైలో ఒక భయానక సంఘటన జరిగింది. కదులుతున్న లిఫ్ట్ లోపల శక్తివంతమైన పేలుడు సంభవించింది. తీవ్ర భయాందోళనలకు గురి చేస్తున్న ఈ సంఘటన భద్రతా ప్రమాణాల గురించి తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఒక యువకుడు గ్యాస్ బెలూన్‌లతో లిఫ్ట్‌లోకి ప్రవేశించాడు. అది అకస్మాత్తుగా పేలిపోయింది. ఈ ప్రమాదంలో అత్యంత విషాదకరమైన అంశం ఏమిటంటే, పరిమితమైన లిఫ్టులోని ఇరుకైన స్థలం కావడంతో పేలుడు ప్రభావాన్ని రెట్టింపు చేసింది. ఫలితంగా లిఫ్టు లోపల ఉన్న వారికి ప్రాణాపాయం తప్పి, తీవ్రమైన గాయాలయ్యాయి. ముంబైలోని గోరేగావ్‌లోని ఒక భవనంలోని లిఫ్ట్‌లో సోమవారం (ఫిబ్రవరి 02) రాత్రి గ్యాస్ బెలూన్‌ల గుత్తి పేలి మంటలు చెలరేగాయి. లిఫ్ట్ లోపల ఉన్న ఒక యువకుడు, ఒక మహిళ తీవ్రంగా గాయపడ్డారు. ఈ దారుణ సంఘటన లిఫ్ట్ లోపల ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల్లో రికార్డైంది. ఆ ఫుటేజీలో ఒక మహిళ సూట్‌కేస్‌తో లిఫ్ట్‌లోకి ప్రవేశించింది. ఆ తర్వాత ఒక వ్యక్తి ప్లాస్టిక్ చుట్టిన బెలూన్ల గుత్తిని మోసుకెళ్లడం కనిపించింది. దీంతో ఒక్కసారిగా గ్యాస్ బెలూన్‌లు పేలిపోయాయి. లిఫ్ట్ మంటల్లో చిక్కుకున్న సమయంలో, మరొక వ్యక్తి లిఫ్ట్‌లోకి ప్రవేశించడం కనిపించింది. లోపల ఉన్న ముగ్గురు వ్యక్తులు తమను తాము రక్షించుకోవడానికి ప్రయత్నిస్తూ లిఫ్ట్ నుండి బయటకు పరిగెత్తుకుంటూ వచ్చారు. సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న ఈ దృశ్యాలను బట్టి చూస్తే, లిఫ్ట్ లోపల పరిస్థితి ఎంత భయంకరంగా ఉందో అర్థమవుతోంది. పేలుడు సమయంలో లిఫ్ట్ గాల్లోనే ఇరుక్కుపోయి ఉంటే, లోపల చిక్కుకున్న వ్యక్తులు తప్పించుకునే అవకాశం కూడా ఉండేది కాదని నిపుణులు అంటున్నారు.

## చిన్నారికి చాక్లెట్ కావాలంటే కొనిపెట్టారు..

# వామ్మో.. నోట్లో పెట్టగానే పేలిపోయింది.. చివరకు



చిన్నారులకు.. చాక్లెట్లు, బిస్కెట్లు అంటే ఎంతో ఇష్టం.. వారు కొనిచ్చే వరకు మారం చేస్తూనే ఉంటారు.. ఇలా మారం చేస్తుంటే.. మూడేళ్ల కూతురికి తల్లి చాక్లెట్ కొనిచ్చింది.. అయితే.. ఆ చిన్నారి సంబరంతో చాక్లెట్ ను తీసుకుని.. కవర్ తీసి నోటీలో పెట్టుకుంది.. అలా నోట్లో పెట్టుకుందో లేదో.. చిన్నారి నోటిలోనే చాక్లెట్ పేలిపోయింది. దీంతో బాలిక దవడ మొత్తం చీలిపోయి తీవ్ర గాయాలయ్యాయి. ఈ దారుణ ఘటన రాజస్థాన్‌లోని అల్వార్‌లోని చౌకి బాస్ గ్రామంలో చోటుచేసుకుంది. బాలిక నోట్లో చాక్లెట్ పేలడం తీవ్ర కలకలం రేపింది. ఓ దుకాణంలో చాక్లెట్ కొనుగోలు చేసిన బాలిక నోట్లో పెట్టుకొని నములుతుండగా పేలుడు జరిగింది. పేలుడు ధాటికి బాలిక దవడ ,చెంప చీలిపోయింది. చాక్లెట్ బదులు గన్‌పౌడర్ నింపిన పదార్థాన్ని బాలికకు ఇచ్చినట్టు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు.. అక్కడకు చేరుకుని వివరాలు సేకరించారు. దుకాణ యాజమానిని అరెస్ట్ చేసి పోలీసులు విచారిస్తున్నారు. అయితే.. చాక్లెట్ పేలడంతో తీవ్ర గాయాలతో అపస్మారక స్థితికి చేరుకున్న బాలికను కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను అల్వార్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు, అక్కడ వైద్యులు ఆమెకు శస్త్రచికిత్స నిర్వహించారు. అమ్మాయి ప్రస్తుతం ప్రమాదం నుండి బయటపడిందని డాక్టర్లు తెలిపారు. ఈ ఘటనపై ఎఫ్ఎస్ఎల్ నివేదిక కోసం చూస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

**పేలుడు ధాటికి కూల్ డ్రింక్ కూడా పగిలిపోయింది..**

తన కూతురు అక్షు (3)కు ఊర్లోనే ఉన్న కిరాణా కొట్టులో చాక్లెట్ కొనిచ్చానని.. అది నోట్లో పెట్టుకోగానే పేలిపోయినట్లు చిన్నారి తల్లి తెలిపింది. ప్రస్తుతం బాలిక ఐసీయూలో చికిత్స పొందుతున్నట్లు రామ్‌గఢ్ ఎస్‌హెచ్‌ఓ విజయేంద్ర సింగ్ తెలిపారు. ఈ ఘటనపై చిన్నారి అత్త నికిత పోలీసులకు ఫిర్యాదు చేసిందన్నారు. సుదీల్ అలియాస్ కలా.. అక్షుకి గన్ పౌడర్ ఉన్న ఫైర్ క్రాకర్ చాక్లెట్ ఇవ్వడంతో ఆమె తీవ్రంగా గాయపడిందని, ఆ సమయంలో తనకూతురు అహానా కూల్ డ్రింక్ తీసుకోగా.. అది కూడా పగిలిందని పోలీసులకు వెల్లడించింది. ఈ ఘటనపై అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్నామని రామ్‌గఢ్ ఎస్‌హెచ్‌ఓ విజయేంద్ర సింగ్ తెలిపారు.

# బిజినెస్ వాయిస్

## బంగారం ధరలు తారుమారు..

### గంటల్లోనే ధరల్లో ఊహించని ట్విస్ట్.. ఒకేసారి ఎంత పెరిగాయంటే..?



బంగారం ధరల్లో గంటల్లోనే మారిపోయాయి. ఉదయం ఒకలా ఉండగా.. మార్కెట్లు ప్రారంభమయ్యాకే గోల్డ్ రేట్లల్లో భారీ మార్పులు జరుగుతున్నాయి. గంట్లోనే బంగారం ధరలు తారుమారయ్యాయి. ఒకేసారి భారీగా పెరిగి కొనుగోలుదారులకు షాక్ ఇచ్చాయి. దీంతో గోల్డ్ రేట్లు ఎప్పుడు ఎలా ఉంటాయో అర్థం కావడం లేదు. బంగారం కొనుగోలు చేయాలనుకునేవారికి బిగ్ షాక్. పసిడి ధరలు ఒక్కసారిగా భారీగా పెరిగాయి. ఒకేసారి రూ.7 వేల మేర గోల్డ్ ధర ఒకేరోజు పెరిగింది. మొన్నటివరకు ధరలు భారీగా పతనమవ్వగా.. ఇప్పుడు తగ్గుదలకు బ్రేక్ పడింది. అమెరికా–భారత్ ట్రేడ్ డీల్, కేంద్రం బడ్జెట్ ప్రకటనతో గోల్డ్, సిల్వర్ ధరల్లో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. బుధవారం బంగారం ధరలు భారీగా పెరిపోయాయి. హైదరాబాద్‌లో గోల్డ్ రేటు ఇవాళ రూ.6,600 పెరిగింది. ప్రస్తుతం నగరంలో 10 గ్రాముల 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధర రూ.1,60,530కి చేరుకుంది. నిన్న రూ.1,53,930గా ఉంది. ఇక 22 క్యారెట్ల ధర రూ.6050 పెరిగింది. ప్రస్తుతం వీటి రేటు రూ.1,47,150కి చేరు కోగా.. నిన్న రూ.1,41,100 వద్ద స్థిరపడింది. ఇక చెన్నైలో గోల్డ్ రేటు బుధవారం రూ.6890 మేర పెరిగింది. మంగళవారం ఇక్కడ 24 క్యారెట్ల ధర రూ.1,55,670 వద్ద స్థిరపడగా.. ఇవాళ రూ.1,62,560 వద్ద కొనసాగుతోంది. ఇక 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,49,000గా ఉంది. నిన్నటితో పోలిస్తే దీనిపై రూ.6300 పెరిగింది ఇక బెంగళూరులో 10 గ్రాముల 24 క్యారెట్ల ప్యూర్ గోల్డ్ రేటు రూ.1,60,530 వద్ద కొనసాగుతోంది. నిన్న రూ.1,53,930గా ఉంది. నిన్నటితో పోలిస్తే ఏకంగా రూ.6600 పెరిగింది. ఇక 22 క్యారెట్ల రేటు చూస్తే బెంగళూరులో రూ.1,47,150 పలుకుతోంది. నిన్న ఇది రూ.1,41,100గా ఉంది. నిన్నటితో పోలిస్తే రూ.6 వేల మేర పెరిగింది. ఇక వెండి ఒకేసారి రూ.40 వేలు పెరిగింది. బుధవారం బెంగళూరులో కేజీ వెండి రూ.3.20 లక్షలు పలుకుతోంది. ఇక హైదరాబాద్‌లో కేజీ వెండి ధర రూ.3.20 లక్షలుగా ఉంది. నిన్న ఈ ధర రూ.3 లక్షలుగా ఉంది. నిన్నటితో పోలిస్తే ఇవాళ హైదరాబాద్‌లో వెండి ధర రూ.20 వేలు పెరిగింది.

## ఇంతకు మించి నగదు లావాదేవీలు జరుపుతున్నారా?




చాలా మంది ప్రతి రోజు బ్యాంకు డిపాజిట్లు చేస్తుంటారు. మీరు కూడా ఇతరుల నుంచి ప్రతి రోజు నగదును స్వీకరిస్తుంటారు. అయితే ప్రతి రోజు ఎంత నగదు లావాదేవీలు చేయవచ్చో మీకు తెలుసా? రోజు వారీ పరిమితి ఎంత? లిమిట్ దాటితే జరిమానా తప్పదు.. నేటి కాలంలో దాదాపు ప్రతిదీ డిజిటల్ చెల్లింపుల ద్వారానే జరుగుతున్నప్పటికీ, చాలా మంది ఇప్పటికీ ఇంటి ఖర్చులు, బహుమతులు ఇవ్వడం లేదా వ్యాపార ప్రయోజనాల కోసం నగదు లావాదేవీలు చేస్తారు. కానీ ఆదాయపు పన్ను శాఖ రోజువారీ నగదు లావాదేవీ పరిమితిని నిర్ణయించిందని మీకు తెలుసా? ఈ పరిమితిని మించితే పన్ను నోటీసు, భారీ జరిమానా విధించవచ్చు. అయితే నగదు లావాదేవీలపై ఆదాయపు పన్ను శాఖ కఠినంగా వ్యవహరిస్తోంది. భారత ప్రభుత్వం, ఆదాయపు పన్ను శాఖ ఇప్పుడు నగదు లావాదేవీలను కఠినంగా పర్యవేక్షిస్తున్నాయి. నల్లధనం, పన్ను ఎగవేతను నిరోధించడం దీని లక్ష్యం. ప్రజలు తరచుగా తెలియకుండానే పెద్ద మొత్తంలో నగదును ఉపసంహరించుకుంటారు లేదా జమ చేస్తారు. ఇది పన్ను నియమాలను ఉల్లంఘించవచ్చు. అందువల్ల రోజువారీ నగదు లావాదేవీలకు చట్టపరమైన పరిమితిని తెలుసుకోవడం చాలా ముఖ్యం.

**ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 269ST ఏం చెబుతుంది?**

ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 269ST ప్రకారం, ఒక వ్యక్తి ఒక రోజులో రూ.2 లక్షల వరకు మాత్రమే నగదు లావాదేవీలు చేయగలడు. అంటే మీరు ఒకే రోజులో ఒకే వ్యక్తి నుండి రూ.2 లక్షల కంటే ఎక్కువ నగదు ఇస్తే లేదా స్వీకరిస్తే, అది నిబంధనల ప్రత్యక్ష ఉల్లంఘనగా పరిగణిస్తారు. ఈ నియమం అన్ని రకాల లావాదేవీలకు వర్తిస్తుంది. అవి బహుమతులు, రుణాలు లేదా వ్యాపార చెల్లింపులు అయినా. ఉదాహరణకు మీరు ఎవరికైనా రూ.2 లక్షల నగదు ఇస్తే లేదా స్వీకరిస్తే ఆదాయపు పన్ను శాఖ దీనిని పర్యవేక్షించి మీకు నోటీసు పంపవచ్చు. అందుకు మీరు సమాధానం చెప్పాల్సి ఉంటుంది.

**పరిమితిని దాటితే జరిమానా ఎంత?**

మీరు ఈ నియమాన్ని ఉల్లంఘిస్తే ఆదాయపు పన్ను శాఖ మీరు నగదు రూపంలో అందుకున్న మొత్తానికి సమానమైన జరిమానా విధించవచ్చు. ఉదాహరణకు, మీరు ఎవరి నుండి అయినా రూ.2.5 లక్షల నగదు అందుకుంటే మీకు రూ.2.5 లక్షల జరిమానా విధించవచ్చు. ఈ జరిమానా ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 271ణాా కింద విధిస్తారు. ఈ జరిమానా డబ్బును ఇచ్చే వ్యక్తికి కాదు, అందుకున్న వ్యక్తికి వర్తిస్తుంది.

**ఈ నియమం ఎందుకు అమలు చేయబడింది?**

నల్లధనం, పన్ను ఎగవేతను అరికట్టడానికి ప్రభుత్వం ఈ నియమాన్ని అమలులోకి తెచ్చింది. పెద్ద మొత్తంలో నగదును గుర్తించడం కష్టం. అందుకే ట్రేసబిలిటీని నిర్ధారించడానికి అన్ని పెద్ద లావాదేవీలను బ్యాంక్ బదిలీ, చెక్ లేదా డిజిటల్ మార్గాల ద్వారా నిర్వహించాలని ప్రభుత్వం కోరుతుంది. బంధువు లేదా స్నేహితుడికి డబ్బు ఇవ్వడం వంటి లావాదేవీ ప్రైవేట్ అయినప్పటికీ, మొత్తం రూ.2 లక్షలు దాటితే, ఆదాయపు పన్ను శాఖ దానిపై దర్యాప్తు చేయవచ్చు.

**ఆదాయపు పన్ను శాఖ ఎలా పర్యవేక్షిస్తుంది?**

ఆదాయపు పన్ను శాఖ ఇప్పుడు AI (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ఆధారిత డేటా విశ్లేషణ వ్యవస్థను ఉపయోగించి అన్ని లావాదేవీలను పర్యవేక్షిస్తుంది. ఎవరి పొదుపు ఖాతాలోనైనా డిపాజిట్లు లేదా ఉపసంహరణలు సంవత్సరంలో రూ.10 లక్షలు దాటితే, లేదా కరెంట్ ఖాతాలో రూ.50 లక్షలకు మించి కార్యకలాపాలు కనిపిస్తే సిస్టమ్ హెచ్చరికను పంపుతుంది. ఇది మాత్రమే కాదు, ఎవరైనా రూ.2 లక్షల కంటే తక్కువ నగదు ఎంట్రీలు చేయడం ద్వారా పరిమితిని తప్పించుకోవడానికి పదేపదే ప్రయత్నిస్తే దీనిని కూడా "అనుమానాస్పద లావాదేవీ"గా పరిగణించి దర్యాప్తు చేయవచ్చు.

## విమాన ప్రయాణికులకు గుడ్‌న్యూస్!

### నమస్తే వరల్డ్ పేరుతో ఎయిర్ ఇండియా భారీ డిస్కౌంట్లు!




ఎయిర్ ఇండియా 'నమస్తే వరల్డ్ సేల్' ద్వారా దేశీయ, అంతర్జాతీయ విమాన టిక్కెట్లపై భారీ తగ్గింపులు ప్రకటించింది. ఫిబ్రవరి 5 వరకు బుకింగ్‌లు చేసుకోవచ్చు, ప్రయాణం డిసెంబర్ 31 వరకు. లండన్, జ్యూరిచ్, న్యూయార్క్ వంటి ప్రధాన రూట్‌లలో ఆకర్షణీయమైన ఛార్జీలు, ఉచిత తేదీ మార్పు సౌకర్యం ఉంది. విమాన ప్రయాణికులకు ఎయిర్ ఇండియా గుడ్‌న్యూస్ చెప్పింది. నమస్తే వరల్డ్ సేల్‌లో భాగంగా బేస్ ఛార్జీలపై భారీ డిస్కౌంట్‌ను ప్రకటించింది. ఈ సేల్ ఫిబ్రవరి 5 వరకు బుకింగ్‌ల కోసం తెరిచి ఉంటుంది. ప్రయాణ తేదీ ఫిబ్రవరి 11 నుంచి డిసెంబర్ 31 లోపు ఉండాలని కంపెనీ తెలిపింది. ఈ డిస్కౌంట్లు ఇండియా టూ లండన్ మధ్య రౌండ్ ట్రిప్ ఛార్జీ రూ.46,599 వరకు ఉంటాయి. ఈ సేల్‌లో దేశీయ వన్–వే ఛార్జీలు రూ.1,499 నుండి ప్రారంభమవుతాయి. అంతర్జాతీయ ఛార్జీలు రూ.5,033 నుండి ప్రారంభమవుతాయి. ఇంకా అమ్మకం సమయంలో చేసిన అన్ని బుకింగ్‌లపై ఎయిర్ ఇండియా ఒక ఉచిత తేదీ మార్పును అనుమతిస్తుంది. ప్రమోషనల్ ఆఫర్ కింద ఎయిర్ ఇండియా ఈ క్రింది రూట్లలో ఈ క్రింది ఛార్జీలను వసూలు చేస్తుంది. ఇవి ఎకానమీ క్లాస్ ఛార్జీలు. ప్రీమియం ఎకానమీ, బిజినెస్ క్లాస్ టిక్కెట్లపై కూడా డిస్కౌంట్లు అందుబాటులో ఉన్నాయి.

ఇండియా–జురిచ్: రూ.46,000, ఇండియా–ఫ్రాంక్‌ఫర్ట్: రూ.55,000, ఇండియా–న్యూయార్క్: రూ.62,271, ఇండియా–సిడ్నీ: రూ.46,699, ఇండియా–సింగపూర్: రూ.14,709, ఇండియా–టోక్యో: రూ.45,000.

ఎయిర్ ఇండియా ఉత్తర అమెరికా, యూరప్, ఖఖ, ఆస్ట్రేలియా, మిడిల్ ఈస్ట్, మరియు ఆగ్నేయాసియా, తూర్పు ఆసియా ప్రాంతాలకు వెళ్లే విమానాలలో డిస్కౌంట్లతో టిక్కెట్లు అందిస్తోంది. అయితే బుకింగ్ కోసం అనుమతించిన ఒక తేదీ మార్పు కోసం, షెడ్యూల్ చేసిన డిపార్ట్‌కు కనీసం 72 గంటల ముందు తేదీ మార్పును అభ్యర్థించాలని ఎయిర్ ఇండియా పేర్కొంది. ఈ మార్పుకు ఎటువంటి జరిమానా ఉండదు కానీ ప్రయాణీకుడు ఛార్జీలలోని వ్యత్యాసానికి చెల్లించాలి.airindia.com వెబ్‌సైట్, ఎయిర్ ఇండియా మొబైల్ యాప్ ద్వారా నేరుగా టిక్కెట్లు బుక్ చేసుకుంటే, ఎటువంటి సౌలభ్య ఛార్జీలు ఉండవని కంపెనీ తెలిపింది. అలాగే SBI క్రెడిట్ కార్డులు, అమెరికన్ ఎక్స్‌ప్రెస్ కార్డులతో టిక్కెట్లు బుక్ చేసుకుంటే అదనపు డిస్కౌంట్లు కూడా ఉన్నాయి. SBI క్రెడిట్ కార్డులు దేశీయ బుకింగ్‌లపై రూ.2,500 వరకు, అంతర్జాతీయ బుకింగ్‌లపై రూ.10,000 వరకు తగ్గింపు అందిస్తోంది. ఇందుకోసం SBICARDAI ప్రోమో కోడ్‌ను ఉపయోగించాలి. అలాగే అమెరికన్ ఎక్స్‌ప్రెస్ కార్డులపై యాక్సిలరేటెడ్ మెంబర్‌షిప్ రివార్డ్స్ పాయింట్లు, ప్లాటినం, సెంచూరియన్ కార్డ్ హోల్డర్లకు 10X పాయింట్లు, ప్లాటినం రిజర్వ్ కార్డ్‌లకు 5X పాయింట్లు, ప్లాటినం కార్పొరేట్ కార్డ్‌లకు 2X పాయింట్లు లభిస్తాయి.UPI చెల్లింపులతో దేశీయ బుకింగ్‌లపై ప్రతి ప్రయాణీకుడికి రూ.1,000 వరకు, అంతర్జాతీయ బుకింగ్‌లపై ప్రతి ప్రయాణీకుడికి రూ.2,000 వరకు తగ్గింపు లభిస్తోంది. అందుకోసం ప్రోమో కోడ్ UPIPROMO ఉపయోగించాలి. నెట్ బ్యాంకింగ్‌తో UPI లాంటి తక్షణ డిస్కౌంట్లు. NBPROMO ప్రోమో కోడ్ ఉపయోగించాలి. వెబ్‌సైట్, యాప్ బుకింగ్‌లతో చేస్తే FLYAI ప్రోమో కోడ్‌ని ఉపయోగించి బుకింగ్‌కు రూ.3,000 వరకు అదనపు తక్షణ తగ్గింపు లభిస్తోంది.

### హోలీ, దీపావళి నాడు

## ఉచితంగా గ్యాస్ సిలిండర్లు..

### ఆ ప్రభుత్వం కీలక నిర్ణయం



హోలీకి ముందు ఈ మొత్తాన్ని అర్హులైన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు. ఈ ఉచిత గ్యాస్ సిలిండర్ పథకానికి ప్రభుత్వం రూ. 242 కోట్లు కేటాయించిందని ముఖ్యమంత్రి చెప్పారు. సీఎం గుప్తా ఈ పథకాన్ని ప్రశంసించారు. భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని ఢిల్లీ ప్రభుత్వం హోలీకి ముందు రాజధాని నివాసితులకు గణనీయమైన ఉపశమనం కలిగించింది. ప్రతి సంవత్సరం రెండు ఉచిత ఎల్‌పీజీ సిలిండర్లను అందించే పథకాన్ని ఆమోదించింది. ఈ ప్రణాళిక ప్రకారం.. రాజధానిలో నివసించే పేద కుటుంబాలు హోలీ, దీపావళి నాడు ఒక్కొక్కరికి ఒక ఉచిత సిలిండర్‌ను అందుకుంటారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో బిజెపి ఇచ్చిన కీలక వాగ్దానాన్ని నెరవేర్చడం ద్వారా ఢిల్లీ క్యాబినెట్ ఈ ప్రతిపాదనను అధికారికంగా ఆమోదించింది. ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా విలేకరుల సమావేశంలో హోలీ, దీపావళి సందర్భంగా చెల్లుబాటు అయ్యే రేషన్ కార్డులు కలిగి ఉన్న కుటుంబాలకు ఉచిత ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్లు అందించనున్నట్లు ప్రకటించారు. ఈ పథకం దేశ రాజధానిలోని ఆర్థికంగా బలహీనమైన కుటుంబాలకు, ముఖ్యంగా తక్కువ ఆదాయ కుటుంబాలకు చెందిన మహిళలకు సహాయం చేయడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ పథకం కింద రేషన్ కార్డుదారులు, ఆర్థికంగా బలహీన వర్గాల వర్గంలోకి వచ్చే కుటుంబాలు హోలీ, దీపావళి సందర్భంగా ఉచిత ఎల్‌పీజీ సిలిండర్లను అందుకుంటారు. ముఖ్యమంత్రి రేఖ గుప్తా అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఢిల్లీ మంత్రివర్గం ఎల్‌పీజీ సిలిండర్ ధర కోసం రూ.853 బదిలీ చేయాలని నిర్ణయించింది. అంటే ఈ మొత్తాన్ని డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ వ్యవస్థ ద్వారా అర్హత కలిగిన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి జమ చేస్తారు. పైప్డ్ నేచురల్ గ్యాస్ కనెక్షన్‌లను ఉపయోగించే అర్హత కలిగిన రేషన్ కార్డుదారులు కూడా ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందుతారని సీఎం గుప్తా విలేకరుల సమావేశంలో విలేకరులతో అన్నారు. ఒక ఎల్‌పీజీ సిలిండర్ ధరకు సమానమైన రూ. 853, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ సిస్టమ్ ద్వారా అర్హత కలిగిన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు నేరుగా బదిలీ చేయనున్నారు. పీఎన్‌జీ కనెక్షన్‌లను ఉపయోగించే రేషన్ కార్డుదారులను మినహాయించబోమని, ఈ పథకం కింద వారు కూడా ప్రయోజనం పొందుతారని స్పష్టం చేశారు. హోలీకి ముందు ఈ మొత్తాన్ని అర్హులైన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు. ఈ ఉచిత గ్యాస్ సిలిండర్ పథకానికి ప్రభుత్వం రూ. 242 కోట్లు కేటాయించిందని ముఖ్యమంత్రి చెప్పారు. సీఎం గుప్తా ఈ పథకాన్ని ప్రశంసించారు. తన ప్రభుత్వం తన ఎన్నికల వాగ్దానాలను నెరవేర్చడానికి కట్టుబడి ఉందని అన్నారు. ఈ పథకానికి దాదాపు రూ.300 కోట్లు ఖర్చవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. అయితే ఈ చొరవకు ప్రస్తుత కేటాయింపు రూ.242 కోట్లు. EWS కేటగిరీలో ఉన్నవారు లేదా చెల్లుబాటు అయ్యే రేషన్ కార్డు ఉన్నవారు మాత్రమే దీని నుండి ప్రయోజనం పొందగలరు.

## నెలకు రూ. 25 వేల జీతంతో సొంతిల్లు కొనడం సాధ్యమేనా?

సొంత ఇల్లు, ఖరీదైన కారు.. ఇవి కేవలం ధనవంతులకే సాధ్యమని చాలా మంది నమ్ముతుంటారు. నెలకు రూ.25 వేలు సంపాదిస్తూ సంసారాన్ని నెట్టుకురావడమే కష్టమైన రోజుల్లో, లగ్జరీ ఇల్లు కొనడం అనేది ఒక కలలాగే కనిపిస్తుంది. అయితే, అసాధ్యాన్ని సుసాధ్యం చేసే ఒక మ్యాజిక్ ఫార్ములాను ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. సరైన ప్రణాళిక, కొంచెం క్రమశిక్షణ ఉంటే సామాన్యుడు కూడా కోటీశ్వరుడిగా మారవచ్చని లెక్కలతో సహా నిరూపిస్తున్నారు. బిజినెస్ కోచ్ దీపక్ వాధ్వా అందించిన ఈ ఫార్ములాలో ఎటువంటి రహస్యం లేదు, అంతా 'సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్' మరియు చక్రవడ్డీ మహిమే. నెలకు కేవలం ఐదు వేల రూపాయలతో మొదలుపెట్టి, మీ ఆదాయం పెరిగే కొద్దీ పెట్టుబడిని పెంచుకుంటూ పోతే.. కొన్నేళ్లలో మీ చేతికి కోట్లాది రూపాయలు అందుతాయి. ఆ డబ్బుతో మీరు పని చేయకుండానే నెలనెలా లక్షల రూపాయల ఆదాయాన్ని పొందే మార్గం ఏమిటో ఇప్పుడు వివరంగా తెలుసుకుందాం.

రూ.1.5 కోట్లు సంపాదించే 'మ్యాజిక్ ఫార్ములా' ఇదే:

### మిడిల్ క్లాస్ వారికి సీక్రెట్ మంత్ర!




క్రమశిక్షణతో కూడిన SIP: మీ రూ.25,000 జీతంలో కనీసం రూ.5,000 మొత్తాన్ని SIPలో పెట్టుబడి పెట్టండి.

వార్షిక పెంపు: ప్రతి సంవత్సరం మీ జీతం పెరిగినప్పుడు, మీ పెట్టుబడిని కూడా 20% పెంచుకుంటూ వెళ్లాలి. ఇలా 15 సంవత్సరాల పాటు నిరంతరంగా చేస్తే, చక్రవడ్డీ ప్రభావంతో మీ వద్ద సుమారు రూ.1.5 కోట్ల నిధి తయారవుతుంది.

సిస్టమాటిక్ విత్‌డ్రాయల్ ప్లాన్: 15 ఏళ్ల తర్వాత ఆ కోటిన్నర రూపాయలను విలాసాలకు ఒకేసారి ఖర్చు చేయకుండా, 'SWP' పద్ధతిలో పెట్టుబడి పెట్టాలి. దీనివల్ల అసలు మొత్తం అలాగే ఉంటూ, మీకు నెలనెలా సుమారు రూ.2 లక్షల వరకు ఆదాయం లభిస్తుంది.

కలల సాకారం: ఈ నెలవారీ రూ.2 లక్షల ఆదాయంతో మీరు లగ్జరీ ఇల్లు ఫార్చ్యూనర్ వంటి ఖరీదైన కారు EMIలను సులభంగా చెల్లించవచ్చు. మీ అసలు జీతం మీకు అదనపు బలాన్ని ఇస్తుంది.

**గుర్తుంచుకోవాల్సిన విషయం:**

ఇది రాత్రికి రాత్రే ధనవంతులు అయ్యే పథకం కాదు. దీనికి కనీసం 15 ఏళ్ల ఓర్పు క్రమశిక్షణ అవసరం. మ్యూచువల్ ఫండ్స్‌లో దీర్ఘకాలికంగా 12 నుండి 15 శాతం రాబడి వచ్చే అవకాశం ఉండటం వల్ల ఇది సాధ్యమవుతుంది.

# ఏపీలోని స్కూల్, కాలేజీ విద్యార్థులకు అద్భుత అవకాశం..



ఏపీలోని స్కూల్, కాలేజీ విద్యార్థులకు తీపికబురు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో ప్రత్యేక ఆధార్ కేంద్రాలను గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ ఉచితంగా విద్యార్థులు ఆధార్ వివరాలు అప్‌డేట్ చేయించుకోవచ్చు. దీంతో తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని అధికారులు సూచించారు. ఏపీలోని స్కూల్, కాలేజీ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త తెలిపింది. ప్రభుత్వ స్కూల్స్, కాలేజీల్లో స్పెషల్ ఆధార్ క్యాంపులను ప్రతీ నెలా నిర్వహిస్తోంది. ప్రతీ నెల ప్రారంభంలో అన్ని గవర్నమెంట్ విద్యాసంస్థల్లో వీటిని ఏర్పాటు చేస్తోంది. గత కొద్ది నెలలుగా వీటిని ఏర్పాటు చేస్తోండగా.. ఫిబ్రవరిలో కూడా అందుబాటులోకి రానున్నాయి. వీటి ద్వారా పిల్లలు, కాలేజీ విద్యార్థులు ఉచితంగా ఆధార్ కార్డుల్లోని బయోమెట్రిక్, ఇతర వివరాలను అప్డేట్ చేయించుకోవచ్చు. ఇందుకోసం గ్రామం నుంచి పట్టణాల్లో ఉండే ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ సెంటర్లకు వెళ్లాల్సిన వ్యయప్రయాసాలు తప్పుతాయి. ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ సెంటర్లలో ఆధార్ అప్డేట్‌కు ఛార్జీలు వసూలు చేస్తారు. కానీ ఈ స్పెషల్ క్యాంపుల్లో ఉచితంగానే సేవలు అందిస్తారు.

**ఫిబ్రవరిలో ఎప్పుడంటే..?**

ఈ నెల 2వ తేదీ నుంచి 6వ తేదీ వరకు ఆధార్ స్పెషల్ క్యాంపులను స్కూళ్లు, కాలేజీల్లో ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీ ప్రభుత్వం తెలిపింది. అలాగే ఫిబ్రవరి 16 నుంచి 20వ తేదీ వరకు కూడా మళ్లీ నిర్వహించనుంది. పిల్లలు చిన్న వయస్సులో ఆధార్ తీసుకుంటారు. దీంతో పెద్దయ్యాక బయోమెట్రిక్ వివరాలను అప్డేట్ చేసుకోవాల్సి ఉంటుంది. ఏపీలో చాలామంది విద్యార్థులు ఇంకా అప్డేట్ చేసుకోలేదు. దీంతో ప్రభుత్వం ఈ ప్రత్యేక ఆధార్ కేంద్రాలను అందుబాటులోకి తెస్తోంది. గ్రామ, వార్డు సచివాలయం సిబ్బంది రాష్ట్రవ్యాప్తంగా వీటిని నిర్వహిస్తున్నారు. 5 నుంచి 17 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న పిల్లలు ఆధార్ అప్డేట్ చేయించుకుంటే ఎలాంటి ఛార్జీలు వసూలు చేయరు. దీంతో తల్లిదండ్రులు ఈ అవకాశం ఉపయోగించుకుని పిల్లల ఆధార్ వివరాలను అప్డేట్ చేయించాలని అధికారులు తన ప్రకటనలో తెలిపారు.

**తెలంగాణలో కూడా స్పెషల్ క్యాంపులు**

గత ఏడాది అక్టోబర్ నుంచి ఏపీలోని విద్యాసంస్థల్లో ఈ ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నారు. అయినా కొంతమంది తల్లిదండ్రుల తమ పిల్లల ఆధార్ వివరాలను అప్డేట్ చేయించడం లేదు. దీంతో ప్రభుత్వం వీటిని ప్రతీ నెలా కొనసాగిస్తూ వస్తోంది. పిల్లల ఆధార్ వివరాలు అప్డేట్ చేయిచంకపోతే వినియోగించే సమయంలో సమస్యలు రావొచ్చు. ప్రభుత్వ పథకాలు, ఇతర బెనిఫిట్స్ ఆగిపోయే అవకాశముంది. అటు తెలంగాణ ప్రభుత్వం కూడా ఇలాంటి స్పెషల్ ఆధార్ క్యాంపులను నిర్వహిస్తోంది. ఎంఈవోలను సంప్రదించి ఈ సెంటర్ల వివరాలను పొందవచ్చు. కాగా చిన్నతనంలో ఆధార్ తీసుకునే సమయంలో తీసుకున్న బయోమెట్రిక్ వివరాలు తర్వాత పనిచేయవు. దీంతో పెద్ద అయ్యాక వాటిని అప్డేట్ చేయించుకోవాల్సి ఉంటుంది. దీనిని యూఐడీఏఐ తప్పనిసరి చేసింది. లేకపోతే ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశముంది.

వారంతా అందుకే వచ్చారు..

# గతంలో పవన్, లోకేష్ నన్ను తిట్టలేదా..



వైఎస్ఆర్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి.. గుంటూరులోని అంబటి రాంబాబు ఇంటికి చేరుకుని ఆయన కుటుంబసభ్యులకు జగన్ పరామర్శించారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడి ధైర్యం చెప్పారు... ఇటీవల ధ్వంసమైన అంబటి రాంబాబు ఆఫీస్, కార్లు, ఇంటిని జగన్ పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైఎస్ఆర్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి.. గుంటూరులోని అంబటి రాంబాబు ఇంటికి చేరుకుని ఆయన కుటుంబసభ్యులకు జగన్ పరామర్శించారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడి ధైర్యం చెప్పారు.. ఇటీవల ధ్వంసమైన అంబటి రాంబాబు ఆఫీస్, కార్లు, ఇంటిని జగన్ పరిశీలించారు. ఇటీవల టీడీపీ కార్యకర్తల దాడిలో అంబటి ఇల్లు, ఆఫీస్, కార్లు ధ్వంసం అయ్యాయి. అన్నింటినీ పరిశీలించిన జగన్.. దాడి ఘటనపై అంబటి కుటుంబ సభ్యులు, స్థానిక నాయకుల్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడారు. పోలీసుల సమక్షంలో టీడీపీ కార్యకర్తలు వైసీపీ నేతల ఇళ్లపై దాడి చేశారని జగన్ ఆరోపించారు.. బూతులు తిడుతూ అంబటి రాంబాబు మీదకు వెళ్లారన్నారు. అంబటిని చుట్టుముట్టిన సందర్భంలో ఆవేశంలో ఆయన నోరుజారారని జగన్ పేర్కొన్నారు. నోరు జారినందుకు చింతిస్తున్నా అని..అంబటి ప్రెస్‌మీట్ పెట్టి చెప్పారని జగన్ పేర్కొన్నారు. గతంలో పవన్, లోకేష్ నన్ను తిట్టలేదా.. అంటూ జగన్ ప్రశ్నించారు. అంబటిని హత్య చేయడానికే ఇంటి మీదకు వెళ్లారని ఆరోపించారు. దాడి చేసిన వారి మీద చిన్న కేసులు పెట్టి.. అంబటి రాంబాబును జైలుకు పంపించారని జగన్ పేర్కొన్నారు. రజినీ మీద కూడా దాడి చేసి.. తిరిగి ఆమె మీదనే కేసు పెట్టారని జగన్ పేర్కొన్నారు. జోగి రమేష్ ఇంటి మీద పెట్రోల్ బాంబులతో దాడి చేశారన్నారు. పోలీసులకు ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయలేదని ఆరోపించారు. దేవుడంటే భయం భక్తి లేకుండా.. రాజకీయాలకు వాడుకున్నారని జగన్ పేర్కొన్నారు. తాడేపల్లి నుంచి ఉదయం 11గంటలకు బయల్దేరిన జగన్ సాయంత్రం వేళ అంబటి నివాసానికి చేరుకున్నారు. దారి పొడవునా వైసీపీ కార్యకర్తలు, అభిమానులు భారీగా రావడంతో పర్యటన ఆలస్యమైంది. మార్గ మధ్యలో జగన్‌ను చూసేందుకు అభిమానులు భారీగా తరలివచ్చారు. చాలా చోట్ల కార్యకర్తలు చుట్టుముట్టడంతో కాన్వాయ్ ఆపి అభివాదం చేశారు.

# వలకు చిక్కిన ఫిషింగ్ క్యాట్ ఏమైంది..?

## బావురు పిల్లిని భవిష్యత్తులో చూడలేమా..?



పిల్లి ఎదురువస్తే అపశకునం అనుకుంటారు. కానీ చాలామంది పిల్లిని పెంచుకుని దానికోసం తమ ఆస్తులు సైతం రాసి ఇచ్చిన వాళ్ళు ఉన్నారు. ఇక మనకు రొటీన్ గా ఇళ్ల మధ్య తిరుగుతూ కనిపించే పిల్లికి అడవుల్లో కనిపించే పిల్లికి చాలా తేడా ఉంటుంది. అదే వాడుక భాషలో మన్నప్రాంతంలో బావురు పిల్లి అంటారు. పిల్లి ఎదురువస్తే అపశకునం అనుకుంటారు. కానీ చాలామంది పిల్లిని పెంచుకుని దానికోసం తమ ఆస్తులు సైతం రాసి ఇచ్చిన వాళ్ళు ఉన్నారు. ఇక మనకు రొటీన్ గా ఇళ్ల మధ్య తిరుగుతూ కనిపించే పిల్లికి అడవుల్లో కనిపించే పిల్లికి చాలా తేడా ఉంటుంది. అదే వాడుక భాషలో మన్నప్రాంతంలో బావురు పిల్లి అంటారు. ఈ బావురుపిల్లి పశ్చిమ బెంగాల్ రాష్ట్ర జంతువు "ఫిషింగ్ క్యాట్" గా పిలుస్తారు. చిత్తడి నేలలు, చెరువులు, నదీ తీరాలు, ముఖ్యంగా మడ అడవులు ఉండే ప్రాంతాల్లో ఎక్కువగా బావురు పిల్లి సంచారం ఉంటుంది. బావురు పిల్లి ప్రత్యేకత ఏంటంటే ఇది నీటిలో ఈదుతూ చేపలను వేటాడుతుంది. ప్రస్తుతం అంతరించిపోతున్న జాతుల్లో ఈ బావురు పిల్లి కూడా ఉంది. చేపలు పెట్టె గుడ్లను మరికొన్ని రకాల చేపలు తినేస్తుంటాయి. అయితే అలాంటి చేపలను ఈ బావురు పిల్లులు తినటం వల్ల జీవ వైవిధ్యంకు ఈ పిల్లులు దోహద పడుతుంటాయి. అందుకే వీటిని రక్షించుకోవాల్సిన అవసరం ఉందని ఫారెస్ట్ అధికారులు చెబుతున్నారు. ఇక అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని కోరింగ ఫారెస్ట్ లో ఈ బావురు పిల్లిని గుర్తించారు. ఏజెన్సీ ప్రాంతమైన ఏలూరు జిల్లాలోని కుక్కునూరు ప్రాంతంలో స్థానికులకు ఈ బావురు పిల్లి భయం పట్టుకుంది. ఇది రాత్రి పూట తిరుగుతూ.. అదును చూసి పెంపుడు కోళ్లను ఎత్తుకు వెళ్లి తింటున్నాయి. దీంతో ఊరిలో ఉన్న స్థానికులు కోళ్ళు ఏమైపోతున్నాయనే ఆందోళన మొదలైంది. ఇలా కుక్కునూరు మండలం మర్రిపాడు గ్రామంలో రోజు ఈ పరిస్థితి నెలకొనడంతో గ్రామస్తులందరూ కలిసి ఒక వల ఏర్పాటు చేశారు. అందులో అడవి పిల్లి పడింది. అయితే దాని ప్రాధాన్యత తెలియక దాన్ని కొట్టి చంపేశారు.

వారెవ్వా క్యా సీన్ హై..

# ఏపీలోని బీడు భూముల్లో కాశ్మీర్ ఆపిల్.. పండిన రైతు పంట..



రోజూ ఒక్క యాపిల్ తింటే చాలు.. డాక్టర్ దగ్గరకు వెళ్ళాల్సిన అవసరం లేదు.. ఈ క్యాప్షన్ అందరికీ సుపరిచితమే.. అయితే అలాంటి నాణ్యమైన యాపిల్ ఎక్కువగా ఎముకలు కొరికే చలిప్రాంతాల్లో మాత్రమే పండుతాయి. కాశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్ లాంటి రాష్ట్రాల్లో యాపిల్ సాగు ఎక్కువగా ఉంటుంది. రోజూ ఒక్క యాపిల్ తింటే చాలు.. డాక్టర్ దగ్గరకు వెళ్ళాల్సిన అవసరం లేదు.. ఈ క్యాప్షన్ అందరికీ సుపరిచితమే.. అయితే అలాంటి నాణ్యమైన యాపిల్ ఎక్కువగా ఎముకలు కొరికే చలిప్రాంతాల్లో మాత్రమే పండుతాయి. కాశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్ లాంటి రాష్ట్రాల్లో యాపిల్ సాగు ఎక్కువగా ఉంటుంది. కొన్ని రకాలు తక్కువ చలి ప్రాంతాల్లో కూడా పండే అవకాశం ఉండటంతో చలికాలంలో ఈ రకమైన యాపిల్‌ను పండించేందుకు రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రయోగాలు చేస్తున్నారు రైతులు.. నిన్నటి వరకు తెలంగాణాలో కొంతమంది రైతులు యాపిల్ సాగును ప్రయోగాత్మకంగా చేపడితే.. నేడు ఆంధ్రప్రదేశ్‌లో కూడా యాపిల్ సాగును చేపట్టి కాయలు కాసేలా ప్రయోగాలకు తెరతీస్తున్నారు. అలా పండిందే ఇక్కడ ఫోటోలో కనిపిస్తున్న యాపిల్ పండు.. ఏపీలోని ప్రకాశం జిల్లా కొమరోలు మండలం తాటిచర్ల మోటు సమీపంలో ఓ రైతు యాపిల్ సాగు చేస్తున్నాడు. తక్కువ చలి ఉన్నా పండే కొన్ని రకాల యాపిల్ మొక్కలను కర్నాటక రాష్ట్రం నుంచి తీసుకొచ్చి తన పొలంలో మొక్కలు నాటాడు. ఏడాది క్రితం నాటిన యాపిల్ మొక్కలకు నేడు పండ్లు కాయడం ప్రారంభించాయి. మరో రెండు నెలల్లో పూర్తిస్థాయి పంట చేతికి వస్తుందని భావిస్తున్నారు. తక్కువ చలిలో కూడా పండే ఈ రకం యాపిల్ మొక్కలు 48 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు తట్టుకుంటాయని చెబుతున్నారు. ప్రకృతి వ్యవసాయ పద్దతులు ఉపయోగించి, సేంద్రీయ ఎరువులను వినియోగించి మొక్కలు పెరిగేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. తొలి ఏడాది కావడంతో అక్కడక్కడ కాయలు కనిపిస్తున్నాయి. రెండో ఏడాది నుంచి యాపిల్ కాయలు ఎక్కువగా కాస్తాయన్న ఆశాభావంతో ఉన్నారు. తొలిసారి తమ ప్రాంతంలో యాపిల్ పంట సాగు చేస్తుండటం, వాటికి యాపిల్ పండ్లు కాస్తుండటంతో స్థానిక రైతులు ఆశక్తిగా గమనిస్తున్నారు. ఈ ప్రయోగం ఫలిస్తే ఇక ప్రకాశంజిల్లా బీడు భూముల్లో యాపిల్ సాగు పెద్ద ఎత్తున చేపట్టేందుకు రైతులు సిద్దమవుతున్నారు.

నేనే కాదు.. మరో ఆరుగురు

# అమ్మాయిలతో కూడా..

ఎమ్మెల్యే శ్రీధర్ ఎపిసోడ్‌లో ఊహించని ట్విస్ట్ ఇచ్చిన వీణ..





రోజుకో వీడియో, పూటకో ట్విస్ట్ అన్నట్టుగా కంటిన్యూగా హెడ్‌లైన్స్‌లోకి వస్తోంది జనసేన ఎమ్మెల్యే అరవశ్రీధర్ వివాదం. ఇవాళ కూడా బాధితురాలు వీణ మరో రెండు బాంబులు పేల్చింది. అరవ శ్రీధర్‌కు తనతోనే కాదు, మరో ఆరుగురు అమ్మాయిలతో సంబంధం ఉందని ఆరోపించింది. అంతేకాదు 5 అబార్షన్లపై వస్తున్న విమర్శలపైనా క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేసింది బాధితురాలు.. రోజుకో వీడియో, పూటకో ట్విస్ట్ అన్నట్టుగా కంటిన్యూగా హెడ్‌లైన్స్‌లోకి వస్తోంది జనసేన ఎమ్మెల్యే అరవశ్రీధర్ వివాదం. ఇవాళ కూడా బాధితురాలు వీణ మరో రెండు బాంబులు పేల్చింది. అరవ శ్రీధర్‌కు తనతోనే కాదు, మరో ఆరుగురు అమ్మాయిలతో సంబంధం ఉందని ఆరోపించింది. అంతేకాదు 5 అబార్షన్లపై వస్తున్న విమర్శలపైనా క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేసింది బాధితురాలు.. 18నెలల్లో 5అబార్షన్లు. అసలిది సాధ్యమేనా అంటూ బాధితురాలు వీణపై విమర్శల వాన కురిసింది. అయితే తనకు జరిగింది అబార్షన్ కాదని, అబార్టెడ్ అంటున్నారు వీణ. అంటే గర్భం వచ్చిందని తెలియగానే టాబ్లెట్స్ తీసుకుని గర్భం రాకుండా చేసుకున్నానన్నది బాధితురాలి వెర్షన్. అంతేకాదు అసలు 25కోట్లు తాను అడగలేదని, అసలా వాయిస్సే తనది కాదంటూ వీణ పేర్కొన్నారు. అరవ శ్రీధర్‌కు ఆరుగురు అమ్మాయిలతో సంబంధం ఉందంటున్నారు వీణ. ఆ విషయం తెలిసినప్పటి నుంచే తాను వీడియోలను రికార్డ్ చేయడం స్టార్ట్ చేశానంటూ వీణ పేర్కొన్నారు. అలాగే దీన్ని ఒక మహిళ, పురుషుడికి సంబంధించిన అంశంగానే చూడాలని, రాజకీయాలతో ఎలాంటి సంబంధం లేదంటున్నారు వీణ. చీఎ=జఆదేశాలతో అరవశ్రీధర్‌పై కేసు నమోదైందని, ఏపీ వ్యక్తులతో సంబంధంలేకుండా, నేషనల్ వుమెన్ కమిషన్ ఆధ్వర్యంలో కమిటీ వేయాలని డిమాండ్ చేస్తున్నట్లు వీణ తెలిపారు. ఇప్పటికే ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌పై మరో వీడియో వదిలింది బాధితురాలు హర్షవీణ.. తాతంశెట్టి నాగేంద్రకు సంబంధించిన చాటింగ్‌ను బయటపెట్టిందామె. తాతంశెట్టి నాగేంద్రను అరవ శ్రీధర్ తిట్టినట్టుగా చాటింగ్‌లో కామెంట్స్ ఉన్నాయి. తాతంశెట్టి నాగేంద్రకు కొవ్వు ఉందని.. అందుకే, దేవుడు ఎక్కడ పెట్టాలో అక్కడ పెట్టాడని శ్రీధర్ అన్నట్టుగా ఆ చాటింగ్‌లో వ్యాఖ్యలు ఉన్నాయి. ఇలా రోజుకో ట్విస్ట్‌తో అరవశ్రీధర్ వివాదం పరుగులు పెడుతోంది.

క్రీడా వాయిస్

# క్రికెట్ ప్రపంచాన్ని గడగడలాడించిన రికార్డులు..

## టీమిండియా సృష్టించిన చరిత్ర మళ్లీ సాధ్యమేనా..?



పదో ఎడిషన్ టీ20 వరల్డ్ కప్ ఫిబ్రవరి 7 నుంచి మన ముందుకు రాబోతోంది. భారత్, శ్రీలంక వేదికలుగా జరిగే ఈ టోర్నీలో 20 జట్లు అమీతుమీ తేల్చుకోనున్నాయి. అయితే, టోర్నీ మొదలవ్వకముందే వివాదాలు రాజుకున్నాయి. సెక్యూరిటీ కారణాల వల్ల బంగ్లాదేశ్ స్థానంలో స్కాట్లాండ్ వచ్చింది. ఇక పాకిస్థాన్ అయితే భారత్‌తో మ్యాచ్ ఆడబోమని, బాయ్‌కాట్ చేస్తామని చేస్తున్న హడావుడి అంతా ఇంతా కాదు. ఈ నేపథ్యంలో గత 9 టోర్నీలలో నమోదైన కొన్ని అద్భుతమైన రికార్డులను ఒకసారి నెమరువేసుకుందాం.

**టీమిండియా టాప్.. రికార్డుల్లోనూ కింగ్‌లే**

వరల్డ్ కప్ చరిత్రలో అత్యధిక పరుగులు చేసిన రికార్డు విరాట్ కోహ్లీ (1,292 పరుగులు) పేరిట ఉంది. ఒకే టోర్నీలో అత్యధిక పరుగులు (319 - 2014లో) చేసిన ఘనత కూడా కోహ్లీదే. ఇక టీమిండియా ప్రస్తుత కోచ్ గౌతమ్ గంభీర్ 2007 ఫైనల్ హీరో అయితే, రోహిత్ శర్మ అత్యధిక మ్యాచ్‌లు (47) ఆడిన ప్లేయర్‌గా చరిత్ర సృష్టించాడు. 2024లో భారత్ అజేయంగా (ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా) కప్పు గెలిచిన తొలి జట్టుగా నిలిచింది. ధోనీ అత్యధిక మ్యాచ్‌లకు (33) కెప్టెన్సీ వహించిన రికార్డును భద్రంగా ఉంచుకున్నాడు.

**బ్యాటింగ్ విస్ఫోటనం.. బౌలింగ్ సంచలనం**

టీ20 వరల్డ్ కప్‌లో అత్యధిక స్కోరు శ్రీలంక (260/6 vs కెన్యా, 2007) పేరిట ఉండగా, అత్యల్ప స్కోరు నెదర్లాండ్స్, ఉగాండా (39 పరుగులు) పేరిట ఉంది. యువరాజ్ సింగ్ 2007లో ఇంగ్లాండ్‌పై కొట్టిన 12 బంతుల హాఫ్ సెంచరీ ఇప్పటికీ ఫాస్టెస్ట్ రికార్డుగా కొనసాగుతోంది. వెస్టిండీస్ వీరుడు క్రిస్ గేల్ ఒక్కడే ఈ టోర్నీలో రెండు సెంచరీలు సాధించాడు. బౌలింగ్ విషయానికి వస్తే, ఆస్ట్రేలియా పేసర్ పాట్ కమిన్స్ 2024 ఎడిషన్‌లో వరుసగా రెండు హ్యాట్రిక్‌లు సాధించి ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచాడు.

**మోస్ట్ సక్సెస్‌ఫుల్ టీమ్స్**

భారత్, వెస్టిండీస్, ఇంగ్లాండ్ జట్లు మాత్రమే ఇప్పటివరకు రెండేసి సార్లు ఛాంపియన్లుగా నిలిచాయి. ఇక ఫైనల్స్ విషయానికొస్తే.. భారత్, పాకిస్థాన్, ఇంగ్లాండ్, శ్రీలంక జట్లు అత్యధికంగా చెరో మూడు సార్లు ఫైనల్స్ చేరుకున్నాయి. 2024లో జరిగిన టోర్నీలో మొదటిసారిగా 16 నుంచి 20 జట్లకు సంఖ్యను పెంచారు, అదే సంప్రదాయం ఇప్పుడు 2026లోనూ కొనసాగుతోంది. శ్రీలంకలోని కొలంబోలో జరగాల్సిన భారత్-పాక్ మ్యాచ్ భవితవ్యంపై ఉత్కంఠ నెలకొన్నప్పటికీ, రికార్డుల పరంగా చూస్తే భారత్ స్పష్టమైన ఆధిపత్యంతో కనిపిస్తోంది.

**టీ20 వరల్డ్ కప్ విజేతల జాబితా**

2007: భారత్, 2009: పాకిస్థాన్, 2010: ఇంగ్లాండ్, 2012: వెస్టిండీస్, 2014: శ్రీలంక, 2016: వెస్టిండీస్, 2021: ఆస్ట్రేలియా, 2022: ఇంగ్లాండ్, 2024: భారత్

# నాడు సెహ్వాగ్‌కు నో చెప్పి.. నేడు రోహిత్‌కు ఎస్ అంటారా?

## ధోని భయ్యా ఇదేం లాజిక్?..రగిలిపోతున్న నెటిజన్లు




భారత క్రికెట్ చరిత్రలో ఎప్పటికీ చెరగని ముద్ర వేసిన మహేంద్ర సింగ్ ధోని, తాజాగా రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల భవిష్యత్తుపై చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో కార్చిచ్చు రేపాయి. 2027 వన్డే ప్రపంచకప్‌లో ఈ ఇద్దరు దిగ్గజాలు ఆడతారా? లేదా? అనే ఉత్కంఠ నెలకున్న తరుణంలో ధోని వారికి మద్దతుగా నిలిచారు. భారత క్రికెట్ చరిత్రలో ఎప్పటికీ చెరగని ముద్ర వేసిన మహేంద్ర సింగ్ ధోని, తాజాగా రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల భవిష్యత్తుపై చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో కార్చిచ్చు రేపాయి. 2027 వన్డే ప్రపంచకప్‌లో ఈ ఇద్దరు దిగ్గజాలు ఆడతారా? లేదా? అనే ఉత్కంఠ నెలకున్న తరుణంలో ధోని వారికి మద్దతుగా నిలిచారు. అయితే, ధోని మద్దతు పలకడం కొందరికి నచ్చితే, మరికొందరు మాత్రం పాత విషయాలను తవ్వి తీస్తూ ధోనిపై విమర్శల వర్షం కురిపిస్తున్నారు.2027 వన్డే ప్రపంచకప్ సమయానికి రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల వయసు 38-39 ఏళ్లకు చేరుకుంటుంది. ఈ నేపథ్యంలో వారు జట్టులో ఉండాలా? వద్దా? అనే దానిపై ధోని స్పందిస్తూ.. "వయసు అనేది కేవలం అంకె మాత్రమే. ఫిట్‌నెస్, ఫామ్ ఉంటే ఎవరైనా ఆడవచ్చు. విరాట్, రోహిత్ ఇప్పటికీ కుర్రాళ్లకు పోటీ ఇచ్చేలా రాణిస్తున్నారు. పెద్ద టోర్నీల్లో ఎప్పుడూ అనుభవానికి విలువ ఉంటుంది. కాబట్టి వారు 2027 వరల్డ్ కప్ ఆడటంలో నాకు ఎలాంటి అభ్యంతరం లేదు" అని తేల్చి చెప్పారు.

**ధోనిపై నెటిజన్ల ఫైర్.. ఎందుకంటే?**

ధోని వ్యాఖ్యలు విన్న నెటిజన్లు కొందరు గత చరిత్రను గుర్తు చేస్తున్నారు. ధోని కెప్టెన్సీలో ఉన్నప్పుడు ఫిట్‌నెస్ సాకుతో వీరేంద్ర సెహ్వాగ్, గౌతమ్ గంభీర్, సచిన్ టెండూల్కర్ వంటి దిగ్గజాలను రొటేషన్ పాలసీ పేరుతో పక్కన పెట్టిన విషయాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. "నాడు సీనియర్ల వల్ల ఫీల్డింగ్ స్లో అవుతోందని చెప్పిన ధోని.. ఇప్పుడు రోహిత్, విరాట్ విషయంలో వయసు గురించి ఎందుకు మాట్లాడటం లేదు?" అంటూ నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. యువీ, భజ్జీ వంటి ఆటగాళ్లను చివరి దశలో ధోని బ్యాక్ చేయలేదంటూ విమర్శలు గుప్పిస్తున్నారు.

**టీమిండియాకు మంచు ముప్పు**

కేవలం ప్లేయర్ల గురించే కాకుండా, రాబోయే టీ20 ప్రపంచకప్‌లో భారత్‌కు ఎదురయ్యే అతిపెద్ద సవాలు ఏంటో కూడా ధోని వివరించారు. భారత్ దగ్గర ఛాంపియన్‌గా నిలిచే అన్ని శక్తులు ఉన్నాయని, అయితే టాస్, మంచు ఫ్యాక్టర్ మ్యాచ్ ఫలితాలను తారుమారు చేయగలవని ఆయన హెచ్చరించారు. రెండో ఇన్నింగ్స్‌లో బంతిపై పట్టు చిక్కడం కష్టమవుతుందని, ఆ సమయంలో ఏ చిన్న పొరపాటు జరిగినా టోర్నీ నుంచి నిష్క్రమించే ప్రమాదం ఉందని ధోని విశ్లేషించారు.

### ఏకంగా 32 మందిని తొక్కేస్తూ

# దూసుకొచ్చిన యువ కెరటం..

## ఐసీసీ ర్యాంకింగ్స్‌లో పెను సంచలనం



టీ20 ప్రపంచకప్ 2026 ప్రారంభానికి ముందు ఐసీసీ విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్ భారత క్రికెట్‌లో పెను సంచలనం సృష్టించాయి. న్యూజిలాండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో అద్భుత ప్రదర్శన చేసిన కుర్రాళ్లు ర్యాంకింగ్స్‌లో దూసుకుపోతుంటే, మరికొందరు స్టార్ ప్లేయర్లు మాత్రం పాతాళానికి పడిపోయారు. ముఖ్యంగా ఇషాన్ కిషన్ ఏకంగా 32 మందిని వెనక్కి నెట్టి తన సత్తా చాటగా, సంజూ శామ్సన్ పరిస్థితి మాత్రం అగమ్యగోచరంగా మారింది. న్యూజిలాండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో ఇషాన్ కిషన్ ఆడిన ఇన్నింగ్స్ అతని కెరీర్‌నే మలుపు తిప్పింది. సిరీస్ నిర్ణయాత్మక మ్యాచ్‌లో కెరీర్‌లో మొదటి అంతర్జాతీయ టీ20 సెంచరీ బాదిన ఇషాన్, ఐసీసీ ర్యాంకింగ్స్‌లో ఏకంగా 32 స్థానాలు ఎగబాకి 32వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. వరల్డ్ కప్‌లో భారత్ తరఫున ఓపెనర్‌గా ఎవరు ఆడాలనే చర్చకు ఇషాన్ తన బ్యాట్‌తో సమాధానం చెప్పాడు. మరోవైపు శివం దూబే కూడా 17 మందిని వెనక్కి నెట్టి 41వ స్థానానికి చేరుకుని ఆశ్చర్యపరిచాడు.చాలా కాలం తర్వాత జట్టులోకి వచ్చిన సంజూ శామ్సన్‌కు కివీస్ సిరీస్ ఒక గోల్డెన్ ఛాన్స్. కానీ ఐదు మ్యాచ్‌ల్లోనూ సంజూ కనీసం ఒక్క హాఫ్ సెంచరీ కూడా చేయలేకపోయాడు. దీని ప్రభావం అతని ర్యాంకింగ్‌పై తీవ్రంగా పడింది. గత వారంలో 51వ స్థానంలో ఉన్న సంజూ, ఇప్పుడు 56వ ర్యాంక్‌కు పడిపోయాడు. వరల్డ్ కప్ తుది జట్టులో సంజూకు చోటు దక్కడం ఇప్పుడు కష్టంగానే కనిపిస్తోంది. తిలక్ వర్మ కూడా ఒక స్థానాన్ని కోల్పోయి ప్రస్తుతం నాలుగో ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. టీ20ల్లో భారత్ కొత్త సెన్సేషన్ అభిషేక్ శర్మ తన నంబర్ వన్ స్థానాన్ని పదిలం చేసుకున్నాడు. 917 రేటింగ్ పాయింట్లతో అతను ప్రపంచంలోనే అత్యుత్తమ టీ20 బ్యాటర్‌గా కొనసాగుతున్నాడు. ఇక టీ20 స్పెషలిస్ట్ సూర్యకుమార్ యాదవ్ కివీస్ సిరీస్‌లో టాప్ స్కోరర్‌గా నిలిచినందుకు ప్రతిఫలం దక్కింది. అతను 7వ స్థానం నుంచి 6వ స్థానానికి ఎగబాకాడు. వరల్డ్ కప్ నాటికి సూర్య మళ్లీ టాప్-3లోకి వచ్చే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. బౌలింగ్ విభాగంలో భారత్ మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి తన నంబర్ వన్ ర్యాంక్‌ను కాపాడుకున్నాడు. అయితే, పాకిస్థాన్ స్పిన్నర్ అబ్రార్ అహ్మద్ నుంచి అతనికి గట్టి పోటీ ఎదురవుతోంది. అబ్రార్ తాజాగా రెండు స్థానాలు మెరుగుపరుచుకుని రెండో ర్యాంక్‌కు చేరుకున్నాడు. వరుణ్ మరియు అబ్రార్ మధ్య కేవలం 28 రేటింగ్ పాయింట్ల తేడా మాత్రమే ఉంది. రాబోయే వరల్డ్ కప్ మ్యాచ్‌లలో వీరిద్దరి మధ్య నంబర్ వన్ స్థానం కోసం హోరాహోరీ పోరు సాగడం ఖాయంగా కనిపిస్తోంది.

# టీమిండియాకు హిస్టరీ క్రియేట్ చేసే ఛాన్స్..

మరోసారి క్రికెట్ పండుగ వచ్చేసింది. పదో ఎడిషన్ టీ20 వరల్డ్ కప్ ఫిబ్రవరి 7, 2026 శనివారం నుంచి అట్టహాసంగా ప్రారంభం కానుంది. భారత్, శ్రీలంక దేశాలు సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ మెగా టోర్నీలో మొత్తం 20 జట్లు అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాయి. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతున్న భారత్, ఈసారి కూడా ఫేవరెట్‌గా కనిపిస్తోంది. మరోసారి క్రికెట్ పండుగ వచ్చేసింది. పదో ఎడిషన్ టీ20 వరల్డ్ కప్ ఫిబ్రవరి 7, 2026 శనివారం నుంచి అట్టహాసంగా ప్రారంభం కానుంది. భారత్, శ్రీలంక దేశాలు సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ మెగా టోర్నీలో మొత్తం 20 జట్లు అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాయి. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతున్న భారత్, ఈసారి కూడా ఫేవరెట్‌గా కనిపిస్తోంది. సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలో టీమిండియా పటిష్టంగా ఉంది. 2024లో రోహిత్ శర్మ నాయకత్వంలో సౌతాఫ్రికాను ఓడించి కప్పు గెలిచిన భారత్, ఇప్పుడు వరుసగా రెండోసారి టైటిల్ గెలిచి చరిత్ర సృష్టించాలని భావిస్తోంది.

వివాదాల మధ్యే మొదలవుతున్న టోర్నీ

ఈసారి వరల్డ్ కప్ మొదలవ్వకముందే అనేక వివాదాలు చుట్టుముట్టాయి. భారత్ రావడానికి ఇష్టపడని బంగ్లాదేశ్ స్థానంలో స్కాట్లాండ్ జట్టు టోర్నీలోకి వచ్చింది. ఇక చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్, భారత్‌తో జరిగే మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేస్తున్నట్లు ప్రకటించడం ఐసీసీకి తలనొప్పిగా మారింది. ఏదేమైనా, ఫిబ్రవరి 7న భారత్ తన తొలి మ్యాచ్‌లో అమెరికాతో తలపడనుంది. అదే రోజు పాకిస్థాన్-నెదర్లాండ్స్ మధ్య కూడా మ్యాచ్ జరగనుంది. మొత్తం 20 జట్లను నాలుగు గ్రూపులుగా విభజించారు. గ్రూప్-డి ని గ్రూప్ ఆఫ్ డెత్?గా పిలుస్తున్నారు, ఎందుకంటే ఇందులో సౌతాఫ్రికా, న్యూజిలాండ్, అఫ్గానిస్థాన్ వంటి బలమైన జట్లు పోటీ పడుతున్నాయి.

**టీ20 వరల్డ్ కప్ ఏ దేశం ఎన్ని సార్లు కొట్టిందంటే?**



హిస్టరీ క్రియేట్ చేసే ఛాన్స్..మూడో కప్పుపై కన్ను

టీ20 వరల్డ్ కప్ చరిత్రలో ఇప్పటివరకు భారత్, వెస్టిండీస్, ఇంగ్లాండ్ జట్లు చెరో రెండు సార్లు చాంపియన్‌లుగా నిలిచాయి. 2007లో ధోనీ కెప్టెన్సీలో తొలి కప్పు గెలిచిన భారత్, సుదీర్ఘ నిరీక్షణ తర్వాత 2024లో రెండో కప్పును ముద్దాడింది. ఇప్పుడు గనుక సొంత గడ్డపై మూడో టైటిల్ గెలిస్తే, మూడుసార్లు టీ20 వరల్డ్ కప్ గెలిచిన ఏకైక జట్టుగా టీమిండియా రికార్డు నెలకొల్పుతుంది. అయితే ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా, న్యూజిలాండ్ జట్ల నుంచి భారత్‌కు గట్టి పోటీ ఎదురయ్యే అవకాశం ఉందని దిగ్గజ క్రికెటర్ ఎంఎస్ ధోనీ ఇప్పటికే హెచ్చరించాడు.

టీ20 వరల్డ్ కప్ విజేతల పూర్తి జాబితా (2007 - 2024),

2007: భారత్ (పాకిస్థాన్‌పై విజయం) - తొలి టీ20 ప్రపంచ విజేత. 2009: పాకిస్థాన్ (శ్రీలంకపై విజయం), 2010: ఇంగ్లాండ్ (ఆస్ట్రేలియాపై విజయం), 2012: వెస్టిండీస్ (శ్రీలంకపై విజయం), 2014: శ్రీలంక (భారత్‌పై విజయం), 2016: వెస్టిండీస్ (ఇంగ్లాండ్‌పై విజయం) - రెండోసారి కప్పు గెలిచిన తొలి జట్టు. 2021: ఆస్ట్రేలియా (న్యూజిలాండ్‌పై విజయం), 2022: ఇంగ్లాండ్ (పాకిస్థాన్‌పై విజయం) -ఇంగ్లాండ్‌కు ఇది రెండో టైటిల్ 2024: భారత్ (సౌత్ ఆఫ్రికాపై విజయం) - రోహిత్ శర్మ సారథ్యంలో భారత్‌కు రెండో కప్పు.

గ్రూపుల వివరాలు, టోర్నీ ఫార్మాట్

ఈ టోర్నీలో ప్రతి గ్రూప్ నుంచి టాప్-2 జట్లు సూపర్-8 దశకు చేరుకుంటాయి. అక్కడి నుంచి నాలుగు జట్లు సెమీఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి.

గ్రూప్ B: ఆస్ట్రేలియా, శ్రీలంక ఫేవరెట్లు.

గ్రూప్ C: వెస్టిండీస్, ఇంగ్లాండ్ జట్లకు నేపాల్, ఇటలీ నుంచి పోటీ ఉంటుంది.

గ్రూప్ D (డేంజర్ జోన్): సౌతాఫ్రికా, న్యూజిలాండ్, అఫ్గానిస్థాన్, యూఏఈ, కెనడా మధ్య భీకర పోరు జరగనుంది.

# చరిత్ర సృష్టించిన గౌతమ్ గంభీర్..

## 2007 వరల్డ్ కప్‌లో ఆ రికార్డులు చూస్తే మైండ్ బ్లాక్ అవ్వాల్సిందే..

టీమిండియా కొత్త హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన గౌతమ్ గంభీర్ ఇప్పుడు మరో భారీ మిషన్‌పై కన్నేశాడు. 2007లో ప్లేయర్‌గా భారత్‌కు పొట్టి ప్రపంచకప్‌ను అందించిన గంభీర్, ఇప్పుడు కోచ్‌గా అదే ఫీట్‌ను రిపీట్ చేయాలని పట్టుదలతో ఉన్నాడు. నిజానికి 2007 టీ20 వరల్డ్ కప్ అంటే మనకు యువరాజ్ సింగ్ ఆరు సిక్సర్లు, ధోనీ కెప్టెన్సీ మాత్రమే గుర్తొస్తాయి. టీమిండియా కొత్త హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన గౌతమ్ గంభీర్ ఇప్పుడు మరో భారీ మిషన్‌పై కన్నేశాడు. 2007లో ప్లేయర్‌గా భారత్‌కు పొట్టి ప్రపంచకప్‌ను అందించిన గంభీర్, ఇప్పుడు కోచ్‌గా అదే ఫీట్‌ను రిపీట్ చేయాలని పట్టుదలతో ఉన్నాడు. నిజానికి 2007 టీ20 వరల్డ్ కప్ అంటే మనకు యువరాజ్ సింగ్ ఆరు సిక్సర్లు, ధోనీ కెప్టెన్సీ మాత్రమే గుర్తొస్తాయి. కానీ, ఆ టోర్నీలో భారత్ చాంపియన్‌గా నిలవడానికి వెన్నెముకలా నిలిచింది మాత్రం గౌతమ్ గంభీర్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. సౌత్ ఆఫ్రికాలోని బౌన్సీ పిచ్‌లపై ప్రత్యర్థి బౌలర్లను తనదైన స్టైల్లో ఎదుర్కొని టీమిండియా టాప్ స్కోరర్‌గా నిలిచాడు. 2007 వరల్డ్ కప్‌లో గంభీర్ మొత్తం 7 మ్యాచ్‌లు ఆడి 37.83 సగటుతో 227 పరుగులు చేశాడు. ఆ టోర్నీలో అత్యధిక పరుగులు చేసిన రెండో బ్యాటర్‌గా రికార్డు సృష్టించాడు. కేవలం పరుగులు చేయడమే కాదు, క్లిష్ట సమయాల్లో జట్టును ఆదుకోవడంలో గంభీర్ స్టైలే వేరు. మరీ ముఖ్యంగా పాకిస్థాన్‌తో జరిగిన హై-వోల్టేజ్ ఫైనల్ మ్యాచ్‌లో టీమిండియా వికెట్లు కోల్పోతున్నా, ఒకవైపు పాతుకుపోయి 54 బంతుల్లో 75 పరుగులు సాధించాడు. ఆ ఇన్నింగ్స్ లేకపోతే భారత్ గౌరవప్రదమైన స్కోరు చేసేది కాదు, ఆ కప్పు వచ్చేది కూడా కాదు. అందుకే గంభీర్‌ను బిగ్ మ్యాచ్ ప్లేయర్ అని పిలుస్తారు. గౌతమ్ గంభీర్ బాటలోనే ప్రతి టీ20 వరల్డ్ కప్‌లోనూ ఎవరో ఒక భారతీయుడు పరుగుల వరద పారించాడు. 2009లో యువరాజ్ సింగ్ (153 పరుగులు) అదరగొట్టగా, 2010లో సురేష్ రైనా (219 పరుగులు) తన సత్తా చాటాడు. ఇక రన్ మెషీన్ విరాట్ కోహ్లీ గురించి చెప్పాల్సిన పనిలేదు. 2012 (185), 2014 (319), 2016 (273) మరియు 2022 (296) ఏకంగా నాలుగుసార్లు భారత్ తరఫున టాప్ స్కోరర్‌గా నిలిచి చరిత్ర సృష్టించాడు. 2021లో కేఎల్ రాహుల్ (194), ఇటీవలి 2024 వరల్డ్ కప్‌లో రోహిత్ శర్మ (257) మెరిశారు. వీరందరి కంటే ముందే గంభీర్ ఆ పునాది వేశాడనేది వాస్తవం. ప్రస్తుతం టీమిండియా పరివర్తన దశలో ఉంది. రోహిత్, విరాట్ వంటి సీనియర్లు టీ20లకు వీడ్కోలు పలకడంతో యువ రక్తాన్ని సిద్ధం చేసే బాధ్యత గంభీర్ భుజాలపై పడింది. సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీలో, గంభీర్ వ్యూహరచనలో భారత్ 2026 వరల్డ్ కప్‌ను కైవసం చేసుకోవడమే లక్ష్యంగా పెట్టుకుంది. అగ్రెసివ్ మైండ్‌సెట్‌తో ఉండే గంభీర్, యువ ఆటగాళ్లలో అదే పోరాట పటిమను నూరిపోస్తున్నాడు. మైదానంలో గంభీర్ ప్లాన్స్ వర్కవుట్ అయితే, 2007 నాటి మ్యాజిక్ మళ్లీ రిపీట్ అవ్వడం ఖాయం.



సినీ వాయిస్ CINEMA

# ఆ హీరోకు నాకు చిన్న క్లాష్ వచ్చింది..

## అంతా ఆ సినిమావల్లే అంటున్న వరుణ్ తేజ్



మెగా హీరో వరుణ్ తేజ్ సాలిడ్ హిట్ కోసం చాలా కాలంగా ఎదురుచూస్తున్నాడు. 2014లో “ముకుంద” సినిమాతో సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టాడు వరుణ్. ఈ యంగ్ హీరో విభిన్నమైన కథలు, పాత్రలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నాడు. ముకుంద, కంచె, లోఫర్, మిస్టర్, ఫిదా, తొలి ప్రేమ, అంతరిక్షం 9000 కెఎంపిహెచ్, ఎఫ్2, ఎఫ్3, గద్దలకొండ గణేష్, గని, గాండీవధారి అర్జున, మట్కా సినిమాలు చేశాడు. మెగా హీరో వరుణ్ తేజ్ ఇటీవలే తండ్రిగా ప్రమోషన్ పొందాడు. వరుణ్ తేజ్ భార్య లావణ్య ఇటీవలే మగబిడ్డకు జన్మనిచ్చిన విషయం తెలిసిందే.. వరుణ్ తేజ్ సినిమా చేసి చాలా నెలలు అయిపొయింది. మట్కా సినిమా తర్వాత వరుణ్ సినిమాలకు చిన్న బ్రేక్ ఇచ్చాడు. చాల కాలం తర్వాత ఇప్పుడు కొరియన్ కనకరాజు అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన టైటిల్ టీజర్ ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ సినిమా హారర్ కామెడీ నేపథ్యంలో తెరకెక్కుతోందని తెలుస్తుంది. ఇదిలా ఉంటే ఓ ఇంటర్వ్యూలో వరుణ్ తేజ్ చేసిన కామెంట్స్ ఇప్పుడు వైరల్ గా మారాయి. ఓ హీరోకు తనకు మధ్యలో చిన్న ఇష్యు వచ్చిందని తెలిపాడు. ఆతర్వాత తాము ఇద్దరం మంచి ఫ్రెండ్స్ అయ్యాం అని తెలిపారు వరుణ్. వరుణ్ తేజ్, నితిన్‌ల మధ్య ఓ ఇష్యు వచ్చిందట.. ఆతర్వాత తామిద్దరూ బెస్ట్ ఫ్రెండ్స్ గా మారాం అని తెలిపారు వరుణ్. ఒక దర్శకుడు వరుణ్ తేజ్, నితిన్ ఇద్దరికీ ఒకే కథను చెప్పాడట. ముందుగా ఆ కథను నితిన్ చెప్పాడట.. ఆతర్వాత తన దగ్గరకు ఆ ప్రాజెక్ట్ వచ్చిందట.. అయితే నితిన్ ఆ ప్రాజెక్టును చేయకపోవచ్చునని భావించిన వరుణ్ తేజ్, ఆ సినిమాను ఒప్పుకున్నారు. అయితే, నితిన్ ఇంకా ఆ సినిమా జరుగుతుందని అనుకుంటూనే ఉన్నాడట. ఈ విషయం వరుణ్ తేజ్ కు తెలిసినప్పుడు, ఆయన నితిన్‌కు ఫోన్ చేసి పరిస్థితిని వివరంగా చెప్పాడట. చిత్ర పరిశ్రమలో ఇలాంటి సంఘటనలు సాధారణమని వరుణ్ తేజ్ అన్నాడు. గతంలో పూరీ జగన్నాథ్ హార్ట్ ఎటాక్ సినిమాను వరుణ్ తేజ్ చేయాల్సి కానీ నితిన్ చేశాడు. అలాగే, నితిన్ చేయాల్సిన లోఫర్ సినిమాను కొన్ని కారణాల వల్ల ఆయన చేయలేకపోవడంతో వరుణ్ తేజ్ చేశాడు.. ఇలానే ఆ సినిమా కూడా నితిన్ వదులుకున్నాడనుకొని వరుణ్ తేజ్.. నితిన్ కు ఫోన్ చేయాల్సిన అవసరం లేదని అనుకున్నాడట. కానీ, ఆ ఇష్యు తర్వాత తామిద్దరి మధ్య చాలా మంచి స్నేహ బంధంగా మారిందని వరుణ్ తేజ్ చెప్పుకొచ్చాడు ఈ కామెంట్స్ ఇప్పుడు వైరల్‌గా మారాయి.

# వారణాసి కోసం నా స్టైల్ మొత్తం పక్కన పెట్టేశా..!

## అసలు విషయం బయట పెట్టిన మహేష్ బాబు

సూపర్ స్టార్ మహేష్ బాబు, దర్శకుడు రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న సినిమా వారణాసి. ఈ సినిమా షూటింగ్ ను శరవేగంగా పూర్తి చేస్తున్నారు దర్శకుడు రాజమౌళి. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ సైలెంట్‌గా జరిగిపోతుంది. ఈ సినిమాను గ్లోబల్ రేంజ్ లో తెరకెక్కిస్తున్నారు రాజమౌళి. రాజమౌళి, మహేష్ బాబు కాంబినేషన్ లో వస్తున్న వారణాసి సినిమా కోసం అభిమానులు ఎంతగా ఎదురుచూస్తున్నారు. ఈ సినిమా పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాను గ్లోబల్ రేంజ్ లో తెరకెక్కిస్తున్నారు దర్శకుడు రాజమౌళి. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతుంది. ఈ సినిమాలో ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా నటిస్తుండగా.. పృథ్వీరాజ్ సుకుమారన్ విలన్‌గా నటిస్తున్నాడు. ఇక ఈ సినిమా 2027లో విడుదల కానుంది. ఈ సినిమా ప్రమోషన్స్ ను ఇప్పటికే మొదలు పెట్టారు రాజమౌళి. ఈ మేరకు మహేష్ బాబు, ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ హాలీవుడ్ మీడియాతో ముచ్చటించారు. ఈ ఇంటర్వ్యూలో మహేష్ బాబు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఈసినిమా కోసం తనను తాను చాలా మార్చుకున్నా అని తెలిపారు. ముఖ్యంగా తన రన్నింగ్ టెక్నిక్ మార్చుకున్నా అని తెలిపారు. ఈ సినిమాలో మహేష్ శిపాత్ర చాలా డిఫరెంట్ గా ఉంటుందట. అలాగే ఈ సినిమాలో మహేష్ బాబు నిలబడే విధానం, నడిచే విధానం చాలా డిఫరెంట్ గ ఉంటుందట. మహేష్ తన పాత స్టైల్‌ను పక్కన పెట్టి, పూర్తిగా కొత్త బాడీ లాంగ్వేజ్‌ను అలవాటు చేసుకున్నట్టు మహేష్ తెలిపారు. తన బాడీ లాంగ్వేజ్‌లో మార్పు కోసం ట్రైనింగ్ కూడా తీసుకున్నారు మహేష్. మహేష్ బాబు 2024 నుంచి జర్మనీలో ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు. దాదాపు ఆరు నెలల పాటు కఠినమైన వర్క్‌షాప్స్‌లో పాల్గొన్నారు మహేష్. అయితే సినిమాలో ఆ సీన్ కేవలం 2 నిమిషాల షాట్ కోసమే అని తెలిపారు మహేష్. సినిమా సెట్ లో రాజమౌళి చేత నైస్ అనిపించుకోవడం చాలా కష్టమని.. రాజమౌళి నైస్ అన్నారంటే సీన్ పర్ఫెక్ట్ గా చేశారని అర్థం అని మహేష్ బాబు, ప్రియాంక చెప్పుకొచ్చారు. 2027 ఏప్రిల్ 7న ఈ సినిమా వరల్డ్ వైడ్ గా గ్రాండ్ గా విడుదలకానుంది.





# గుండెల నిండా బాధ.. భరించలేకున్నా..

## బిగ్ బాస్ తనూజ ఎమోషనల్.. ఏం జరిగిందంటే?

బిగ్ బాస్ తెలుగు సీజన్ 9 రన్నరప్ గా నిలిచింది కన్నడ బ్యూటీ తనూజ పుట్టస్వామి. ఓ దశలో విజేతగా నిలుస్తుందనుకున్న ఆమె అనూహ్యంగా రన్నరప్ తో సరిపెట్టుకుంది. అయితే బిగ్ బాస్ హౌస్ నుంచి బయటకు వచ్చిన తర్వాత బయట పెద్దగా కనిపించట్లేదీ అందాల తార. బిగ్ బాస్ తెలుగు సీజన్ 9 ముగిసి దాదాపు నెల రోజులు పైనే అవుతోంది. అయితే ఇప్పటికీ సోషల్ మీడియాలో తీవ్రమైన నెగెటివిటీని ఎదుర్కొంటోంది తనూజ. ముఖ్యంగా ఓ వర్గం నెటిజన్లు తనూజను టార్గెట్ చేసి విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని తెలుస్తోంది. తాజాగా ఈ విషయంపై ఓపెన్ అయ్యిందీ ముద్దుగుమ్మ. అనవసరపు ట్రోలింగ్ వల్ల తాను మానసిక వేదన అనుభవిస్తున్నానంటూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది.ఈ మేరకు సోషల్ మీడియాలో ఓ ఎమోషనల్ పోస్ట్ పెట్టింది తనూజ.. ‘చాలాకాలంగా నా మనసులో తిరుగుతున్నదంతా మీతో చెప్పాలనుకుంటున్నాను. ముందుగా నన్ను నిందించడం ఆపండి. మీ అందరిలాగే నాకూ ఒక లైఫ్ ఉంది. నా పనేదో నేను చేసుకుంటున్నాను. నా బాధ్యతల్ని నేను నిర్వర్తిస్తున్నాను. ఎవరి జీవితాల్లో వారందరూ బిజీ అయిపోయాం. ప్రతిదానికి పీఆర్(డబ్బులు పెట్టి ఒక టీమ్ నడపడం) అనడం మానేయండి. నాకు పీఆర్ టీమ్ అంటూ ఏదీ లేదు. నా సోషల్ మీడియా అకౌంట్స్ చూసుకోవడానికి మాత్రం ఒక వ్యక్తి ఉన్నారంతే! ఈరోజుకూ నాపైన సామాజిక మాధ్యమాల్లో తీవ్రమైన నెగెటివిటీ వస్తోంది. ప్రతిరోజు అసభ్యకరంగా దూషిస్తూ కామెంట్లు పెడుతున్నారు. నేను వేరొకరిని టార్గెట్ చేశానని, వారిని చెడుగా చిత్రీకరించాలని చూస్తున్నానని తప్పుగా అర్థం చేసుకుంటున్నారు. అవతలివారిపై మీకున్న ప్రేమను అర్థం చేసుకోగలను. కానీ, నేనెలాంటి పరిస్థితిలో ఉన్నానో మీకు తెలుసా? నేనెంత నరకం అనుభవిస్తున్నానో మీకు తెలుసా? ప్రతి రోజు చెండాలమైన మాటలంటున్నారు. నా క్యారెక్టర్‌ను తక్కువ చేసి మాట్లాడుతున్నారు. లేని పోని నిందలేసి అవమానిస్తున్నారు. నా క్యారెక్టర్‌ను తప్పు పడుతుంటే ఒక మహిళగా భరించలేకపోతున్నాను. నోటికొచ్చిన మాటలనడం మీకు చిన్న విషయమేమో! నన్ను మాత్రం మానసికంగా ఎంతో కుంగదీస్తున్నాయి. మనసుకు మానని గాయాలు చేస్తున్నాయి. ఈ బాధనంతా భరిస్తున్నాను. ఎవరితో పంచుకోలేక మౌనాన్ని ఆశ్రయించాను. మీలాగే నాకూ ఓ కుటుంబం ఉందిగా. మీరు నా గురించి వాగే చెత్తవాగుడు, చెత్త కామెంట్స్ నా కుటుంబసభ్యులు కూడా చదువుతారు. అప్పుడు వాళ్లెంత బాధపడతారు? అసభ్య కామెంట్లు పెట్టే ఫేక్ అకౌంట్స్ ఎక్కడినుంచి పుట్టుకొస్తున్నాయో అర్థం కావడం లేదు. నేనే కాదు, నాకు సపోర్ట్‌గా నిలబడ్డవారిని కూడా ద్వేషిస్తున్నారు. ఒకర్ని మానసికంగా హింసిస్తే ఏమొస్తుంది? ఒకరిపై విషం చిమ్మితే ప్రశాంతంగా ఉండొచ్చనుకుంటున్నారా? ఇక్కడ నేనెవరనీ టార్గెట్ చేయడం లేదు. అలాగే డ్రామా క్రియేట్ చేయాలని అసలే అనుకోవట్లేదు. నా పని నేను చేసుకుంటూ ప్రశాంతంగా, గౌరవంగా జీవించాలనుకుంటున్నాను’ అని రాసుకొచ్చింది తనూజ. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట వైరల్ గా మారింది. మరి దీనితోనైనా ఆమెపై ట్రోలింగ్ తగ్గుతుందేమో చూడాలి.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...

- భక్తి వాయిస్
- బిజినెస్ వాయిస్
- సినీ వాయిస్
- క్రైం వాయిస్
- హెల్త్ వాయిస్
- కిసాన్ వాయిస్
- తీర్పు వాయిస్
- సక్సెస్ వాయిస్
- వనిత వాయిస్
- కిడ్స్ వాయిస్
- తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com